
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 196

శుక్రవారం 7-10-2022



రెండో రోజూ మార్కెట్లు ప్లస్
- సెన్సెక్స్ 157 పాయింట్లు అప్
- 58 పాయింట్లు బలపడిన నిఫ్టీ - 13లో



సాయిప్రణీత్‌కు స్వర్ణం
జాతీయ క్రీడల్లో బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ విజేతలుగా సిక్కిరెడ్డి–గాయత్రి -11లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
II
శ్రీకాకుళం
శుక్రవారం ॥ 7-10-2022

పిల్లల విషయంలో
ప్రతిదాంట్లో జోక్యం చేసుకునే తల్లిదండ్రుల
పెంపకాన్ని 'హెలికాప్టర్ పేరెంటింగ్' అంటారు.
అన్ని వాళ్లే నేర్చుకుంటారులే అని పిల్లల్ని
పూర్తిగా వదిలేయడాన్ని
'ఫ్రీ రేంజ్ పేరెంటింగ్' అంటారు.
అయితే...
ఈ రెండూ సరి కాదని నిపుణులు అంటారు.
అందుకే ఇప్పుడు 'సిటర్‌వైజింగ్' ట్రెండ్ నడుస్తోంది.
పిల్లలతో కూచుని వారు చేసే పనిని పక్కన నుండి
చూడటమే సిటర్‌వైజింగ్.
తమ పక్కనే తల్లిదండ్రులు ఉంటూ తాము చేసే పనులను
ఆనందిస్తున్నారు అనే భావన పిల్లలకు మేలు చేస్తోంది.
అలాగే పిల్లలను దగ్గరి నుంచి గమనించడం
తల్లిదండ్రులకు వారిని చేరువ చేస్తోంది.
ఈ 'సిటర్‌వైజింగ్' మనం కూడా ఫాలో కావచ్చు.



● కొత్త ట్రెండ్ / సిటర్‌వైజింగ్

పిల్లలతో కూచోండి దగ్గరగా చూడండి

తల్లిదండ్రులను గిల్టీలోకి నెట్టే మాటలు ఉంటాయి. 'మీరు పిల్లలతో సరిగ్గా గడపడం లేదు', 'వాళ్లను గాలికి వదిలేశారు', 'వాళ్లు ఏం తింటున్నారో ఏం చదువుతున్నారో కూడా చూడటం లేదు', 'వాళ్లతో ఆడుకోవడం లేదు'... ఇలాంటివి. లేదా 'మీరు పిల్లల్ని మరీ అతిగా పట్టించుకుంటున్నారు', 'వారికి ఊపిరాడనివ్వడం లేదు', 'హిట్లర్‌లాగా పెంచుతున్నారు'... ఇలా. ఈ రెండు రకాల కామెంట్లూ తల్లిదండ్రులను కలవరపాటుకు గురిచేస్తాయి. ఏదైనా తప్పు చేస్తున్నామా అని అయోమయంలో పడేస్తాయి. పిల్లల్ని అస్సలు పట్టించుకోకపోవడం లేదా అతిగా పట్టించుకోవడం... రెండూ కూడా ప్రతికూల ఫలితాలే ఇస్తాయంటారు నిపుణులు. అందుకే ఇప్పుడు 'సిటర్‌వైజింగ్' ట్రెండ్‌లోకి వచ్చింది. మామూలుగా పర్యవేక్షిస్తే సూపర్‌వైజింగ్. పిల్లలతో పాటు కూచుని వారిని పర్యవేక్షిస్తే అది 'సిటర్‌వైజింగ్'.

■ ఏమిటి ఈ సిటర్‌వైజింగ్

అమెరికాలో టీచర్‌గా పని చేసి, పేరెంటింగ్ టిప్స్ ఇచ్చే సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు పొందిన సూసీ అలిసన్ తన పిల్లలతో తాను సమయం గడపడాన్ని 'సిటర్‌వైజింగ్' అంది. పిల్లలు ఆడుకుంటూ ఉంటే తను పక్కనే కూచుని వారిని ఆడుకోవడం చూడటాన్ని వీడియోగా పోస్ట్ చేస్తూ 'ఇదే ఇప్పుడు అవసరమైన సిటర్‌వైజింగ్' అంది. దాంతో ఇది ట్రెండ్‌గా మారింది. తల్లిదండ్రులు చాలామంది ఇన్‌స్టాలో, ఫేస్‌బుక్‌లో రీల్స్ చేసి మరీ తమ పిల్లలతో తాము చేస్తున్న సిటర్‌వైజింగ్ వీడియోలను పోస్ట్ చేస్తున్నారు.

■ పిల్లలతో కూచోవాలి

పిల్లలతో కూచోవాలి... అలాగే మనం కూడా రిలాక్స్ కావాలి... అంటే ఇద్దరూ ప్రయోజనం పొందేలా స్నేహం పెంచుకునేలా చూసుకోవడమే సిటర్‌వైజింగ్. ఉదాహరణకు పిల్లలు ఆడుకుంటూ ఉంటే పార్కులు వారికి సమీపంలో కూచుని అవసరమైన ఫోన్ కాల్స్ మాట్లాడుకోవచ్చు. అమ్మ దగ్గరే ఉంది అని పిల్లలు బెరుకు లేకుండా ఉంటారు. అలాగే అమ్మ తమని చూస్తూ ఉంది అని ఉత్సాహంగా ఆడతారు. అలాగే పిల్లల ఆట మీద ఒక కన్నేసి పెట్టి వారు ఎంజాయ్ చేయడం చూసి తల్లి కూడా ఎంజాయ్ చేయొచ్చు. ఇంటికి తిరిగెళుతూ ఆ కబుర్లు మాట్లాడుకోవచ్చు. పిల్లలు చదువుకుంటూ ఉంటే పక్కనే కూచుని తల్లి ల్యాప్‌టాప్ మీద ఆఫీస్ పని చేసుకుంటూ ఉంటే తండ్రి తల్లికి సాయంగా కూరగాయలు తరుగుతూ ఉండొచ్చు. తమ సమీపంలో తల్లిదండ్రులు ఉన్నారని, తాము చదువుకోవడం చూసి వారు మెచ్చుకుంటారని భావించిన పిల్లలు చదువుకుంటారు.

> తమ సమీపంలో తల్లిదండ్రులు ఉన్నారని, తాము చదువుకోవడం చూసి వారు మెచ్చుకుంటారని భావించిన పిల్లలు చదువుకుంటారు. తమ పనులు తాము చేసుకుంటూనే తల్లిదండ్రులు వారి చదువు ఎలా సాగుతున్నదో పరిశీలించవచ్చు.

తమ పనులు తాము చేసుకుంటూనే తల్లిదండ్రులు వారి చదువు ఎలా సాగుతున్నదో పరిశీలించవచ్చు. పిల్లలు వీడియో గేమ్స్ ఆడేటప్పుడు కూడా పక్కన సోఫాలో వొత్తిగిలి తల్లో, తండ్రో పేపర్ తెరిస్తే వీడియో గేమ్స్ ఎలాంటివి ఆడాలో ఎంతసేపు ఆడాలో పిల్లలకు చెప్పకుండానే అర్థమైపోతుంది. పిల్లలను సినిమా హాలు దగ్గర వదిలిపెట్టి తిరిగి పికప్ చేసుకోవడం కన్నా వారితో కలిసి సినిమా చూడటమే తల్లిదండ్రులతో వారి దగ్గరితనానికి దారి తీస్తుందని అంటారు నిపుణులు.

■ అవసరమైన ప్రమేయం

పిల్లలు, తల్లిదండ్రులు ఇద్దరూ ఇంట్లో ఉన్నప్పుడు పిల్లలతో కచ్చితంగా అరగంటో గంటో కూచోవడం వారి ఏదో ఒక చర్య సమయంలో తోడు ఉన్నామని భావన కల్పించడం ముఖ్యం అంటున్నారు నిపుణులు. పిల్లలు ఆత్మవిశ్వాసంతో నేర్చుకోవడానికే కాదు ఏదైనా ప్రమాదం వస్తే దాపునే తల్లిదండ్రులు ఉన్నారు తమనే చూస్తున్నారనే ధైర్యం వారికి ఉంటుంది. అదే సమయంలో వారితో కలిసి వ్యాయామం చేయడం, చెస్ ఆడటం, వారు అడిగితే హోమ్‌వర్క్‌కు సలహా ఇవ్వడం ఇవన్నీ కూడా మంచి పేరెంటింగ్ కిందకు వస్తాయి. మరీ దగ్గరగా మరీ దూరంగా కాకుండా అక్కర ఉన్నంత మేరకే ప్రమేయం చూపుతూ 'వారికి స్వేచ్ఛ ఉంది, అలాగే మా జవాబుదారీతనం ఉంది' అనే భావన కలిగించడమే ఈ సిటర్‌వైజింగ్.

తల్లిదండ్రుల చేతికి ఫోన్లు వచ్చాక లేదా బతుకుబాదరబందీ వల్ల పరుగులో మునిగిపోయాక తీరిగ్గా పిల్లల పక్కన ఎంతసేపు కూచుంటున్నామో పిల్లల్ని ఎంతసేపు కూచోబెట్టుకుంటున్నామో ప్రతి తల్లిదండ్రులు ఆలోచించాలి. 'కూచుని' ఆలోచించాలి. ఇది ఇరుపక్షాలకు మంచిది.

ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకునేందుకు ఈ మధ్యకాలంలో చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకుంటున్నాం. పండగ సందడిలో క్యాలరీలను పట్టించుకోకుండా నోటికి రుచించిన ప్రతివంటకాన్ని లాగించేశాం. ఇప్పుడు ఒక్కసారిగా చప్పగా ఉండే మిల్లెట్స్ తినాలంటే కష్టమే. అయినా కూడా క్యాలరీలు తగ్గించి ఆరోగ్యాన్ని పెంచే సిరి ధాన్యాలను నోటికి రుచించేలా ఎలా వండుకోవాలో చూద్దాం....

రుచుల సిరి

వంటిల్లు

మిల్లెట్ మురుకులు



కావలసినవి: ఊదలు – కప్పు, బియ్యప్పిండి – అరకప్పు, పుట్నాల పొడి – అర కప్పు, నూనె – వేయించడానికి సరిపడా, వాము – టీస్పూను, వెన్న – అరటేబుల్ స్పూను, ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● ఊదలను దోరగా వేయించి పిండిపట్టుకోవాలి ●ఒకగిన్నెలో ఊదలపిండితోపాటు మిగతా పదార్థాలన్ని వేయాలి. రుచికి సరిపడా ఉప్పు వేసి, కొద్దికొద్దిగా నీళ్లపోస్తూ పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పది నిమిషాల పాటు పిండిని నానబెట్టి, తరువాత మురుకుల్లా వత్తుకుని గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు నూనెలో వేయించి తీసేయాలి ● చల్లారాక గాలి చొరబడని డబ్బాలో నిల్వచేసుకుని స్నాక్‌గా సర్వ్‌చేసుకోవచ్చు.

ఊదల ఊతప్పం



కావలసినవి: ఊదలు – కప్పు, కందిపప్పు – అరకప్పు, పచ్చిశనగపప్పు – అరకప్పు, మినపగుళ్లు – గుప్పెడు, ఎండు మిర్చి – నాలుగు, జీలకర్ర – అర టీస్పూను, ఉల్లిపాయ – ఒకటి (సన్నగా తరగాలి), కరివేపాకు – రెండు రెమ్మలు, ఉప్పు – రుచికి తగినంత, నూనె – ఊతప్పం వేయించడానికి సరిపడా.

తయారీ: ● ఊదలు, కందిపప్పు, శనగపప్పు, మినపగుళ్లను శుభ్రంగా కడిగి మూడు గంటలు నానబెట్టాలి ●నానిన పప్పులన్నింటిని బ్లెండర్‌లో వేసి, ఎండుమిర్చి, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పువేసి మెత్తగా రుబ్బుకోని మూడు గంటలు పక్కన పెట్టుకోవాలి ● మూడు గంటల తరువాత ఉల్లిపాయ ముక్కలను పిండిలో వేసి కలపాలి ●వేడెక్కిన పెనంపై కొద్దిగా నూనెవేసి పిండిని ఊతప్పంలా వేసి రెండు వైపులా చక్కగా కాల్చుకుని నచ్చిన చట్నీతో సర్వ్ చేసుకోవాలి.

కొర్రల ఇడ్లీ



కావలసినవి: కొర్రలు – మూడు కప్పులు, మినపగుళ్లు – కప్పు, మెంతులు – రెండు టీస్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● కొర్రలు, మినపగుళ్లు, మెంతులను శుభ్రంగా కడిగి కొర్రలను విడిగా, మినపగుళ్లు, మెంతులను కలిపి ఐదు గంటలు నానబెట్టాలి ● కొర్రలు, మినపగుళ్లు చక్కగా నానాక కొద్దిగా నీళ్లు పోసుకుని విడివిడిగా మెత్తగా రుబ్బుకోవాలి ● ఈ రెండిటినీ కలిపి కొద్దిగా ఉప్పు వేసి పులియనివ్వాలి ● పులిసిన పిండిని ఇడ్లీ పాత్రలో వేసుకుని ఆవిరి మీద ఉడికించాలి. వేడివేడి కొర్రల ఇడ్లీలు సాంబార్, చట్నీతో చాలా బావుంటాయి.

మిల్లెట్ హల్వా



కావలసినవి: కొర్రలు – కప్పు, బెల్లం – కప్పు, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను, కిస్‌మిస్‌లు – టేబుల్ స్పూను, నెయ్యి – పావు కప్పు, యాలకులపొడి – పావు టీస్పూను.

తయారీ: ● ముందుగా కొర్రలను మరీ మెత్తగా కాకుండా బరకగా పొడిచేసుకుని పక్కన పెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, పావు కప్పు నీళ్లు పోసి బెల్లం కరిగేంత వరకు మరిగించి పొయ్యిమీద నుంచి దించేయాలి ● మరో బాణలిలో నెయ్యివేసి వేడెక్కనివ్వాలి. నెయ్యి కాగాక జీడిపప్పు పలుకులు, కిస్‌మిస్‌లు వేసి బంగారు వర్ణం వచ్చేంతవరకు వేయించి పక్కనపెట్టుకోవాలి ● ఇదే బాణలిలో కొర్రల పొడి వేసి ఐదు నిమిషాలు వేయించాలి ● వేగిన పొడిలో నాలుగు కప్పులు నీళ్లపోసి ఉండలు కట్టకుండా కలుపుతూ ఉడికించాలి ● నీళ్లన్నీ ఇగిరాక బెల్లం నీళ్లను వడగట్టి పోయాలి ● కొర్రలు, బెల్లం నీళ్లు దగ్గర పడేంత వరకు ఉడికించాలి. నెయ్యి పైకి తేలుతున్నప్పుడు యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసి కలిపి దించేయాలి.

యువర్స్



అందాల పోటీలు మానవమాత్రులకే కాదు ఒంటెలకు కూడా జరుగుతాయనే విషయం మీకు తెలుసా! ప్రతి సంవత్సరం అబుదాబి (యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్)లో ఒంటెల అందాల పోటీలు ఘనంగా జరుగుతాయి. ప్రైజ్‌మనీ కూడా ఘనంగా ఉంటుంది. ఈ పోటీలో వివిధ ప్రాంతాలకు చెందిన పాతికవేలకు పైగా ఒంటెలు పాల్గొంటాయి. నిబంధనలు చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాయి. ఎవరైనా వాటిని ఉల్లంఘించే ప్రయత్నం చేస్తే వారి ఒంటెను పోటీకి అనర్హురాలిగా ప్రకటిస్తారు. ఈ పోటీ పుణ్యమా అని పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

స్ఫూర్తి

వారధి

'ఎంత కాలం జీవించావు అని కాదు, ఎంతమందికి సహాయం చేశావు అనేది జీవిత పరమావధి' అంటారు పెద్దలు. చిన్న వయసులోనే పెద్ద మనసుతో రకరకాల సేవాకార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నాడు మనన్‌ఖన్నా. దోనర్స్–స్వచ్ఛంద సంస్థల మధ్య 'డీఈజీ' ప్లాట్‌ఫామ్‌తో బలమైన వారధిని సృష్టించాడు 17 సంవత్సరాల మనన్‌ఖన్నా.





మనన్ ఖన్నా

ఢిల్లీలోని ఆర్‌కేపురం 'ఢిల్లీ పబ్లిక్‌స్కూల్' విద్యార్థి మనన్‌ఖన్నా గ్రేడ్ 12 చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరికీ ఇంజనీరింగ్ నేపథ్యం ఉంది. ఖన్నాకు ఆటలు అంటే ఇష్టం. సంగీతం అంటే చెవి కోసుకుంటాడు. ట్రెక్కింగ్‌కు సై అంటాడు. డిబేట్‌లలో చురుగ్గా పాల్గొంటాడు. బ్లాగ్స్ రాస్తాడు. ఇవన్నీ ఒక ఎత్తయితే సామాజికసేవ మరో ఎత్తు.

స్కూల్ నినాదం 'సర్వీస్ బిఫోర్ సెల్ఫ్' తన గుండెలో ముద్రించుకుపోయింది.

ఈ ప్రభావంతోనే రకరకాల స్వచ్ఛంద సంస్థలలో పనిచేశాడు. క్షేత్రస్థాయిలో పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాడు. తన దృష్టి విశాలం అయింది.

ఒకరోజు...

కామన్ డస్ట్‌బిన్ ఏరియాలో పాతబట్టలు, బొమ్మలు, బూట్లు... మొదలైనవి పడి ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే తిరిగి ఉపయోగించుకోవచ్చు అనిపించింది.

'వాటిని అవసరంలో ఉన్న వారికి అందించకుండా ఎందుకు ఇలా వృథాగా పడేస్తున్నారు?' అని ఆలోచించినప్పుడు, దీని గురించి ఇతరులతో చర్చించినప్పుడు రకరకాల విషయాలు తెలిసాయి. వాటిలో ప్రధానమైనవి... టైమ్ లేకపోవడం, ఎవరికి ఇవ్వాలో తెలియకపోవడం. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని తనకు ఉన్న కంప్యూటర్ సైన్స్ పరిజ్ఞానంతో ఏఐ ఆధారిత డొనేషన్ ప్లాట్‌ఫామ్ 'డీఈజీ' ప్రారంభించాడు ఖన్నా.

అయితే ఇది అనుకున్నంత సులువు కాదని అర్థమైంది.

రకరకాల సవాళ్లు ఎదురయ్యాయి.

ఫీల్డ్ ఫీడ్‌బ్యాక్, ఫండింగ్, టీమ్ ఏర్పాటు చేసుకోవడం...ఇలా ఎన్నో విషయాల్లో ఎంతో కష్టపడాల్సి వచ్చింది. ఆ కష్టమేమీ వృథా పోలేదు. డోనర్స్, స్వచ్ఛంద సంస్థలకు మధ్య బలమైన వారధిగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు.

> స్కూల్ నినాదం 'సర్వీస్ బిఫోర్ సెల్ఫ్' ఖన్నా గుండెలో ముద్రించుకుపోయింది. ఈ ప్రభావంతోనే రకరకాల స్వచ్ఛంద సంస్థలలో పనిచేశాడు. క్షేత్రస్థాయిలో పని చేయడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాడు. తన దృష్టి విశాలం అయింది.

'డీఈజీ' యాప్... యాప్ స్టోర్, ప్లేస్టోర్‌లలో అందుబాటులో ఉంటుంది.

ఆహారం, దుస్తులు, పాదరక్షలు, పుస్తకాలు, కంప్యూటర్, స్టేషనరీ, ఫర్నీచర్, బర్త్‌డే సెలబ్రేషన్స్, క్వాలిటీ వెరిఫికేషన్, ఎమర్జెన్సీ అలర్ట్ (సత్వర వైద్య అవసరం కోసం).... మొదలైన ఎన్నో విభాగాలు ఈ మొబైల్ అప్లికేషన్ ప్లాట్‌ఫామ్‌లో ఉన్నాయి.

విద్యార్థుల్లో సేవాగుణాన్ని పెంపొందించడానికి తాను చదివిన, విన్న గొప్ప మనసు ఉన్న దాతల గురించి స్కూల్ సమావేశాలలో చెబుతుంటాడు ఖన్నా. డొనేషన్స్, స్వచ్ఛందసంస్థలకు సంబంధించి తాను రూపొందించిన పరిశోధన పత్రం ఐఈఈఈ ఎక్స్‌ప్లోర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఎంపికై ప్రచురితమైంది. దీనికి మంచి స్పందన లభించింది.

'సేవాగుణం అనేది మనల్ని పూర్తిగా మార్చివేసే కొత్త మనిషిగా తీర్చిదిద్దుతుంది. మనలో నుంచి కోపం మాయమైపోతుంది. ఓర్పు అనేది ఆభరణంగా ప్రకాశిస్తుంది. సేవా పథంలో ప్రయాణం చేయడం అంటే సమాజం గురించి తెలుసుకోవడం మాత్రమే కాదు, మన గురించి మనం పూర్తిగా తెలుసుకోవడం. మార్పు దిశగా ప్రయాణించడం' అంటున్నాడు మనన్ ఖన్నా.

ENGLISH ఇడియమ్స్

అండర్ ది రోజ్

ఒక విషయాన్ని రహస్యంగా ఉంచాలి, ఎవరికీ చెప్పవద్దు... ఇలాంటి సందర్భాల్లో ఉపయోగించే ఇడియమ్... **అండర్ ది రోజ్.**

ఉదా: *ఐ హ్యాడ్ నో ఐడియా దే వర్ ప్లానింగ్ టు రిజెక్ట్ ది ప్రపోజల్. దే మస్ట్ హ్యావ్ రీచ్‌డ్ దట్ డెసిషన్ అండర్ ది రోజ్*

గులాబీపువ్వు అంటే మనకు లవ్ సింబల్. అయితే రోమన్ పురాణాలలో మాత్రం రహస్యానికి సంకేతం. అలనాటి సమావేశ మందిరాలను (మీటింగ్ హాల్స్)ను గులాబీ పువ్వులతో అలంకరించే వారు. దీనికి కారణం...సమావేశానికి సంబంధించిన విషయాలు బయటి ప్రపంచానికి తెలియవద్దు అని క్షణ క్షణం గుర్తు చేయడం. కన్ఫెషన్స్‌లలో కూడా సూచనప్రాయంగా 'ఇది రహస్యం. బయటికి తెలియకూడదు' అని అక్కడక్కడా గులాబీలను పెట్టేవాళ్లు.

● ట్రెండ్

పాడ్‌కాస్ట్ పథంలో....



కోవిడ్ టైమ్‌లో యూత్‌కు సన్నగా పరిచయం అయిన 'పాడ్‌కాస్ట్' ఇప్పుడు వారికి ఆత్మీయనేస్తం అయింది. హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన చరితకు పాటలు వినడం అంటే ఇష్టం. అయితే ఇప్పుడు ఆమె పాడ్‌కాస్టింగ్‌లో పాటలు ఒక భాగం మాత్రమే. 'నాకు పాటలు వినడం అంటే ఎంత ఇష్టమో ట్రావెల్ చేయడం అంటే కూడా అంతే ఇష్టం. ముసాఫిర్ స్టోరీస్‌లాంటి ట్రావెల్ పాడ్‌కాస్ట్‌ల ద్వారా ఎప్పటికప్పుడూ కొత్త విషయాలు తెలుసుకోగలుగుతున్నాను' అంటుంది చరిత.

నాగ్‌పూర్‌కు చెందిన భానుకు రాత్రి ఒక పట్టాన నిద్ర పట్టదు. అయితే ఎవరైనా కబుర్లు చెబుతుంటే, వింటూ వింటూ నిద్రపోతుంటాడు! ఇప్పుడు అతడికి పాడ్‌కాస్ట్ అనేది ఆత్మీయనేస్తం అయింది. ఎన్నో రంగాలకు చెందిన కబుర్లు వింటూ వింటూ నిద్రపోతుంటాడు.

పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు సంవత్సరాల వయసు మధ్య ఉన్నవారి నుంచి పాడ్‌కాస్ట్‌కు అమితమైన ఆదరణ లభిస్తున్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

యూత్‌కు దగ్గరైన పాడ్‌కాస్ట్ జానర్‌లలో 'మెంటల్ హెల్త్' అగ్రస్థానంలో ఉంది.

భోపాల్‌కు చెందిన తన్వీకి అకారణ దిగులు. ఎలాంటి సమస్యా లేదు...మరి దిగులెందుకో తెలియదు! స్నేహితుల సలహా మేరకు 'ది హ్యాపీ టైమ్స్' 'ఎమోషనల్ ఫీల్' 'బుద్ధిస్ట్ సొల్యూషన్స్ ఫర్ లైఫ్స్ ప్రాబ్లమ్స్'....మొదలైన పాడ్‌కాస్ట్‌లు వింటూ ఉంది. ఇప్పుడు ఆ అకారణ దిగులు మాయం అయినట్లు చెబుతుంది తన్వీ. యూత్‌కు స్ట్రెస్ బస్టర్‌గా పాడ్‌కాస్టింగ్ ఉపయోగపడుతోంది. తెలుసుకోవడం, నేర్చుకోవడం, పరిష్కారాలు అందిపుచ్చుకోవడానికి మాత్రమే పరిమితం కావడం లేదు. సృజనాత్మకంగా స్వీయ వ్యక్తీకరణకు పాడ్‌కాస్టింగ్‌ను బలమైన వేదికలా ఉపయోగించుకుంటోంది యూత్.

● టెక్..టాక్

ఒకే ఫొటోతో వీడియో...



ఒకే ఒక ఫొటో. కొన్ని పదాలతో 'క్రియేటివ్ రియాలిటీ స్టూడియో' అనే ఫ్రీ యాప్‌తో ఆకట్టుకునే వీడియోను సృష్టించవచ్చు. ఇజ్రాయెల్‌కు చెందిన ఏఐ ఆధారిత కంపెనీ డి–డిఐ ఈ యాప్‌ను రూపొందించింది. విద్య, కార్పొరేట్ రంగాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని తీసుకువచ్చింది. వీడియో క్రియేట్ చేయడానికి...

1. ఇ–మెయిల్ ఐడీతో ప్లాట్‌ఫామ్‌లో సైన్ కావాలి
2. లాగ్ అయిన తరువాత ఒక ఇమేజ్‌ను అప్‌లోడ్ చేయడం లేదా ప్రీ–క్రియేటెడ్ లిస్ట్ నుంచి 'స్టార్ట్ ది వీడియో క్రియేషన్ ప్రాసెస్' ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
3. ప్రీమియం ఫీచర్స్‌లో బెటర్ ఫెషియల్ ఎక్స్‌ప్రెషన్స్, హ్యాండ్ మూమెంట్స్... ఇలా ఎన్నో యాడ్ చేయవచ్చు 4. ఫొటో తరువాత టెక్స్ట్ సమకూర్చి, స్పీచ్‌కు సంబంధించిన ఆడియో క్లిప్ అప్‌లోడ్ చేయాలి. 119 లాంగ్వేజ్ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి.

● గేమింగ్



ఆగ్రహంతో ఆ గ్రహంలో...

యాక్షన్–ఎడ్వెంచర్ సర్వైవల్ గేమ్ 'నో మ్యాన్స్ స్కై' నేడు విడుదల అవుతోంది. ఎక్స్‌ప్లోరేషన్, సర్వైవల్, కంబాట్, ట్రేడింగ్ బేస్ బిల్డింగ్...అనే నాలుగు స్తంభాలపై నిర్మించిన ఆట ఇది. ఈ గేమ్‌లో అనంతమైన విశ్వాన్ని అన్వేషించవచ్చు. కోటానుకోట్ల నక్షత్రాలను పలకరించవచ్చు. అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకోవచ్చు. సెటిల్‌మెంట్లు చేయవచ్చు. 'ఎవ్రీ ప్లానెట్ యూనిక్' 'ఎవ్రీ ప్లానెట్ అన్‌ఎక్స్‌ప్లోర్' అంటూ ఇటీవల విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంది.

మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీప్లేయర్

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ , ప్లేస్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్

● ఆర్ట్ అండ్ కల్చర్



పుట్టగొడుగు కాదు గొడుగు పుట్ట!

చూడగానే నవ్వు తెప్పించే ఈ కార్టూన్‌ను గీసింది స్లొవేకియా కార్టూనిస్ట్ లుబోమిర్ కొత్ర. స్లోవిక్ టెక్నికల్ యూనివర్శిటీలో సాంకేతిక విద్య చదువుకుంటున్న లుబోమిర్, చదువు పూర్తి కాకుండానే ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్‌గా మారాడు. 1967లో తన తొలి కార్టూన్ ప్రచురితమైంది. వందకు పైగా దినపత్రికలలో వేలాది కార్టూన్‌లు గీశాడు. 'దయాగ్నొసిస్ ఎక్స్‌వై' పేరిట తొలి కార్టూన్ పుస్తకం ప్రచురించాడు. యానిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్స్ రూపొందించాడు.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 196

శుక్రవారం 7-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తొలి వన్డే దక్షిణాఫ్రికాదే

లక్నోలో జరిగిన మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో ఓడిన భారత్ - 11లో



రక్తమోడిన సంరక్షణాలయం


థాయ్‌లాండ్‌లో చిన్నారులు సహా 37 మందిని బలిగొన్న మాజీ పోలీస్ - 6లో



సిక్కు కుటుంబం దారుణ హత్య

అమెరికాలోని కాలిఫోర్నియాలో పంజాబీ కుటుంబాన్ని దుండగుడు కిడ్నాప్ చేసి హతమార్చినట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు 6లో



సమగ్ర జనాభా విధానం కావాలి

దేశంలో అన్ని వర్గాలకు సమానంగా వర్తించే సమగ్ర జనాభా విధానాన్ని రూపొందించాలని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ అన్నారు.

వివరాలు 6లో



మింగేసిన మెరుపు వరద

పశ్చిమబెంగాల్‌లో దుర్గామాత విగ్రహం నిమజ్జనం కోసం మాల్ నదిలో దిగిన 8 మంది భక్తులను ఆకస్మిక వరద కబళించింది.

వివరాలు 6లో



ప్రాణాలు తీసిన టానిక్!

హరియాణాలోని మేడిన్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేసిన దగ్గు సిరప్‌లు తాగి గాంబియాలో 66 మంది చిన్నారులు మరణించారు.

వివరాలు 6లో

వికేంద్రీకరణే ముద్దు

ఒకే రాజధాని వద్దు.. మూడు రాజధానులతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి



విజయనగరంలోని పైడితల్లి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రజా ప్రతినిధులు, ప్రజలు



గుంటూరులోని పోలేరమ్మ గుడి వద్ద 303 కొబ్బరికాయలు కొడుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, స్థానికులు

- రాష్ట్ర వ్యాప్తంగా అందరి నోటా ఇదే మాట.. విజయదశమి పర్వదినాన ఊరూరా ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల పూజలు
- విఘ్నాలు, ఆటంకాలు తొలగిపోవాలి.. దుష్టశక్తుల కుట్రలు భగ్నం కావాలి..
- రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న వారికి మంచి బుద్ధి ప్రసాదించాలి
- ప్రముఖ ఆలయాల వద్ద కొబ్బరికాయలు కొట్టి వేడుకోలు
- ముస్లింలు సైతం ప్రత్యేక ప్రార్థనలు

సాక్షి నెట్‌వర్క్: ఒకే ప్రాంతంలో అభివృద్ధిని కేంద్రీకరించడం తగదని, వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు పునరుద్ఘాటించారు. ఇందులో భాగంగా మూడు రాజధానులు ఏర్పాటయ్యేందుకు అడ్డుగా ఉన్న విఘ్నాలను తొలగించాలని విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు బుధ, గురువారాల్లో ఆలయాల వద్ద కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు పార్టీ నేతలు, శ్రేణులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు పాలనా వికేంద్రీకరణకు అమ్మవారి ఆశీస్సులు కోరారు. విజయవాడ ఇంద్రకీలాద్రిలోని శ్రీకనకదుర్గమ్మ, తిరుపతిలోని గంగమ్మ, శ్రీశైలంలో భ్రమరాంబ, విజయనగరంలో పైడి తల్లి, విశాఖలో కనక మహాలక్ష్మి ఆలయాలతో పాటు ఇతర ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ఈ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పార్టీ నేతలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి జరగాలని, అందుకు పాలనా వికేంద్రీకరణ ఒక్కటే మార్గమని ఇందుకోసం దుర్గమాత ఆశీస్సులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఉండాలని వారు ఆకాంక్షించారు. మూడు రాజధానులకు అడ్డుపడుతున్న వారికి దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించారు. అన్ని నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, ప్రజలు

మిగతా 12వ పేజీలో ▶



పన్ను చెల్లింపు సులభతరం

- అందుబాటులో మరింత పారదర్శక విధానం.. లీకేజీలను అరికట్టడానికి ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూట్‌ల సహాయం
- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- రిజిస్ట్రేషన్ ఆదాయాలపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు
- అనుమతులు పొందిన వారు మైనింగ్ ఆపరేషన్ కొనసాగించేలా చూడాలి
- సానుకూల పరిస్థితుల ద్వారా రవాణా శాఖలో ఆదాయం పెంపునకు చర్యలు

2లో

టీడీపీ నేత వేధింపులు ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

ప్రేమించాలంటూ బాలికను వేధిస్తున్న తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి

- ఒప్పుకోకపోవడంతో బాలిక తల్లిదండ్రుల ముందే బెదిరింపులు
- ఫొటోలు మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పెడతానని హెచ్చరిక
- భయపడిపోయి ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్న సంధ్యారాణి
- తన మరణానికి ఇంతియాజ్ వేధింపులే కారణమంటూ ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో
- నిందితుడు.. కదిరి టీడీపీ ఇన్‌చార్జ్ కందికుంట అనుచరుడు



సంధ్యారాణి (ఫైల్ ఫొటో)



టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు అనితతో నిందితుడు ఇంతియాజ్

సాక్షి, అమరావతి/తనకల్లు: టీడీపీ నేత వేధింపులకు ఓ బాలిక బలైపోయింది. ప్రేమించకపోతే నీ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పెడతానని బెదిరించడంతో భయపడిపోయిన ఓ ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకుంది. టీడీపీ నాయకుడి బెదిరింపుల కారణంగానే

మిగతా 2వ పేజీలో ▶

ఫ్రెంచ్ రచయిత్రికి సాహిత్యంలో నోబెల్

రసాయన శాస్త్రంలో ముగ్గురికి..



ఫ్రెంచ్ రచయిత్రి అన్నీ ఎర్నావ్

ఫ్రెంచ్ రచయిత్రి అన్నీ ఎర్నావ్ సాహిత్య రంగంలో నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. 'ద కరేజ్ అండ్ క్లినికల్ అక్యూటీ' పేరుతో వ్యక్తిగత జ్ఞాపకశక్తికి సంబంధించిన మూలాలపై చేసిన రచనలకు గాను ఈ పురస్కారం దక్కింది. రసాయన శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలను నోబెల్‌కు ఎంపిక చేశారు. పాలిమర్స్, క్యాన్సర్ ఔషధాల తయారీ, డీఎన్‌ఏ మ్యాపింగ్ వంటి వాటిలో ఉపయోగపడే క్లిక్ కెమిస్ట్రీ, బయోఆర్థోగానల్ రియాక్షన్స్‌లో చేసిన పరిశోధనలకు గాను కరోలిన్ ఆర్.బెర్టోజీ(అమెరికా), కె.బ్యారీ షార్ప్‌లెస్(అమెరికా), మోర్టెన్ మెల్డాల్(డెన్మార్క్) నోబెల్‌కు ఎంపికయ్యారు.

6లో

'సంక్షేమం' ఖర్చులో ఏపీదే అగ్రస్థానం

- పేదరిక నిర్మూలన కోసం సంక్షేమ పథకాలపై భారీగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీదే అగ్రస్థానమని హైకోర్టుకు సెర్ప్ నివేదించింది. కేంద్రం ఇస్తున్న పెన్షన్లకు, రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్లకు పొంతనే లేదని తెలిపింది. రాష్ట్ర సర్కార్ బడ్జెట్‌లో కేటాయింపులు చేసి సొంత నిధులను వెచ్చిస్తోందని పేర్కొంది. పెన్షన్ల చెల్లింపులు పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయమని.. కోర్టుల జోక్యం తగదని సెర్ప్ నివేదించింది.

2లో

ధ్వజావరోహణతో ముగిసిన

బ్రహ్మోత్సవాలు

- తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణతో అంగరంగ వైభవంగా ముగిశాయి. చక్రస్నానంతో శ్రీవారు సేదతీరారు. పెద్ద ఎత్తున భక్తులు పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

- వివరాలు 10లో



21న జీఎస్‌ఎల్‌వీ మార్క్3 ప్రయోగం

- ఈనెల 21న జీఎస్‌ఎల్‌వీ మార్క్ 3 రాకెట్ ద్వారా వన్ వెబ్ ఇండియా–1 పేరుతో 36 ఉపగ్రహాలను రోదసీలోకి పంపేందుకు ఇస్రో రంగం సిద్ధం చేస్తోంది.

- వివరాలు 6లో

టీఆర్‌ఎస్ ఇక బీఆర్‌ఎస్!

- పేరు మారుస్తూ ఆ పార్టీ ఏకగ్రీవ తీర్మానం
- జాతీయ స్థాయిలో కార్యకలాపాలకు వీలుగా పేరు మార్పు
- తీర్మానాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతూ తెలంగాణ సీఎం కేసీఆర్ లేఖ
- త్వరగా ఆమోదించాలని సీఈసీకి వినతి

2లో



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

వైఎస్సార్ పశు బీమా.. రైతులకు ధీమా!

- పశువులు, సన్నజీవాలకు వర్తింపు.. ప్రీమియంలో 80 శాతం ప్రభుత్వం చెల్లింపు
- పెద్ద జీవాలకు రూ.15 వేల నుంచి రూ.30 వేలు..
- సన్న జీవాలకు రూ.6 వేల వరకు పరిహారం.. నిర్దేశిత గడువులోగా నేరుగా చెల్లింపులు
- వైఎస్సార్ పశు బీమా పథకం అమలుకు రంగం సిద్ధం
- ప్రతిపాదనల రూపకల్పనలో పశుసంవర్ధక శాఖ



సాక్షి, అమరావతి: విపత్తులు, కరువు కాటకాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, విద్యుద్ఘాతాలతో ఏటా వేలాది మూగ, సన్నజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వీటిని కన్నబిడ్డల్లా సాకే యజమానుల బాధ వర్ణనాతీతం. తమ కుటుంబ పోషణకు వీటిపైనే ఆధారపడి జీవించేవారు ఆ జీవాలు మరణిస్తే తల్లడిల్లిపోతారు. ఈ నేపథ్యంలో వివిధ ఘటనల్లో మూగ జీవాలను కోల్పోతున్నవారిని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా వారికి అండగా నిలవనుంది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ప్రతిపాదనలను రూపొందిస్తోంది. అక్టోబర్ నెలాఖరులో శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పశువులు, మేకలు, గొర్రెలకు బీమాను వర్తింపజేయనుంది.

మరింత మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో..

వివిధ ఘటనల్లో తమ పశువులు, సన్నజీవాలను కోల్పోతున్నవారిని ఆదుకోవడానికి ఇప్పటివరకు ప్రభుత్వపరంగా బీమా పథకం అంటూ ఏమీలేదు. గతంలో బీమా పథకాలపై కాస్త అవగాహన ఉన్నవారు, ఆర్థిక స్థోమత కలిగినవారు మాత్రమే సొంతంగా తమ జీవాలకు బీమా చేయించుకునే వారు. అవి చనిపోయిన ఏడాదికో రెండేళ్లకో.. అదీ బీమా కంపెనీల చుట్టూ చెప్పులరిగేలా తిరిగితే కానీ అరకొరగా పరిహారం దక్కేది కాదు. నూటికి 95 శాతం మంది అవగాహన లేక, ఆర్థికభారం కారణంగా బీమాకు దూరంగా ఉండేవారు. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా వైఎస్సార్ పశు నష్టపరిహారం కింద 1.12 లక్షల జీవాలకు రూ.58.02 కోట్ల పరిహారం అందించింది. ఇప్పుడు మరింత మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని తీసుకొస్తోంది.

50 జీవాలకు గరిష్టంగా రూ.3 లక్షల వరకు..

వైఎస్సార్ పశు బీమా పథకం కింద నాటు ఆవులు, గేదెలకు రూ.15 వేలు, మేలు జాతి గేదెలు, ఆవులకు రూ.30 వేల చొప్పున, సన్న జీవాలకు ఒక్కో దానికి రూ.6 వేలు చొప్పున పరిహారం ఇస్తారు. ఏడాదిలో ఒక రైతుకు గరిష్టంగా ఐదు పశువులకు మాత్రమే బీమా వర్తిస్తుంది. గతంలో ఏదైనా విపత్తు బారినపడి చనిపోతే ఒక్కో కుటుంబం పరిధిలో 20 సన్నజీవాలకు రూ.1.20 లక్షలకు మించకుండా పరిహారం చెల్లించేవారు. ఇప్పుడు దాన్ని 50 జీవాలకు గరిష్టంగా రూ.3 లక్షల వరకు పరిహారం పొందేలా విస్తరిస్తున్నారు. గతంలో మూడు అంతకంటే ఎక్కువ సంఖ్యలో మరణిస్తేనే సన్నజీవాలకు పరిహారం ఇచ్చేవారు. ఇక నుంచి ఒక్క జీవి మరణించినా పరిహారం అందిస్తారు. అంతేకాదు తొలిసారి ఎద్దులు, దున్నపోతులతో పాటు కరువు బారిన పడిన పశువులకు కూడా బీమా వర్తింప చేయనున్నారు. అలాగే క్లైమ్ సెటిల్‌మెంట్‌లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పరిహారం చెల్లించేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మూగ, సన్నజీవాలకు పూర్తి స్థాయిలో బీమా కల్పించే లక్ష్యంతో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని తెస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతి పాడి పశువుతో పాటు మూగ జీవాలు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్లకు కూడా బీమా కల్పించాలని సంకల్పించాం. ఇందుకోసం ప్రభుత్వం 80 శాతం ప్రీమియం భరిస్తోంది. ఈ పథకం కోసం మార్గదర్శకాలు రూపొందిస్తున్నాం. అక్టోబర్ నెలాఖరులో ఈ పథకానికి శ్రీకారం చుట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం.

–డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

మొత్తం ప్రీమియంలో 80 శాతం ప్రభుత్వానిదే..

వైఎస్సార్ పశు బీమా పథకం కింద చెల్లించే మొత్తం ప్రీమియంలో 80 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. 20 శాతం మాత్రమే సన్న, చిన్నకారు రైతులు భరించాల్సి ఉంటుంది. దేశీయ ఆవులు, గేదెలకు ఒక్కోదానికి ప్రభుత్వం రూ.924 ప్రీమియం భరిస్తుండగా, లబ్ధిదారులు రూ.231, ఎద్దులు, దున్నపోతులకు ప్రభుత్వం ఒక్కోదానికి రూ.578 భరిస్తుండగా, లబ్ధిదారులు రూ.116, మేకలు, గొర్రెలకు ప్రభుత్వం ఒక్కోదానికి రూ.185 భరిస్తుండగా, లబ్ధిదారులు రూ.46 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద రైతుల తరఫున 80 శాతం ప్రీమియం రూపంలో ఏటా సుమారు రూ.110 కోట్ల వరకు భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పథకం ద్వారా రైతులకు బాసటగా నిలిచే సిబ్బందికి ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలని సంకల్పించింది. బీమా చేయించినందుకు రూ.50, పోస్టుమార్టంకు రూ.125 చొప్పున ఇవ్వనుంది.

ఇదంజగత్



..పార్టీని కాపాడేందుకు మరోకసారి చేస్తారా?

క్లుప్తంగా

రాష్ట్రంలో కుండపోతగా వాన

- ప్రకాశం జిల్లాలో అత్యధిక వర్షపాతం
- మరో రెండు రోజులు వానలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- పూర్తి స్థాయిలో నిండిన కంభం చెరువు

సాక్షి, అమరావతి: కోస్తాంధ్ర మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు పడతాయని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. శనివారం ఉత్తరాంధ్ర, రాయలసీమలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. వర్షాల కారణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసినట్లు ఆంధ్రప్రదేశ్ విపత్తులు నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రకాశం జిల్లా కనిగిరిలో 14.40 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం కురిసింది. కనిగిరి మండలం ఏపీ మోడల్ స్కూల్ ప్రాంతంలో 14.27 సెంటీమీటర్లు, బాపట్ల జిల్లా నగరం పరిధిలో 13.80 సెంటీ మీటర్లు, ప్రకాశం జిల్లా పొదిలి మండలం అన్నవరంలో 13.05 సెంటీమీటర్లు,ఒంగోలు మండలం ఏరరేజర్ల ప్రాంతంలో 13 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన ప్రకాశం జిల్లా కంభం చెరువు పూర్తిస్థాయిలో నిండింది.

సిమెంట్ పరిశ్రమల్లో విద్యుత్ ఆదా

'పాట్' ప్రభావంతో రూ.2,400 కోట్ల విలువైన 4,070 మి.యూ. తగ్గిన వినియోగం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సిమెంట్ పరిశ్రమల్లో చేపట్టిన ఇంధన సామర్థ్య చర్యలవల్ల 0.35 మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వివలెంట్ ఇంధనం ఆదా జరిగిందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. స్విస్ ఏజెన్సీ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ కో–ఆపరేషన్ (ఎస్డీసీ), మద్రాస్ ఐఐటీ సంయుక్తంగా మూడ్రోజుల పాటు చెన్నైలో నిర్వహించిన సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. పెర్ఫార్మ్, అచీవ్, ట్రేడ్ స్కీం (పాట్) పథకంవల్ల సిమెంటు రంగంలో రూ.2,400 కోట్ల విలువైన 4,070 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగిలిందని, తద్వారా వాతావరణంలో 1.05 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ 20 సిమెంట్ పరిశ్రమలతో సహా మొత్తం 36 భారీ పరిశ్రమల్లో పాట్ అమలవుతుండగా వీటిలో 0.818 ఎంటీఓఈ ఇంధనం ఆదా అయిందని, దీని విలువ రూ.5,709 కోట్లని ఆయన వివరించారు. ప్రభుత్వ శాఖల్లో ఇంధన సామర్థ్య విభాగాల ఏర్పాటు, ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ అమలు వంటి చర్యలను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని విజయానంద్ వెల్లడించారు. ఏపీ తరఫున సదస్సుకు హాజరైన రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈఓ ఎ. చంద్రశేఖరరెడ్డి ఈ వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు.

బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీ చేయరు

- కర్ణాటకలో జేడీఎస్‌కు బీఆర్ఎస్ అండ: కుమారస్వామి

శివాజీనగర: కర్ణాటకలో 2023లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను పోటీ చేయబోరని జేడీఎస్ నేత హెచ్‌డి కుమారస్వామి స్పష్టం చేశారు. తెలుగు మాట్లాడేవారు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో జేడీఎస్ అభ్యర్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలుగు మాట్లాడేవారు అధికంగా ఉన్న కోలారు, రాయచూరుతో పాటు సరిహద్దు ప్రాంతాల నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులకు తెలంగాణ సీఎం చంద్రశేఖర్‌రావు అన్ని విధాలా సహకారం అందించనున్నారని వివరించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో 150 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీ చేయవచ్చని, దీంతో జాతీయ రాజకీయాల్లో పెనుమార్పులు జరగవచ్చని అభిప్రాయపడ్డారు. తాము జాతీయ రాజకీయాల్లోకి వెళ్లబోమని స్పష్టం చేశారు. తమది చిన్న పార్టీ అని.. కర్ణాటకలో మాత్రమే పోటీలో ఉంటామని పేర్కొన్నారు.

పన్ను చెల్లింపు సులభతరం

అందుబాటులో మరింత పారదర్శక విధానం

- లీకేజీలను అరికట్టడానికి ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూట్‌ల సహాయం
- ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం
- రిజిస్ట్రేషన్ ఆదాయాలపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు
- అనుమతులు పొందిన వారు మైనింగ్ ఆపరేషన్ కొనసాగించేలా చూడాలి
- సానుకూల పరిస్థితుల ద్వారా రవాణా శాఖలో ఆదాయం పెంపునకు చర్యలు
- ఇందుకు పన్నుల పెంపే పరిష్కారం కాదు.. వినూత్నంగా ఆలోచించాలి
- పక్కరాష్ట్రాలతో పోలిస్తే వాహనాల కొనుగోలుకు సానుకూల పరిస్థితి కల్పించాలి
- ప్రభుత్వం నుంచి డీలర్లు డబ్బు తీసుకుని, వాహనాలు ఇవ్వని ఘటనలపై చర్యలు
- ఆశాజనకంగా ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం ఆదాయం.. 94.47% లక్ష్యం చేరిక
- అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై నిరంతరం నివేదికలు.. తద్వారా చర్యలు
- సారా తయారీ వృత్తిగా జీవిస్తున్నవారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలు


ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> మద్యం అక్రమ తయారీ, నిరోధంపై గట్టి చర్యలు తీసుకోవాలి. నాటుసారా తయారీ వృత్తిగా కొనసాగిస్తున్న వారి జీవితాలను మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను వారికి అందుబాటులోకి తీసుకు రావాలి. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలి. - సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పన్ను చెల్లింపుదారులకు సులభతర, పారదర్శక విధానాలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పన్నుల్లో ఎక్కడా లీకేజీలు (ఎగవేతలు, ఆదాయాన్ని తక్కువ చేసి చూపడం, తప్పుడు లెక్కలు) లేకుండా చూసుకోవాలని, వాటిని అరికట్టడానికి అవసరమైతే ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూట్‌ల సహాయం తీసుకోవాలని స్పష్టం చేశారు. మద్యం అక్రమ తయారీ, విక్రయాలపై నిరంతరం నివేదికలు తెప్పించుకోవాలని చెప్పారు. గ్రామాల్లో మహిళా పోలీసుల నుంచి తప్పనిసరిగా ప్రతి రోజూ నివేదికలు తీసుకుంటూ, వాటి ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వాణిజ్య, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, గనులు, అటవీ, రవాణా శాఖల కార్యకలాపాలపై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శక, సులభతర విధానాలపై కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. అనుమతులు పొందిన లీజుదారులు మైనింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, వారికేమైనా ఇబ్బందులు ఉంటే తీర్చాలని ఆదేశించారు. రవాణా శాఖలో ఆదాయం పెంపుపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఆదాయాల ప్రగతి ఆశాజనకంగా ఉందని, జీఎస్టీ వసూళ్లు బాగున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం

- ఆస్తుల విలువ మదింపు, మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర పరిస్థితులు ఎలా ఉన్నాయి? తదితర అంశాలపై హేతుబద్ధత ఉండేలా చూడాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రజలకు సులభతరం చేసేందుకు, అందుకు తగిన చర్యలు తీసుకునేందుకు ప్రొఫెషనల్ ఏజెన్సీల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలి.

> రిజిస్ట్రేషన్ ఆదాయాలపై ఐఏఎస్ అధికారులు కృష్ణబాబు, రజత్ భార్గవ, నీరబ్ కుమార్ ప్రసాద్, గుల్జార్ సభ్యులుగా ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలి. రెండు వారాల్లోగా ఈ కమిటీ నివేదిక ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ అవసరమయ్యే సేవలు ఏమిటి? వాటివల్ల ఎలాంటి హక్కులు ఉంటాయి? దాని వల్ల ప్రజలకు ఏమి ఉపయోగం? అనే విషయాలపై అవగాహన కల్పించాలి. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి సులభతర, పారదర్శక విధానాలను అందుబాటులోకి తీసుకురావాలి. ప్రొఫెషనల్ ఏజెన్సీల సహాయం తీసుకుంటూ నాన్ రిజిస్ట్రేషన్ పరిస్థితులను పూర్తిగా తొలగించాలి.

- గ్రామ, వార్డు సచివాలయాల్లో సంపూర్ణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడిచేందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించాలి. భూములు, ఆస్తులే కాకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోతగిన సేవల వివరాలను పోస్టర్ల రూపంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు, గ్రామ, వార్డు సచివాలయాలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ ఫిర్యాదు నంబరు ఉంచాలి.
- మైనింగ్ కోసం ఇప్పటికే అనుమతులు పొందిన వారు, లీజు లైసెన్సులు పొందిన వారు మైనింగ్ ఆపరేషన్ కొనసాగించేలా చూడాలి. దీనివల్ల ఆదాయాలు పెరుగుతాయి. ఆపరేషన్‌లో లేని వాటిపై దృష్టి పెట్టి, లీజుదారులకున్న ఇబ్బందులను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి.
- మైనింగ్ ఆపరేషన్ చేయకపోవడానికి కారణం ఏంటి? వారికున్న ఇబ్బందులు ఏంటి? వారికి చేదోడుగా ఎలా నిలవాలి? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఒక మార్గదర్శక ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రతి నెలా సమగ్ర సమీక్ష జరిపి, ఆదాయాలు వృద్ధి చెందేలా తగిన చర్యలు తీసుకోవాలి. లక్ష్యాలను చేరుకుంటున్నామా? లేదా? అన్న దానిపై నిరంతరం సమీక్ష చేయాలి.
- రవాణా శాఖలో ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలి. కేవలం పన్నులు పెంచడమే దీనికి పరిష్కారం కాదు. వినూత్న ఆలోచనలు చేయాలి. పక్క రాష్ట్రాలతో పోలిస్తే.. వాహనాల కొనుగోలుకు రాష్ట్రంలో తగిన సానుకూల పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నుంచి డీలర్లు డబ్బు తీసుకుని, వాహనాలు ఇవ్వని ఘటనలు వెలుగు చూశాయి. వీటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.
- ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి (ఎక్సైజ్ శాఖ) కె.నారాయణస్వామి, విద్యుత్, అటవీ పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, అటవీ పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్ ఎస్ రావత్, ఎక్సైజ్ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వై మధుసూధన్‌రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, కమర్షియల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా ఆదాయం

- 'గనులు, ఖనిజాల నుంచి గతేడాది సెప్టెంబర్ వరకు రూ.1,174 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది సెప్టెంబర్ వరకు రూ.1,400 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తంగా 19 శాతం పెరుగుదల నమోదైంది. మొత్తం ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 43 శాతం పెరుగుదల ఉంటుందని అంచనా వేశాం' అని అధికారులు సీఎంకు తెలిపారు. 'ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో జీఎస్టీ వసూళ్ల సహా.. ఇతర ఆదాయాలు నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. పారదర్శక విధానాలు, నిబంధనలు కచ్చితంగా అమలు చేయడం వల్లే ఇది సాధ్యమైంది. 2022 సెప్టెంబర్ వరకు లక్ష్యం రూ.27,445 కోట్లు కాగా, రూ.25,928 కోట్ల ఆదాయం వచ్చింది. 94.47% లక్ష్యం చేరుకున్నాం' అని చెప్పారు.
- లీకేజీలను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ట్యాక్స్ ఇన్ఫర్మేషన్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టంను అభివృద్ధి పరిచామని, హెచ్‌ఓడీ కార్యాలయంలో డేటా అనలిటిక్స్ సెంటర్ ఏర్పాటు చేసి.. సిబ్బందిని కూడా నియమించామని తెలిపారు.

ఏపీకి 'స్విస్' సిమెంట్ టెక్నాలజీ!

- రాష్ట్రానికి లైమ్‌స్టోన్ కాల్సిన్డ్ క్లే సిమెంట్ సాంకేతికత అందించేందుకు సంసిద్ధత
- సిమెంట్ తయారీలో క్లింకర్ అనే ముడి పదార్థంతో కాలుష్యం
- సున్నపురాయిలో ఎల్సీ–3 మిక్స్‌తో తగ్గనున్న కాలుష్యం, విద్యుత్ వినియోగం
- ఇంధన శాఖకు స్విట్జర్లాండ్ ప్రతిపాదన


జోనాథన్ డెమింగే

సాక్షి, అమరావతి: వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి, విద్యుత్‌ను పొదుపు చేయగలిగే సామర్థ్యం గల కొత్త రకం సిమెంట్ మిక్స్ సాంకేతికతను రాష్ట్రానికి అందించేందుకు స్విట్జర్లాండ్‌కు చెందిన స్విస్ ఏజెన్సీ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ కో–ఆపరేషన్ (ఎస్డీసీ) ముందుకొచ్చింది. లైమ్‌స్టోన్ కాల్సిన్డ్ క్లే సిమెంట్ (ఎల్సీ–3) అనే ఈ కొత్త సాంకేతికత సిమెంట్ పరిశ్రమలకు లాభాలను కూడా తెచ్చిపెడుతుందని వివరించింది. ఈ మేరకు స్విట్జర్లాండ్ ఎంబసీ కో–ఆపరేషన్, డెవలప్‌మెంట్ హెడ్ జోనాథన్ డెమింగే ప్రతిపాదించినట్లు ఇంధన శాఖ గురువారం వెల్లడించింది.

సిమెంట్ తయారీ రంగంలో మన దేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. క్లింకర్ అనే ముడి పదార్థాన్ని సిమెంట్ తయారీలో ఎక్కువ మోతాదులో ఉపయోగించటంవల్ల అది వాతావరణ కాలుష్యానికి దారితీస్తోందని శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సాధారణంగా సిమెంట్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల్లో 95 శాతం క్లింకర్, 5 శాతం జిప్సం వాడతారు. కానీ, ఎస్డీసీ ప్రతిపాదిస్తున్న లైమ్‌స్టోన్ కాల్సిన్డ్ క్లే సిమెంట్ మిక్స్‌ను వాడటంవల్ల వాతావరణంలో కర్బన ఉద్గారాలు 40 శాతం తగ్గుతాయని, 20 శాతం ఇంధనాన్ని ఆదా చెయ్యొచ్చని ఇంధన శాఖ వెల్లడించింది.

పరిశ్రమల దృష్టికి తీసుకెళ్తాం..



ఇండో స్విస్ బీఈపీ ద్వారా ఏపీ గృహ నిర్మాణ పథకంలో ఇంటి లోపలి ఉష్ణోగ్రతలు తగ్గించే సాంకేతికతను కొన్ని రోజుల ముందే ప్రవేశపెట్టగా, ఇప్పుడు సిమెంట్ పరిశ్రమలకు ఎల్సీ–3 సాంకేతికతను అందించేందుకు స్విస్ ఏజెన్సీ ముందుకొచ్చింది. ఎస్డీసీ ప్రతిపాదించిన నూతన సిమెంట్ మిక్స్ సాంకేతికత గురించి ప్రభుత్వానికి వివరించి, పరిశ్రమల శాఖ సహకారంతో ఈ అంశాన్ని సిమెంట్ పరిశ్రమల దృష్టికి తీసుకెళ్తాం.

– కె.విజయానంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ.

'సంక్షేమం' ఖర్చులో ఏపీదే అగ్రస్థానం

- కేంద్రం ఇస్తున్న పెన్షన్లకు, రాష్ట్రం చెల్లిస్తున్న పెన్షన్‌కు పొంతనే లేదు
- ఇందుకోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేసి సొంత నిధులను వెచ్చిస్తోంది
- ప్రత్యేకంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని తీసుకొచ్చింది
- గత ప్రభుత్వ ఆదేశాలను మార్చి కుటుంబంలో బహుళ పెన్షన్లు ఇస్తోంది
- ప్రతీనెలా రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ కోసం రూ.1,596 కోట్లు చెల్లిస్తోంది
- సొంత మార్గదర్శకాలు రూపొందించుకునే అధికారం రాష్ట్రానికి ఉంది
- పెన్షన్ల చెల్లింపులు పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయం
- ఇందులో న్యాయస్థానాల జోక్యం తగదు
- హైకోర్టుకు నివేదించిన సెర్ప్ సీఈవో ఇంతియాజ్

సాక్షి, అమరావతి: సమాజంలో పేదరిక నిర్మూలన కోసం సంక్షేమ పథకాలపై భారీ మొత్తాలను ఖర్చుచేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానమని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) హైకోర్టుకు నివేదించింది. కేంద్రం మంజూరు చేసిన పెన్షన్లకు, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లకు పొంతనే లేదని, కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద సంఖ్యలో అత్యధిక మొత్తాన్ని చెల్లిస్తోందని సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) మహ్మద్ ఇంతియాజ్ హైకోర్టుకు వివరించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మకారులకు నెలకు రూ.2,500, వికలాంగులకు నెలకు రూ.3 వేలు, తీవ్రమైన కిడ్నీ జబ్బులతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న వారికి నెలకు రూ.10 వేలు చెల్లిస్తోందన్నారు. పెన్షన్ల అర్హత వయసు కూడా 65 నుంచి 60కి తగ్గించిందన్నారు. పెన్షన్ల చెల్లింపు పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో న్యాయస్థానాల జోక్యం తగదని ఆయన వివరించారు. ఇక వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద పెన్షన్ నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2019 డిసెంబర్‌లో జీఓ 174 జారీచేసిందని, దీని ప్రకారం.. కుటుంబంలో బహుళ పెన్షన్ల చెల్లింపునకు ఆస్కారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఇందులో వృద్ధులకు, వితంతువులకు స్థానం కల్పించకపోవడం చట్ట విరుద్ధమంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజే ధర్మాసనం, ప్రతివాదులుగా ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, సెర్ప్ సీఈఓ, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శికి నోటీసులు జారీచేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని వీరిని ఆదేశించింది. దీంతో ఇంతియాజ్ కౌంటర్ దాఖలు చేశారు. కౌంటర్‌లో ఆయన ఏమని పేర్కొన్నారంటే..

కుటుంబంలో బహుళ పెన్షన్లకు అనుమతినిచ్చాం..

'సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందులో భాగంగానే 'నవరత్నాలు' పేరుతో పెద్దఎత్తున సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. వృద్ధులు, వితంతువులు తదితర వర్గాలకు ఎంతో మంచి జరిగింది. ఓ కుటుంబంలో బహుళ పెన్షన్లకు అనుమతినివడం లేదన్న పిటిషనర్ వాదన సరికాదు. ఓ కుటుంబంలో 80 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం కలిగిన వ్యక్తి ఉంటే అతనికి పెన్షన్ మంజూరు చేస్తున్నాం. అలాగే, తీవ్రమైన కిడ్నీ జబ్బులతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న వారికి, తీవ్రమైన మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారికి సైతం కుటుంబ పెన్షన్లు చెల్లిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో దీనికి ఆస్కారంలేదు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనలను మార్చింది' అని ఇంతియాజ్ వివరించారు.

అందరికీ అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం

'రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 11 రకాల పెన్షన్లు అందచేస్తోంది. వీటికి అదనంగా వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న వారికి మరో 11 రకాల పెన్షన్లు ఇస్తోంది. సంక్షేమపథకాల సమర్థవంతమైన అమలుకోసం స్వీయ మార్గదర్శకాలు రూపొందించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర బడ్జెట్ నుంచి సంక్షేమపథకాల కోసం నిధులు కేటాయిస్తున్నప్పుడు సొంత మార్గదర్శకాలు రూపొందించుకునే అధికారం ప్రభుత్వానికి తప్పనిసరిగా ఉంటుంది. ఈ అధికారాన్ని ఎవరూ కాలరాయలేరు. అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులతో సంక్షేమ పథకాల ఫలాలన్నీ కూడా అవసరమైన కుటుంబాలకు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అధికార పార్టీకి చెందిన వారికి రెండో రేషన్ కార్డు ఇస్తున్నారని.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారికి ఇవ్వడంలేదన్న పిటిషనర్ వాదనలో వాస్తవంలేదు'.. అని ఇంతియాజ్ వివరించారు.

నెలనెలా రూ. 1,596 కోట్ల చెల్లింపు

'సామాజిక భద్రత పెన్షన్ల కింద కేంద్రం ఇస్తున్న దానికన్నా ఎక్కువ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. కేంద్ర ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ కింద నెలకు రూ.200, వితంతు పెన్షన్ రూ.300, వికలాంగులకు రూ.500 మాత్రమే చెల్లిస్తోంది. వీటితో సంబంధంలేకుండా రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో పెన్షన్లు చెల్లిస్తోంది. పెన్షనర్ల సంఖ్యపై కేంద్రం సీలింగ్ విధించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్వీకరిస్తూనే ఉంది. కొత్తగా 3.10 లక్షల పెన్షన్ దరఖాస్తులను ఆమోదించింది. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) మార్గదర్శకాలకు లోబడే ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో ఈ పెన్షనర్లు 62.79 లక్షలు. అంటే మొత్తం జనాభాలో వీరు 12.72 శాతం. ప్రతీనెలా రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల కింద రూ.1,596.81 కోట్లు చెల్లిస్తోంది. పెన్షన్లకోసం ఇంత పెద్దమొత్తాన్ని ఖర్చుచేస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమే. ఏపీ జనాభా కన్నా ఉత్తరప్రదేశ్ జనాభా నాలుగు రెట్లు అధికం అయినప్పటికీ, పెన్షన్ చెల్లింపులు మాత్రం ఆ రాష్ట్రం కన్నా ఏపీ నాలుగు రెట్లు ఎక్కువగా చెల్లిస్తోంది. కేంద్రం పెన్షన్ల కింద కేవలం రూ.311 కోట్లు మాత్రమే ఇస్తోంది' అని సెర్ప్ సీఈఓ తన కౌంటర్‌లో పేర్కొన్నారు.

● తెలంగాణ

టీఆర్ఎస్ ఇక బీఆర్ఎస్!

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ టీఆర్ఎస్ పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించింది. టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) అధ్యక్షతన బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. 'అక్టోబర్ 5న టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశం తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. పార్టీ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో విస్తరించడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ మేరకు పార్టీ నియమావళిలో మార్పులు చేశాం' అంటూ కేసీఆర్ చేసిన ప్రకటనకు జనరల్ బాడీ సభ్యులు ఆమోదం తెలిపారు. పార్టీ నిర్ణయాన్ని తెలియజేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి కేసీఆర్ లేఖరాశారు. 'టీఆర్ఎస్ పేరును భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ పార్టీ రాజ్యాంగంలో చేసిన సవరణలకు జనరల్ బాడీ సమావేశం ఆమోదం తెలిపింది. వీటికి సంబంధించిన తీర్మానాలు, పార్టీ రాజ్యాంగసవరణ అంశాలను సమర్పిస్తున్నాం..' అని ఆ లేఖలో పేర్కొన్నారు. పార్టీ తీర్మానాన్ని, కేసీఆర్ లేఖను తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఢిల్లీలో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మకు అందజేశారు. పార్టీ పేరు మార్పుపై చట్టపరంగా త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మారుస్తూ చేసిన తీర్మానంపై ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే పేరు మార్పును ధ్రువీకరిస్తూ సీఈసీ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. టీఆర్ఎస్‌కు ఉన్న కారు గుర్తు, గులాబీ రంగు జెండా బీఆర్ఎస్ పేరు మీద కొనసాగుతాయి. అనుబంధ సంఘాల పేర్లు కూడా మారతాయి. కాగా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఢిల్లీ కౌటిల్యా మార్గ్ సమీపంలోని సర్దార్ పటేల్ రోడ్‌లో ఉన్న రాజ కుటుంబీలకు చెందిన ఓ భవనంలో ఏర్పాటు చేయనున్నారు. వసంత్ విహార్‌లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ భవన్ పూర్తయిన తర్వాత అందులోకి మారుస్తారు.

దేశ ప్రజల సమస్యలే ఎజెండా : కేసీఆర్

దేవ ప్రజల సమస్యలే బీఆర్ఎస్ ఎజెండా అని కేసీఆర్ చెప్పారు. బుధవారం జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. '75 ఏళ్లుగా దేశాన్ని పరిపాలించిన పార్టీలు గద్దెనెక్కడం, దిగడం మినహా సాధించిందేమీ లేదు. ఇతర పార్టీలకు రాజకీయం ఒక ఆట, కానీ టీఆర్ఎస్‌కు అది ఒక టాస్క్. తెలంగాణ కోసం కష్టపడిన రీతిలో దేశం కోసం కష్టపడి అభివృద్ధిని సాధించి చూపెడదాం' అని చెప్పారు. తెలంగాణ సీఎంగా ఉంటూనే దేశమంతా పర్యటిస్తానన్నారు. మొదటి కార్యక్షేత్రంగా మహారాష్ట్రను ఎంచుకుని జాతీయ పార్టీ అనుబంధ రైతు సంఘటనను అక్కడి నుంచే ప్రారంభిస్తామని చెప్పారు. దళిత, రైతు, గిరిజన ఉద్యమాలు ప్రధాన ఎజెండాగా చెప్పారు. త్వరలో పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాటు చేస్తామన్నారు. తమతో కలిసి సాగేందుకు దేశవ్యాప్తంగా అనేక పార్టీల నేతలు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. దేశంలో సమూల మార్పుల ద్వారానే సామాజిక పరిస్థితుల్లో మార్పు సాధ్యమవుతుందని చెప్పారు.

తెలంగాణలో కూడా మూడు రాజధానులు పెట్టాలి

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

హైదరాబాద్: దాదాపు ఐదు కోట్ల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలనే ఉద్దేశంతో పరిపాలనా వికేంద్రీకరణకు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మూడు రాజధానుల ప్రతిపాదనను దక్షిణ భారత రాజకీయ జేఏసీ, సదరన్ పొలిటికల్ అకాడమీ స్వాగతిస్తోందని ఓయూ న్యాయకళాశాల డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. గురువారం జేఏసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏపీ సీఎం జగన్ ఫార్ములాను తెలంగాణలో కూడా అమలు చేయాలన్నారు. తెలంగాణలో కేవలం హైదరాబాద్ మాత్రమే అభివృద్ధి చెందిందన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే హైదరాబాద్‌ను రాజకీయ రాజధానిగా పరిగణిస్తూనే వరంగల్‌ను కార్యనిర్వాహక రాజధానిగా, ఆదిలాబాద్‌ను న్యాయ రాజధానిగా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అలాగే ఢిల్లీని ఉత్తరాది రాజధానిగా, హైదరాబాద్‌ను దక్షిణాది రాజధానిగా, కోల్‌కతాను ఈశాన్య ప్రాంతానికి రాజధానిగా ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

ప్రజాశాంతి పార్టీలోకి గద్దర్

ఆయనకే మునుగోడు టికెట్ ఖరారు చేసిన కేఏ పాల్

హైదరాబాద్: ప్రజాగాయకుడు గద్దర్ ప్రజాశాంతి పార్టీ అభ్యర్థిగా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక బరిలో దిగనున్నారు. గద్దర్‌ను ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానించామని, తమ పార్టీలోకి వచ్చిన ఆయన్ని మునుగోడు అభ్యర్థిగా ఖరారు చేశామని ఆ పార్టీ అధినేత కేఏ పాల్ ప్రకటించారు. బుధవారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో మీడియాతో కేఏ పాల్ మాట్లాడారు. ప్రపంచశాంతి కోసం కృషి చేస్తున్న తనతో కలిసి పనిచేయాలనే ఉద్దేశంతోనే ఆయన ప్రజాశాంతి పార్టీ తరఫున ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నారు. నోటు తీసుకోకుండా నచ్చిన అభ్యర్థికి ఓటు వేయండనే నినాదంతో ఎన్నికల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు.

టీడీపీ నేత వేధింపులు.. ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

▶ మొదటి పేజీ తరువాయి

ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ బలవన్మరణానికిముందు సెల్ఫీ వీడియోలో చెప్పింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఎర్రబల్లిలో బుధవారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. ఎర్రబల్లికి చెందిన కురుబ శ్రీనివాసులు, రాధమ్మ దంపతుల ఏకైక కుమార్తె సంధ్యారాణి(17). అన్నమయ్య జిల్లా మొలకలచెరువులోని మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ అనుచరుడైన నల్లచెరువుకు చెందిన తెలుగు యువత మండల ప్రధానకార్యదర్శి రాళ్లపల్లి ఇంతియాజ్.. ఫేస్‌బుక్‌లో సంధ్యారాణితో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత ప్రేమించాలంటూ వేధించడం మొదలెట్టాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో ఎర్రబల్లికి వెళ్లి వారి తల్లిదండ్రుల సమక్షంలోనే తనని ప్రేమించాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇటీవల సంధ్యారాణి తల్లిదండ్రులతో కలిసి పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిగుడి వద్దకు వెళ్లగా.. అక్కడికి వచ్చి మరీ వేధించాడు. తనను ప్రేమించకుంటే ఫొటోలు మార్ఫింగ్‌చేసి ఫేస్‌బుక్‌లో పెడతానంటూ బెదిరించాడు. దీంతో సంధ్యారాణి తీవ్ర భయాందోళనకు లోనైంది. ఈ క్రమంలోనే దసరా సెలవులకు ఇంటికొచ్చిన సంధ్యారాణి బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. తన ఆత్మహత్యకు ఇంతియాజే కారణమంటూ ఆత్మహత్యకు ముందు తీసుకున్న సెల్ఫీ వీడియోలో చెప్పింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ రాంభూపాల్ ఘటన స్థలానికి చేరుకుని సంధ్యారాణి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

కీచక టీడీపీ నేతల అరాచకాలకు చంద్రబాబే కారణం : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్

లైంగిక వేధింపులకు పాల్పడి మైనర్ బాలికలను పొట్టనబెట్టుకుంటున్న కీచక టీడీపీ నేతలకు చంద్రబాబు వత్తాసుపలకడం అత్యంత బాధాకరమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేత ఇంతియాజ్ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న బాలిక ఉదంతంపై గురువారం ఆమె శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ, కదిరి డీఎస్పీతో మాట్లాడారు. కేసు దర్యాప్తును వేగవంతంచేసి నిందితుడిపై కఠినచర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ అనంత, సత్యసాయి జిల్లాల్లో వరుసగా టీడీపీనేతల వేధింపులకు ప్రధాన కారణం వారిని చంద్రబాబు వెనుకేసుకురావడమేనన్నారు. విజయవాడలో వినోద్‌జైన్ కేసు, లోకేశ్ పీఏ వేధిస్తున్నాడని మహిళ ఫిర్యాదు ఇచ్చిన సమయం లోనే టీడీపీ నేతలకు చంద్రబాబు గట్టిగా బుద్ధిచెప్పి ఉంటే ఇలాంటిఘటనలకు తావుండేది కాదన్నారు.

‘శాప్’లో కారుణ్య నియామకాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)లో కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.వాణీమోహన్ జీవో ఇచ్చారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన శాప్ శాశ్వత ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అర్హత ఆధారంగా ఉద్యోగం కల్పించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ యాక్ట్, రూల్స్‌లో సవరణలు చేసింది.

స్పెషలిస్ట్ వైద్యుల ఎంపిక జాబితా విడుదల



సాక్షి, అమరావతి: వైద్య శాఖలో స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీలో భాగంగా తుది మెరిట్, ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాను గురువారం ప్రదర్శించారు. అభ్యంతరాలుంటే శనివారం సాయంత్రం ఐదు గంటల్లోగా apvvpcass2021@-gmail. comకు మెయిల్ చేయాల్సి ఉంటుంది. వైద్య విధాన పరిషత్‌లో 351 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి గత ఆగస్టు నెలలో నోటిఫికేషన్ జారీ చేశారు.

వైద్యుల బదిలీల ప్రక్రియ ప్రారంభం

ఇటీవల అనుమతులిచ్చిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: వైద్య ఆరోగ్యశాఖలోని వైద్య విధాన పరిషత్‌లో వైద్యుల రిక్వెస్ట్ బదిలీల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమయింది. ఇటీవల బదిలీలకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ క్రమంలో అర్హులైన వారి నుంచి గురువారం దరఖాస్తులు స్వీకరించారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. అభ్యర్థులు doctransfers2022@gmail.comకు దరఖాస్తులను మెయిల్ చేయాలి. ఆదివారమే ప్రొవిజనల్ అలాట్మెంట్ జాబితా ప్రదర్శిస్తారు. ఈ జాబితాపై 10వ తేదీ సోమవారం అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరిస్తారు. 11వ తేదీ మంగళవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారు.

నాడు-నేడు తొలివిడత స్కూళ్లకు ఈ-కంటెంట్

- ఇంగ్లిష్ ల్యాబ్‌ల్లో బోధనకు ఏర్పాట్లు
- 15,715 స్కూళ్లకు అందనున్న ఈ-కంటెంట్
- స్కూళ్లలో డిజిటల్ తరగతుల ఏర్పాటుకు సన్నాహాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మనబడి నాడు-నేడు కింద మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధనా కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులకు అనువుగా ఉండేందుకు ద్విభాషా (బైలింగ్యువల్) పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసింది. ఆంగ్ల మాధ్యమ బోధనకు వీలుగా 1.80 లక్షల మంది టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చింది. ఈ స్కూళ్లలో ఇంగ్లిష్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటిలో బోధనకు వీలుగా ఈ-కంటెంట్‌ను ప్రత్యేకంగా రూపొందించి అందిస్తోంది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని సీమ్యాట్ ద్వారా ఈ కంటెంట్‌ను రూపొందింపచేసి అన్ని స్కూళ్లకు అందుబాటులోకి తెస్తోంది. తొలివిడతగా నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన 15,715 స్కూళ్లలోని ఇంగ్లిష్ ల్యాబ్‌లకు ఈ-కంటెంట్‌ను సిద్ధం చేసింది. ఇంతకుముందు 1,729 వీడియో కంటెంట్‌లను అందించగా తాజాగా మరో 2,102 వీడియో కంటెంట్‌లను పాఠశాలలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ స్కూళ్లలో ఇంగ్లిష్ ల్యాబ్‌ల్లో డిజిటల్ డివైస్‌లను ఏర్పాటు చేయించి వాటి ద్వారా విద్యార్థులకు ఈ ఈ-కంటెంట్‌ను సులభమార్గాల్లో బోధన చేయించనుంది.

డిజిటల్ తరగతులకు సన్నాహాలు

మరోవైపు.. నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తున్న స్కూళ్లలో ఆధునిక విజ్ఞాన బోధనకు వీలుగా డిజిటల్ తరగతుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు అందుకు అనుగుణంగా సన్నాహాలు చేపట్టారు. మొత్తం 45,328 స్కూళ్లలో రూ. 511.28 కోట్లతో ఈ డిజిటల్ తరగతులను ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోంది. మూడు దశల్లో ఈ కార్యక్రమం పూర్తి కానుంది. తొలిదశలో 15,694 పాఠశాలల్లో ముందుగా ఈ డిజిటల్ తరగతులు ఏర్పాటు చేయనున్నారు. రెండో దశ కింద 2023-24 విద్యాసంవత్సరంలో 14,331 స్కూళ్లలో, మూడో దశలో 15,303 స్కూళ్లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ బోధనకోసం ఈ స్కూళ్లలో స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు, ఏర్పాటు చేయించనున్నారు. డిజిటల్ తరగతులకు అనుగుణంగా ఆయా స్కూళ్లకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా ఇప్పటికే ఏర్పాటు చేయించారు. 2,658 స్కూళ్లలో బ్రాడ్ బ్యాండ్, లీజ్డ్ లైన్, టెలిఫోన్ లైన్ విత్ మోడెమ్, యూఎస్‌బీ మోడెమ్, పోర్టబుల్ హాట్‌స్పాట్, వీఎస్ఏటీ తదితరాల ద్వారా ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించారు.

ఉద్యాన వర్సిటీ 10 వంగడాలకు ప్రభుత్వ గుర్తింపు

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- రైతులకు మేలంటున్న శాస్త్రవేత్తలు



ఉద్యాన వర్సిటీ ముఖద్వారం



మిరప రకాలు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనకేంద్రాలు అభివృద్ధి చేసిన పది కొత్త వంగడాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. లాం, గుంటూరు, వెంకట్రామన్నగూడెం, తిరుపతి, పెద్దాపురం, కొవ్వూరుల్లోని ఉద్యాన పరిశోధనస్థానాలు ఈ వంగడాలను రూపొందించాయి. వ్యవసాయ, సహకారశాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, ఉద్యానవర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్ తదితరులు స్టేట్ వెరైటీ రిలీజ్ కమిటీలో గతంలో వంగడాల విడుదలను ఆమోదించారు. తాజాగా ప్రభుత్వం గెజిట్ 1251 ద్వారా వీటిని ధ్రువీకరించింది. ఈ విషయాన్ని ఉద్యానవర్సిటీ అధికారులు గురువారం తెలిపారు.

ఆ వంగడాలు ఇవే..

మిరపలో డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యు-క్రాంతి (ఎల్‌సీఏ-657), డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యు-చైత్ర (ఎల్‌సీఏ-680) డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యు-తన్వి (ఎల్‌సీఏ-684), పచ్చిమిరపలో డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యు-సిరి (ఎల్‌సీఏ-616) రకాలను గుంటూరు లాం ఉద్యాన పరిశోధనస్థానం అభివృద్ధి చేసింది. తోటకూరలో డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యు-వర్ణ (విఆర్ఏ-1), చిక్కుడులో డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యు-శ్రేష్ఠ (విఆర్‌డీఎల్-1) రకాలను వెంకట్రామన్నగూడెం ఉద్యాన పరిశోధన స్థానం, నిమ్మను తిరుపతికి చెందిన చీని నిమ్మ పరిశోధనస్థానం, పెండలం, కర్రపెండలం రకాలను కొవ్వూరు పరిశోధన స్థానం, చిలగడదుంపను పెద్దాపురం ఉద్యాన పరిశోధనస్థానం అభివృద్ధి చేశాయి.

కొత్త వంగడాలు ప్రత్యేకం

ఉద్యాన విశ్వవిద్యాలయం కొత్తగా విడుదల చేసిన వంగడాల రకాలు వేటికవే ప్రత్యేకమైనవి. మిరపలో జెమిని వైరస్‌ను తట్టుకోగల రకాలు, అధిక దిగుబడిని ఇచ్చే చిక్కుడు, తోటకూర, పెండలం రకాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయి. శాస్త్రవేత్తల ద్వారా ఈ రకాలకు ప్రాచుర్యం కల్పిస్తాం.

– డాక్టర్ టి.జానకీరామ్, ఉద్యాన వర్సిటీ వీసీ, వెంకట్రామన్నగూడెం

• తెలంగాణ

ఉల్లాసంగా..ఉత్సాహంగా అలయ్-బలయ్

- ముఖ్య అతిథిగా కేరళ గవర్నర్
- ప్రత్యేక ఆకర్షణగా మెగాస్టార్ చిరంజీవి

సాక్షి, హైదరాబాద్: సమాజంలోని విభిన్న వర్గాల మేలు కలయికగా ‘దత్తన్న అలయ్-బలయ్’ ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. గురువారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్-బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ, సాంస్కృతిక, సినిమా, రాజకీయ, తదితర రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ.. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా మనుషుల మధ్య స్నేహం, సాంస్కృతిక విలువలు పెంపొందించేందుకు అలయ్-బలయ్ ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఇంత గొప్పగా ఉన్న దీనిని ఇతివృత్తంగా తీసుకుని సినీ హీరో చిరంజీవి ఇంకా సినిమా తీయలేదా? అని ప్రశ్నించారు. హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. కేవలం శరీరాలే కాదు మనసులు ఆలింగనం చేసుకోవాలనే లక్ష్యంతో పార్టీలు, కులమతాల కతీతంగా భిన్న సంస్కృతులను ఏకం చేయాలనే ఉద్దేశంతో దీనిని ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో ఎన్నికలప్పుడే రాజకీయాలుండేవని, ఆ తర్వాత ప్రాంతం, దేశాభివృద్ధికోసం పాటుపడేవారని, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఇతర పార్టీల నేతలు కలుసుకుని మాట్లాడలేని పరిస్థితి ఉందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సినీ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే అలయ్-బలయ్ వంటి కార్యక్రమం దేశవ్యాప్తంగా జరగాలి.. వ్యాపించాలని ఆయన అన్నారు.

వక్ఫ్ ఆస్తుల సర్వే వేగవంతం

జీపీఎస్ పద్ధతిలో ఐదు వేలకు పైగా ఆస్తుల గుర్తింపు

- ముస్లిం వక్ఫ్ ఆస్తుల సర్వేతో రక్షణకు చర్యలు
- మిగిలిన వాటిని గుర్తించేందుకు కొనసాగుతున్న సర్వే
- సీఎం జగన్ ఎన్నికల హామీ కార్యరూపం



జీపీఎస్ పద్ధతిలో పరికరాన్ని ఉపయోగించుకుని సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల రెండో రీసర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్) ద్వారా సర్వే ప్రక్రియ జరుగుతోంది. తద్వారా సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ కార్యరూపంలో వేగం పుంజుకుంది. ఇప్పటి వరకు దాదాపు 50 శాతం సర్వే ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మొత్తం 10,522 వక్ఫ్ ఆస్తులున్నట్టు నిర్ధారించారు. వాటిలో రెండో విడత రీ సర్వేలో ఇప్పటి వరకు 5,071 ఆస్తులను అధికారికంగా ధ్రువీకరణ(నోటిఫై) చేశారు. మరో 5,451 ఆస్తుల సర్వే వేగవంతంగా జరుగుతోంది. రీ సర్వే బృందాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సర్వే నిర్వహిస్తున్నాయి. జీపీఎస్(శాటిలైట్) ఉపయోగించుకుని మొబైల్ మ్యాపర్స్ తదితర అప్లికేషన్‌లను వాడుకుని ప్రత్యేక పరికరాల సాయంతో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. మొదట్లో వక్ఫ్ సర్వే సిబ్బంది మాత్రమే ఈ సర్వే చేపట్టారు. క్షేత్రస్థాయిలో అనేక సాంకేతిక సమస్యలు రావడంతో రెవెన్యూ యంత్రాంగాన్ని కూడా సమన్వయం చేసుకుంటూ వేగంగా సర్వే నిర్వహిస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులను ధ్రువీకరించని చంద్రబాబు ప్రభుత్వం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1953 నుంచి 1963 మధ్య కాలంలో వక్ఫ్ సంస్థలు, వక్ఫ్ భూముల సర్వే జరిగింది. మొదటి సర్వేలో 65,783.88 ఎకరాల వక్ఫ్ భూములను గుర్తించారు. వాటిలో ఆక్రమాలు, ఇతర అవసరాలకు బదలాయించినవి, విక్రయించినవి పోగా 29,578.21 ఎకరాలు ఉంది. దాని తర్వాత 2003లో వక్ఫ్ ఆస్తులైన మసీదులు, దర్గాలు, పీర్ల చావిడిలు, అసూర్ఖానా, పంజాలు, ఈద్గాలు, సమాధులు, శ్మశాన వాటికలు వంటి వాటిపై రెండో సర్వే నిర్వహించారు. చంద్రబాబు హయాంలో జరిగిన ఈ సర్వేలో గుర్తించిన ఆస్తులను నోటిఫై చేయకపోవడం(అప్రకటిత ఆస్తుల)తో 2019 తర్వాత ప్రస్తుత ప్రభుత్వం రెండో రీ సర్వేను చేపట్టింది.

9 జిల్లాల్లో పూర్తికావచ్చిన సర్వే

జిల్లా	మొత్తం ఆస్తులు	సర్వే అయినవి
విజయనగరం	64	62
తూర్పుగోదావరి	125	121
అంబేడ్కర్ కోనసీమ	90	89
పశ్చిమగోదావరి	46	41
ఏలూరు	148	142
ఎన్టీఆర్	255	221
గుంటూరు	262	205
బాపట్ల	163	151
ప్రకాశం	482	410

సమన్వయంతో వేగంగా సర్వే



సీఎం జగన్ ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా ఇచ్చిన సూచనలతో రెవెన్యూ యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుని వేగంగా సర్వే పూర్తిచేస్తున్నాం. సర్వేలో గుర్తించిన ఆస్తులను రెవెన్యూ అధికారుల ద్వారా ధ్రువీకరించి వక్ఫ్ బోర్డుకు అప్పగించేలా ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. ఇప్పటికే 9 జిల్లాల్లో సర్వే దాదాపు పూర్తికావొచ్చింది. మరికొన్ని జిల్లాల్లో వేగంగా జరుగుతోంది. మరో ఐదు జిల్లాల్లో సర్వేను త్వరలో ప్రారంభిస్తాం. వక్ఫ్ ఆస్తుల రీ-సర్వేతో పాటు రాష్ట్రంలో వివాదాస్పద వక్ఫ్ భూములను కూడా సర్వే చేసి వెలికితీస్తున్నాం. కాజ, కర్నూలు, కడప తదితర ప్రాంతాల్లో వివాదాస్పద భూములకు సంబంధించి నోటీసులిచ్చి విచారణ చేపడుతున్నాం.

– ఎస్‌కే షెరీన్ బేగం, వక్ఫ్ సర్వే కమిషనర్

ఆర్‌బీఐ గుర్తింపుతోనే కార్యకలాపాలు

రుపీక్ లోన్ యాప్ సంస్థ

సాక్షి, అమరావతి: ఆర్‌బీఐ నిబంధనలకు మేరకు కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని రుపీక్(rupeek) లోన్ యాప్ సంస్థ తెలిపింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీగా రిజిస్ట్రేషన్ చేసుకుని దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ విషయాన్ని పాఠకులు గుర్తించాలని కోరింది. కాగా ఫేక్ లోన్ యాప్ కంపెనీలు అసలు కంపెనీల ఇంగ్లీష్ పేర్లలోచిన్నపాటి స్పెలింగ్ మార్పులతో ప్రజల్ని మోసపుచ్చుతున్నాయని సాక్షి గత నెల 19న ప్రచురించిన కథనంలో స్పష్టంగా పేర్కొంది. అదే రీతిలో రుపీక్ కంపెనీ పేరును పోలిన రీతిలో మరో కంపెనీ రుపీక్(rupeeok) ప్రజలను మోసపుచ్చుతున్నట్టు ఆర్‌బీఐ, పోలీసు శాఖ గుర్తించాయి.

సీఐడీ విచారణకు హాజరుకాని చింతకాయల విజయ్



సాక్షి, అమరావతి : టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి కుమారుడు విజయ్.. సీఐడీ విచారణకు హాజరుకాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై టీడీపీ సోషల్ మీడియా విభాగం ఐ-టీడీపీ దుష్ప్రచారం చేసిన విషయం తెలిసిందే. దీని వెనుక ఐ-టీడీపీ విభాగ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న చింతకాయల విజయ్ పాత్ర ఉన్నట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. దీంతో ఆయనపై క్రైమ్ నంబర్ 14/2022 ఐపీఎసీ సెక్షన్లు 419, 469, 153-ఎ, 505(2), 120-బి రెడ్‌విత్ 34, ఐటీ చట్టం సెక్షన్ 66(సి) కింద కేసు నమోదు చేశారు. మంగళగిరిలోని సీఐడీ కార్యాలయంలో గురువారం విచారణకు హాజరుకావల్సిందిగా ఈ నెల 1న హైదరాబాద్‌లోని విజయ్ నివాసానికి వెళ్లి సీఐడీ అధికారులు నోటీసులిచ్చారు. కానీ విజయ్ మాత్రం విచారణకు హాజరుకాకపోవడం గమనార్హం. కాగా, ఆ కేసు ఎఫ్ఐఆర్ కాపీతో పాటు, ఇతర వివరాలు ఇవ్వాలని కోరుతూ ఓ లేఖను విజయ్ తరఫు న్యాయవాదులు సీఐడీ కార్యాలయంలో అందించారు.

సీఎఫ్‌ఎంఎస్‌కు అంతరాయం

సాక్షి, అమరావతి: సీఎఫ్ఎంఎస్ సైట్ శుక్రవారం అర్ధరాత్రి 12 నుంచి 9వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు పని చేయదని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ కార్యాలయ అధికారులు గురువారం వెల్లడించారు. సీఎఫ్ఎంఎస్ సైట్‌లో జిల్లాలు, మండలాల పునర్నిర్మాణం కారణంగా ఆ సమయంలో సీఎఫ్ఎంఎస్ సైట్‌ను షట్‌డౌన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రానికి అన్ని ట్రెజరీల్లో ఎలాంటి పెండింగ్ బిల్లులు లేకుండా చేయాలని జిల్లా ట్రెజరీ అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను శుక్రవారం సాయంత్రంలోపు చెల్లించాలని, లేదా రద్దు చేయాలని, అన్ని స్థాయిల్లో బిల్లులు సున్నాగా ఉండాలని స్పష్టంగా ఉత్తర్వులు జారీచేశారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్ బిల్లులను 7వ తేదీ రాత్రి ఏడు గంటల్లోపు పాస్ చేయాలని, లేదా తిరస్కరించాలని తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి అన్ని స్థాయిల్లో కొత్తగా పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. సప్లిమెంటరీ బిల్లులను ఈ నెల 11వ తేదీ తర్వాత జనరేట్ చేయాలని సూచించారు.

"ఓ విశ్వాసులారా.. సహన సాధన, ప్రార్థనలలో దేవుని సహాయం కోరండి. ఎందుకంటే సర్వోన్నతుడైన అల్లాహ్ నిశ్చయంగా ఓర్పుగల వారితో ఉన్నారు".
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, అక్టోబర్, 7

ఆలోచన అక్కర్లేదా?!

ఇది ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ అవార్డుల సీజన్. కొద్దిరోజులుగా వివిధ రంగాల్లో నోబెల్ విజేతల పేర్లు ప్రకటిస్తుంటే, అంతకు పక్షం రోజుల క్రితం మన దేశంలో గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయిన ఓ దుర్మార్గం ఆలస్యంగా బయట కొచ్చింది. శాస్త్రీయ పరిశోధనలో ప్రతిభను గుర్తించి ఏటా ఇచ్చే 300 అంతర్గత అవార్డులు, ఉపకార వేతనాలు, ఫెలోషిప్‌లను ఎత్తివేయాలని కేంద్రం నిర్ణయించింది. వివిధ రంగాల్లో అవార్డుల ఎంపికను క్రమబద్ధీకరించడానికంటూ కేంద్ర హోమ్ సెక్రటరీ సారథ్య సమావేశంలో గత నెల 16న చడీచప్పుడు లేకుండా పాలకులు తీసుకున్న ఈ నిర్ణయం దిగ్భ్రాంతికరం. శాస్త్రీయ దృక్పథాన్నీ, పరిశోధననూ పెంచాల్సిన రోజుల్లో ఆ స్ఫూర్తికి అశనిపాతం. దేశంలో అవార్డుల ఎంపిక వ్యవస్థను పారదర్శకంగా, నిష్పాక్షికంగా తీర్చిదిద్దాలనే ప్రధాని ఆలోచన మంచిదే కావచ్చు. దాని అంతరార్థం, శాస్త్రవేత్తల సమూహానికి కలిగించే నష్టమే చర్చనీయాంశం.

అవార్డులైనా... రివార్డులైనా ప్రతిభను ప్రోత్సహించడానికి! ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్నవారిని గుర్తించి, గౌరవించడానికి!! సంక్లిష్టమైన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అవి మరింత కీలకం. 1940లు, 50లలో భారతీయ శాస్త్రవేత్తల్లో సుప్రసిద్ధుడూ, సీఎస్ఐఆర్ సంస్థాపకుడూ అయిన ప్రొఫెసర్ శాంతిస్వరూప్ భట్నాగర్ జన్మదినమైన సెప్టెంబర్ 26ను మన శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా జరుపుకొంటారు. ప్రతి ఏటా సరిగ్గా ఆ రోజునే భారత ప్రభుత్వం సైతం మన దేశంలో కృషి చేస్తున్న అత్యుత్తమ ప్రతిభావంతులైన 45 ఏళ్ళ వయస్సు లోపు శాస్త్రవేత్తలను గౌరవిస్తూ, భట్నాగర్ ప్రైజ్ ప్రకటిస్తుంది. కానీ, ఈసారి ప్రభుత్వ అవార్డు ప్రకటనలు లేకపోగా, ప్రభుత్వానికి పైసా ఖర్చు లేని ప్రైవేట్ ధర్మనిధి పురస్కారాల్ని సైతం ఎత్తివేస్తున్నట్టు చావుకబురు చల్లగా చెప్పింది. ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల సమాచారాన్ని బయటపెట్టి, గమ్మున ఊరకుంది.

ఇప్పుడిక శాస్త్ర, సాంకేతిక విభాగంలో అవార్డుల సంఖ్య 207 నుంచి 4 జాతీయ అవార్డులకే పరిమితం. అంతరిక్షం, భూవిజ్ఞానం, అణు ఇంధన శాఖల్ని సైతం అవార్డులన్నీ ఎత్తేయమని కేంద్రం పేర్కొంది. ఏలికలు అకస్మాత్తుగా ఇలా అవార్డులు ఎత్తేయడానికి హేతుబద్ధత ఏమిటో అంతుపట్టదు. పొదుపుచర్యల్లో భాగంగా ఇలా చేశారనుకోవడానికీ వీల్లేదు. ఎందుకంటే, ఈ అవార్డులన్నిటికీ కలిపి ఏటా అయ్యే ఖర్చు అతి స్వల్పం. పోనీ, అర్హత లేని వారికి అవార్డులిస్తారనే మిషతో ఈ ఎత్తివేత జరిగిందా అంటే అదీ లేదు. సాధారణంగా ఏ అవార్డుల ఎంపికలోనైనా పక్షపాతం, దురభిప్రాయాల్ని కొట్టిపారేయలేం. ఇప్పటిదాకా శాస్త్రవేత్తల అవార్డుల్లో తప్పుడు ఎంపికలు అతి తక్కువ. ప్రస్తుతమున్న ఎంపిక ప్రక్రియలో అధిక శాతం అత్యుత్తమ ప్రతిభావంతులకే పట్టం కట్టారు.

మరి ఏలినవారి ఈ హఠాన్నిర్ణయానికి కారణం? శాస్త్ర సాంకేతిక రంగాల్లోని బహుకొద్ది శాస్త్రవేత్తలే నేటి పాలకుల ప్రశ్నార్థమైన శాస్త్రీయ అజెండాతో అంటకాగుతున్నారు. అవార్డులన్నిటినీ కేంద్రీకృతం చేయడం వల్ల ఎంపిక కమిటీలపై ప్రభుత్వం పట్టు బిగుస్తుంది. దరిమిలా అయినవాళ్ళకు అవార్డులు వడ్డించి, వారిని వివిధ పరిశోధక సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో కీలక స్థానాల్లో కూర్చోబెట్టే వీలొస్తుంది. ఇదే తాజా ప్రభుత్వ నిర్ణయంలో పరమార్థమని వాదన. అలాగే, పలువురు ప్రముఖ శాస్త్రవేత్తలు వివిధ సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వ సైన్స్ విధానాలను మీడియాలో విమర్శించారు. మింగుడుపడని పాలకులు వారి రెక్కలు కత్తిరించడానికే ఈ చర్య చేపట్టారని ఒక కథనం.

యువ శాస్త్రవేత్తలకిచ్చే ఫెలోషిప్‌లు గతంలో ఎప్పుడో అరుదుగా ఆలస్యమయ్యేవి. కానీ, మూడేళ్ళుగా సమయానికి ఫెలోషిప్‌లు, గ్రాంట్లు రాక పరిశోధనకు అవసరమైన సరుకులు, సామగ్రి వారు కొనుక్కోలేకపోతున్నారు. కుటుంబాల్ని పోషించుకోలేని పీహెచ్‌డీ విద్యార్థులు సగంలోనే పరిశోధనకు మంగళం పాడుతున్నారు. ఇప్పుడు అవార్డులను ఎత్తివేయడమంటే ప్రోత్సాహాన్ని ఆపేయడమే కాదు.... శాస్త్రీయ పరిశోధన పట్ల ఆసక్తిని మరింత నీరుగార్చి, నిరుత్సాహపరచడం! అసలు మన దేశంలో సరికొత్త పరిశోధనలకు ప్రేరణనిస్తూ, శాస్త్రవేత్తల వెన్నుతట్టేందుకు ఉన్న అవార్డులే తక్కువ. ఖజానాకు ఖర్చు లేని ప్రైవేట్ ధర్మనిధి పురస్కారాల్నీ ఎత్తేయడం ఏ రకంగా సమంజసం? ఇప్పటికే దేశం. ప్రాథమిక శాస్త్రీయ పరిశోధనలకు వచ్చే యువతీ యువకులు తగ్గారు. ఇతర రంగాల్లోని భారీ వేతనాలిచ్చే ఉద్యోగాల వైపు మళ్ళుతున్నారు. తాజా చర్యతో సర్కార్ ఎలాంటి సంకేతాలిస్తోంది?

పాత అవార్డుల స్థానంలో నోబెల్ తరహాలో 'విజ్ఞాన్ రత్న' పేరిట ఉన్నత శ్రేణి జాతీయ అవార్డులు కొన్ని తెస్తామని సర్కారు వారి మాట. ఈ కొత్తవి పరిశోధనలో అన్ని విభాగాలకూ, పరిశోధకులకూ వర్తిస్తాయో లేదో తెలీదు. అవార్డులు తీసేస్తే, వాటి కోసం ఇచ్చిన ధర్మనిధులు ఏమవుతాయి? వాటిని దేనికి వినియోగిస్తారు? జవాబు లేని ప్రశ్నలెన్నో! శాస్త్రీయ పరికరాల కొనుగోలుపై జీఎస్టీని కేంద్రం ఇటీవలే 5 శాతం నుంచి 18 శాతానికి పెంచింది. ఇది పలు సంస్థల పరిశోధన బడ్జెట్‌కు మోయలేని భారమవుతోంది. అలాగే, విదేశీ పరిశోధకుల్ని ఆహ్వానించాలన్నా, విదేశీ విశ్వవిద్యాలయంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవాలన్నా లెక్కలేనన్ని అనుమతులు అడ్డం పెట్టి, వ్యవహారం సంక్లిష్టం చేసింది. పరిశోధనలో అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని దాదాపు అసాధ్యం చేసింది. నమ్మకాలు, విశ్వాసాలకే తప్ప హేతుబద్ధత, తార్కిక విశ్లేషణకు చోటు లేకుండా పోతున్న రోజుల్లో, పాలనలో శాస్త్రీయ దృష్టికి ప్రోత్సాహం ఇలానే ఉంటుందేమో! ఏమైనా ఉత్తమాటలు చెప్పి ఉన్నవాటన్నిటినీ ఎత్తేయడం... మబ్బులు చూపిస్తూ ముంతలో ఉన్న నీళ్ళు ఒలకబోయడమే!!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: శు.ద్వాదశి ఉ.6.47 వరకు, తదుపరి త్రయోదశి తె.5.01 వరకు(తెల్లవారితే శనివారం), నక్షత్రం: శతభిషం సా.6.51 వరకు తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.12.58 నుండి 2.30 వరకు దుర్ముహూర్తం: ఉ.8.14 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.11 నుండి 12.58 వరకు, అమృతఘడియలు: ప.12.00 నుండి 1.31 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.43
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

ఈ గిల్లికజ్జాలు దేని కోసం?

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఏపీలో గద్దెనెక్కిన చంద్రబాబు నాయుడు, తెలంగాణలో కేసీఆర్ పాలన తీరును ఎద్దేవా చేస్తూ వ్యాఖ్యానించేవారు. తన ముందు కేసీఆర్ అనుభవం ఏపాటి అన్నట్టు వ్యాఖ్యానిస్తుండేవారు. చివరకు 'నోటుకు ఓటు'తో ఎమెల్సీని కొనుగోలు చేయబోయి అడ్డంగా బుక్కయ్యారు. ఏపీలో జగన్ సర్కారు ఏర్పాటయ్యాక రెండు రాష్ట్రాల మధ్య సఖ్యత పెరిగింది. కానీ, ఇటీవల టీఆర్ఎస్ మంత్రులు ఏపీ సర్కారుపై నోరు జారుతున్నారు. ఒకవైపు కేసీఆర్ 'భారత్ రాష్ట్ర సమితి' స్థాపించి వెళ్తుంటే, ఆయన మంత్రులు ఏపీతో గిల్లికజ్జాలు పెట్టుకోవడం వల్ల లాభం ఏమిటి?

తెలంగాణ సీనియర్ మంత్రి టి. హరీష్ రావు ఏపీ గురించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి. కొంత పద్ధతిగా ఉండే మనిషే అయినా, ఆయన అనవసరంగా ఏపీ ప్రస్తావన తెచ్చారనిపిస్తుంది. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఏపీలో కన్నా తెలంగాణలో బెటర్ గా ఉన్నారనీ, ఏపీలో నిరసన తెలిపితే లోపల వేస్తున్నారనీ ఆయన అన్నారు! దీనిపై వెంటనే ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందిస్తూ, ఏపీకి వచ్చి ఇక్కడ టీచర్ల స్థితిగతులు చూడాలని సలహా ఇచ్చారు. ఎందువల్లో తెలియదు కాని ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పుడప్పుడు టీఆర్ఎస్ మంత్రులు కొందరు మాట జారుతున్నారు. అంతకుముందు టర్మ్‌లో ఏపీలో అధికారంలోఉన్న టీడీపీకి, తెలంగాణలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌కు మధ్య సఖ్యత ఉండేది కాదు. దానికి 'ఓటుకు నోటు' కేసు తోడైంది. అప్పట్లో ప్రభుత్వాలు ఏర్పడిన తొలి రోజుల్లో ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన తీరును ఎద్దేవా చేస్తూ వ్యాఖ్యానిస్తుండేవారు. తన అనుభవం ముందు కేసీఆర్ ఏపాటి అని అంటూ తెలంగాణ ప్రభుత్వంలోని లోటుపాట్లను ఎత్తి చూపుతుండేవారు. ఆ తర్వాత తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలలో టీఆర్ఎస్ నామినేటెడ్ ఎమ్మెల్యే ఒకరిని కొనుగోలు చేయబోయి చంద్రబాబు దొరికిపోయారు. దానిని అవకాశంగా మలచుకుని ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి చంద్రబాబును విజయవాడకు పంపించేయడంలో కేసీఆర్ కృతకృత్యులయ్యారు.

ఏపీలో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రెండు రాష్ట్రాల మధ్య పరిస్థితి చక్కబడింది. ఆయా అంశాలలో భిన్నాభిప్రాయాలు ఉన్నా, వాటిని వ్యక్తిగత తగాదాలుగానో, పార్టీల మధ్య గొడవలుగానో మార్చకుండా ఇరువైపులా జాగ్రత్త పడుతున్నారు. అయితే ఈ మధ్య కాలంలో తెలంగాణ మంత్రులు అప్పడప్పుడు నోరు జారుతున్నారు. ఈ విషయంలో మంత్రి ప్రశాంతరెడ్డి తొలుత ఏపీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆ తర్వాత మంత్రి కేటీఆర్ ఒక సభలో ఏపీ రోడ్లు బాగో లేదంటూ ఒక వ్యాఖ్య చేసి ఇబ్బంది పడ్డారు. ఆ వ్యాఖ్య చేయగానే సోషల్ మీడియాలో.. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్ల ఫొటోలను తీసి కేటీఆర్‌కు తెలియచేసే యత్నం చేశారు. తనపై వస్తున్న విమర్శలను దృష్టిలో పెట్టుకుని ఆరోజు రాత్రే కేటీఆర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని విచారం వ్యక్తం చేశారు. అంతటితో ఆ వివాదం ముగిసింది. ఈ మధ్య 'హిందూ' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏపీ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రశంసిస్తూ కష్టకాలంలో కూడా బాగా పనిచేశారని అన్నారు కూడా. అయితే ఇటీవల మంత్రి హరీష్ రావు తిరుపతి వెళ్లిన సందర్భంలో ఏపీలో కరెంటు సప్లయి సరిగా లేదని వ్యాఖ్యానించడం విమర్శలకు దారి తీసింది. హరీష్ రావు మళ్లీ ఇంకో సందర్భం చూసుకుని ఏపీలో టీచర్లు, ఉద్యోగులపై అణచివేత జరుగుతోందన్న భావన కలిగేలా మాట్లాడారు. అది పూర్తిగా తప్పని చెప్పాలి. ఆయా సంఘాల వారు



తమ డిమాండుల కోసం 'చలో అసెంబ్లీ' అనో, 'చలో సెక్రటేరియట్' అనో.. ఇలా రకరకాల ఆందోళనలు చేస్తుంటారు. ఆ క్రమంలో పోలీసులు ఎక్కడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా వారి విధి వారు నిర్వర్తిస్తారు. అది ఏ రాష్ట్రంలో అయినా జరుగుతుంది. ఏపీలోనే ఇలా జరుగుతున్నట్లు, తెలంగాణలో జరగనట్లు ఎలా మాట్లాడతారు?

ఏ రాష్ట్రంలో ఉండే సమస్యలు ఆ రాష్ట్రంలో ఉంటాయి. రెండు రాష్ట్రాల్లో పీఆర్‌సీలు ఇంచుమించు ఒకే విధంగా ఉన్నాయి. తెలంగాణలో రిటైర్‌మెంట్ వయసు అరవై ఒకటి అయితే, ఏపీలో అరవై రెండు. ఆ మేరకు టీచర్లు, ఉద్యోగులకు ఏడాదిపాటు అదనంగా ఉద్యోగ భద్రత వచ్చింది. ఏపీలో స్కూళ్లను 'నాడు–నేడు' కింద బాగు చేస్తున్నారు. అదే తరహాలో తెలంగాణలో కూడా చేయడం ఆరంభించారు. ఇది మంచి పద్ధతి. ఏ రాష్ట్రంలో అయినా ప్రజలకు ఉపయోగపడే విషయాలు జరుగుతుంటే వాటిని ఇతర రాష్ట్రాలు ఆచరించడం స్వాగతించవలసిన విషయం. తెలంగాణలో మిషన్ భగీరథను ఆయా రాష్ట్రాల వారు చూసి వెళ్లారు. కొందరు దానికి అనుగుణంగా వారి రాష్ట్రాల్లో ప్లాన్ చేసుకున్నారు. ఏపీలో రైతు భరోసా కేంద్రాలు పెట్టిన తర్వాత తెలంగాణలో రైతు వేదికలను ఏర్పాటు చేశారు. ఇలా పోల్చుకుంటూ పోతే చాలా విషయాలు వస్తాయి. కనుక హరీష్ రావు వంటి సీనియర్ మంత్రులు సంయమనంతో మాట్లాడడం మంచిది. తెలంగాణ ఉద్యమం ముగిసి చాలా కాలం అయిందని విస్మరించకూడదు.

ఏపీపై కేటీఆర్ ఒక రకంగా మాట్లాడితే హరీష్ రావు భిన్నంగా మాట్లాడడమే కాకుండా, వివరణ కూడా ఇవ్వలేదు. పైగా మరో మంత్రి గంగుల కమలాకర్ మరింత ముందుకు వెళ్లి ఏపీలో ప్రభుత్వం వైఫల్యం చెందిందనీ, జాతీయ పార్టీ పెడితే ఏపీలో కూడా గెలుస్తామనీ అన్నారు. బహుశా హరీష్‌కు విధేయుడుగా ఆయన మాట్లాడారా అన్న సందేహం వస్తుంది. ఆయన మరో సీరియస్ వ్యాఖ్య కూడా చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డిని తెలంగాణ జోలికి రావద్దనీ, ఒకవేళ వస్తే 2014 ముందటి పరిస్థితులు చూడాల్సి వస్తుందని హెచ్చరించారు! అంటే ఏమిటి దాని అర్థం? ఏపీలోకి వెళ్లి ఉద్యమాలు చేస్తారా? లేక హైదరాబాద్‌లో, ఇతర జిల్లాల్లో నివసిస్తున్న ఆంధ్ర సెటిలర్స్‌పై దాడులు చేస్తారా? ఇదేనా ఒక మంత్రి అనవలసిన మాట.

నిజానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాంటి వ్యాఖ్య చేసిన కమలాకర్‌ను బహిరంగంగా మందలించి ఉండాల్సింది. ఏపీ నుంచి వచ్చి స్థిరపడిన వారు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ పరిసరాలలో ఉన్నారు. వారిలో వైపీపీ మద్దతుదారులు, జగన్ అభిమానులు గణనీయంగానే ఉంటారు. హరీష్, లేదా కమలాకర్ మాదిరి టీఆర్ఎస్ నేతలు ఇలాగే వ్యాఖ్యానిస్తూ పోతే వారిలో వ్యతిరేకత రావచ్చు. అందువల్ల టీఆర్ఎస్‌కు రాజకీయంగా కూడా ఉపయోగం ఉండదు. గత శాసనసభ ఎన్నికలలో ఆంధ్ర సెటిలర్లు టీఆర్ఎస్‌కు బాగా మద్దతు ఇచ్చారు. ఆ తర్వాత జరిగిన హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో ఆంధ్ర సెటిలర్స్ ప్రాంతాలన్నిటిలో టీఆర్ఎస్ గెలిస్తే, తెలంగాణ నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్న ప్రాంతాలలో ఎక్కువగా భారతీయ జనతా పార్టీ గెలిచింది. ఈ సంగతి టీఆర్ఎస్ నేతలకు తెలియదా? ఇదంతా చూస్తుంటే గతంలో మాదిరి ఆంధ్రా వ్యతిరేక సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడం ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నారా అన్న ఆలోచన కూడా విశ్లేషణలోకి వస్తుంది. కాని అప్పటి పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి వేరు. మిగిలిన రాష్ట్రాలలో పరిస్థితులపై మాట్లాడడం వేరు, ఏపీ గురించి మాట్లాడడం వేరు. రెండు రాష్ట్రాలూ తెలుగువారివే. అదీ కాకుండా ఒక రాష్ట్రంగా ఉండి విడివడినవారు. అయినా రెండు రాష్ట్రాల ప్రజలు కలిసిమెలిసి ఉండాలని అంతా కోరుకుంటారు. దానికి రెండువైపులా సహకరించుకోవాలి.

తొలుత ఏపీ మంత్రులు ఇలాంటి అంశాలపై రియాక్ట్ అయ్యే వారు కారు. కొంత సంయమనం పాటించేవారు. కాని హరీష్ రావు వ్యాఖ్యలు శృతి మించడంతో వారు కూడా కొంత ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ నేతలకు ఒక కోపం ఉన్నట్లుంది. తమ నేత కేసీఆర్ కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే ఏపీ ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోవడం లేదన్నది వారి ఆక్రోశం కావచ్చు. అలాగే వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టరాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుంటే, ఏపీ ప్రభుత్వం మొత్తం అన్ని జిల్లాలలో దానిని అమలు చేయడానికి ఉపక్రమించింది. ఏపీలో అది విజయవంతంగా సాగుతుండడం, రైతులలో వ్యతిరేకత వ్యక్తం కాకపోతుండడంతో టీఆర్ఎస్‌లో అసహనం పెరిగి ఉండవచ్చు. పోలవరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం మొదట బాగానే సహకరించినా, తదుపరి ఏదో ఒక కొర్రీ పెడుతోంది. ప్రాజెక్టు పూర్తి అయితే భద్రాచలం మునిగిపోతుందని ప్రచారం చేసింది. కేంద్రం ఆ వాదనను ఖండించడంతో రాజకీయం కోసమే టీఆర్ఎస్ ఇలాంటివాటిని తెరపైకి తెస్తోందన్న భావన ఏర్పడింది. ఒక వైపు కేసీఆర్ 'భారత్ రాష్ట్ర సమితి' పేరుతో జాతీయ పార్టీని స్థాపించి ముందుకు వెళుతుంటే, ఆయన మంత్రులు మాత్రం ఏపీ ప్రభుత్వంతో గిల్లికజ్జాలు పెట్టుకుని రాజకీయ వివాదాలు సృష్టించే పనిలో ఉన్నారు. దీనివల్ల ఎవరికి లాభం?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తొలగించలేరా?



ముర్మూజీపై చేసిన వ్యాఖ్యకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, ఉదిత్ రాజ్ మళ్లీ ఒక కామెంట్ చేశారు! గతంలో కోవింద్‌జీని కూడా ఇలాగే అన్నారు. కాంగ్రెస్ అతడిని తొలగించలేదా!

– షహజాద్, బీజేపీ జాతీయ ప్రతినిధి

విశ్వాస ఘాతుకం



పాకిస్తాన్ అన్ని దేశాలతోనూ డబుల్‌గేమ్ ఆడుతోంది. తాజాగా రష్యాతో! రష్యా నుంచి గ్యాస్‌ను, గోధుమలను చవకగా తీసుకుంటూనే, ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేస్తోంది.

– రిదాభట్, పహల్గామ్ విద్యార్థిని

సహజ అనుబంధం



మీరు ఎవరైనప్పటికీ, ఎంతటి వారైనప్పటికీ మొదట ఓ తల్లికి బిడ్డ. 'భారత్ జోడో యాత్ర'లో తనతో పాటు కలిసి పాదయాత్ర చేయడానికి కర్ణాటక వచ్చిన తల్లి పట్ల రాహుల్ ఎంతో బాధ్యతగా, ప్రేమగా వ్యవహరించారు. అదెంతో సహజంగా ఉంది. సృష్టిలోని తల్లీ కొడుకుల అనుబంధానికి అందమైన నిర్వచనంలా అనిపించింది.

– దీపాలీ ప్రభు, సెఫాలజిస్ట్

ఊహాగానాలు



నోబెల్ శాంతి బహుమతి కోసం ఈ ఏడాది 343 నామినేషన్‌లు వెళ్లాయి.! విజేత పేరు వెల్లడయ్యాక కూడా తక్కిన నామినీలు ఎవరో నోబెల్ సంస్థ మరో 50 ఏళ్ల వరకు బహిర్గతపరచదు. ఏటా విజేత ప్రకటనకు ముందు వినిపించే నామినీల పేర్లన్నీ ఉద్దేశపూర్వకంగా జరిగే ఊహాగానాలే.

– పాల్కీ శర్మ, జర్నలిస్ట్

మారణహోమం



మనమొక పిచ్చిపట్టిన ప్రపంచంలో జీవిస్తున్నాం. థాయిలాండ్‌లోని ఒక మాజీ పోలీసు అధికారి.. పిల్లల సంరక్షణ కేంద్రంపై తుపాకీతో కాల్పులు జరిపి కనీసం 35 మందిని బలిగొన్నాడు. వారిలో 20 మందికి పైగా చిన్నారులే! ఆ తర్వాత అతడు తన కుటుంబాన్ని చంపి, తనూ కాల్చుకుని చనిపోయాడు!

– ఇయానిస్ కోస్మిన్స్, 'హోప్ లైట్' సీఈవో

ఎవరికీ రాని సమస్య!



ఇండియాలో ఉత్పత్తి అవుతున్న దగ్గు మందులలో నాలుగింటిని అతి ప్రాణాంతకమైనవిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది! ఇందుకు కారణం జాంబియాలో 66 మంది చిన్నారులు మరణించడం. అయితే జాంబియాకు నాదొక ప్రశ్న. మొదట మనం ఏ ప్రమాణాలతో వాటిని ఇండియా నుంచి దిగుమతి చేసుకున్నట్లు?! ఆ దగ్గు మందుల వల్ల ఏ దేశాలలోనూ రాని సమస్య మన దేశంలోనే ఎందుకు వచ్చినట్లు?

– లామిన్ సోవ్, జాంబియా పౌరుడు

ముందు జాగ్రత్త



నవంబరు నుంచి రోజుకు 2 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తిని తగ్గించాలని రష్యా, ఒపెక్ దేశాలు కలిసి నిర్ణయించాయి! ఒపెక్ కోతలకు ప్రతిస్పందనగా జో బైడెన్ నవంబరు నుంచి రోజుకు 10 మిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలను విడుదల చేయనున్నారు. ఆ నిల్వలు ఓట్ల కొనుగోలు కోసం ఉంచుకున్నవి కావు.

– డేనియల్ టర్నర్, ఆయిల్ ఎనలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్


పస లేని ప్రతిపాదన

భారత ఎన్నికల సంఘం ఒక పస లేని ప్రతిపాదన చేసి, అభిప్రాయాలు చెప్పండంటూ రాజకీయ పార్టీల అధ్యక్షులకు లేఖలు రాసింది. అదేమిటంటే... పార్టీలు ఎన్నికలలో ఇవ్వబోయే హామీలు; ఆ హామీలను అమలుచెయ్యబోయే విధివిధానాలు, వాటికై ఎలా నిధులు సమీకరించబోయేదీ, ప్రణాళిక అమలయ్యాక ఏం లాభం కలిగేదీ వివరిస్తూ కమిషన్‌కి ముందస్తుగానే అఫిడవిట్ సమర్పించాలట. తద్వారా ప్రజానీకానికి అలవి కాని హామీల బాధ తప్పడంతో బాటు, ప్రభుత్వ ఖజానా స్థితిగతుల పట్ల వాస్తవిక దృక్పథంతో ఎవరున్నారో తెలుస్తుందట. ఎన్నికల సంఘానిది విచిత్రమైన కోరిక. ఏ పార్టీ అయినా ఒక అభివృద్ధి కార్యక్రమం గురించో, సంక్షేమ విధానం గురించో చెప్పి, అది ఎందుకు తమ ప్రాధమ్యమో చెప్పగలదు. కానీ వాటికి నిధులెక్కడినుండి వస్తాయో, ఎలా మేనేజ్ చేస్తుందో చెప్పాలంటే సాధ్యమేనా? పోనీ తెలుసుకుని ఎన్నికల సంఘం ఏమి చేస్తుంది? ఏదైనా ప్రతిపాదన తిరస్కరిస్తుందా? తిరస్కరిస్తే ఏ ప్రాతిపదికన ఆ నిర్ణయం తీసుకుంటుంది? అలా జడ్జ్ చేసే రాజ్యాంగపరమైన హక్కు ఆ సంఘానికి ఉందా? పనికిరాని పరిజ్ఞానం సేకరించడం ద్వారా ఎన్నికల సంస్కరణలు సాధ్యమౌతాయా? ఇప్పుడు కావాల్సింది లోపరహితంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ. ఎన్నికల హామీలపై నిర్ణయం తీసుకోగల చైతన్యం ప్రజలకు ఎటూ ఉంది. అట్టే బెంగ పెట్టుకోనక్కర లేదు.

– డా।। డీవీజీ శంకర రావు; మాజీ ఎంపీ, పార్వతీపురం

ఎంతెంత దూరం...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

నారదుడు తంబూర దీస్కుండు. చిర్తలు గొట్టుకుంట, నారాయన, నారాయన అన్కుంట ఇంద్రుని తాన్కి బోయిండు.

'ఏం నారదా! యాడికెల్లొస్తున్నవ్' ఇంద్రుడడిగిండు.

'బారత దేసం కెల్లి' నారదుడు జెప్పిండు.

'గాడ ఎవలన్న యగ్నం జేస్తున్నరా? తపస్సు గిన జేస్తున్నరా?'

ఎవ్వలు తన కుర్సికి ఎసరు బెడ్తరో అని గీయిన బుగులుపడుతుంటడు అని మనసుల అనుకోని –

'ఎవ్వలు యగ్నం జేస్తలేరు. తపస్సు గుడ్క జేస్త లేరు. గిప్పుడు గాడ ఒక దిక్కు బారత్ జోడో, ఇంకో దిక్కు కాంగ్రెస్ చోడో, తోడో నడుస్తున్నయి' అని నారదుడన్నడు.

'కట్టి, కొట్టి, తెచ్చె అంటె నాకేం సమజైతది నారదా! జెర కుల్ల కుల్ల జెప్పు'

'అపొజిసన్ పార్టిలను ఒక్కటి జేసేతందుకు బారత్ జోడో అన్కుంట కన్యాకుమారికెల్లి రాహుల్ గాంది పాదయాత్ర షురువు జేసిండు. గాల్లను గీల్లను గల్సుకుంట ఒక్క తీర్గ అయిదు నెలలు కశ్మీర్ దాంక నడుస్తడు. తమిలనాడు కెల్లి నడుస్తుంటె ఒక ముస్లాయిన గాయినకు గండ్లబడ్డడు. మా కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడు లీటర్ గోద్మపిండిని 20 రూపాయలకు అమ్మెటోల్లు. గిప్పుడు 40 రూపాయలకు అమ్ముతున్నారని గా ముస్లాయిన తోని రాహుల్ అన్నడు. ఒగామె రాహుల్ నెత్తి మీద తాటికమ్మల టోపి బెట్టింది. జెనంకు టోపి బెట్టితందుకు నేను నడుస్తుంటె గీమె నాకే టోపి బెట్టిందని గాయిన మనసుల అనుకుండు.'

'రాహుల్ ఒక్కడే నడుస్తున్నడా? గాయిన యెంబడి ఎవలన్న ఉన్నరా?'

'గాయినెంబడి 119 మంది కాంగ్రెస్ ముదుర్లున్నరు. లోకల్ చెంచగాల్లే గాకుంట కద్మ రాస్ట్రాల చెంచగాల్లు; సర్కార్ కొల్వుల గురించి నడుస్తున్నం అని రాసి ఉన్న టీ షర్టులు దొడుక్కోని కొంత మంది పోరగాల్లు గాయినెంబడి నడ్వబట్టిండ్రు. గుడిసె హోటల్ ముంగటేసిన బెంచిమీద గూసోని ఛాయ్ దాక్కుంట జెనంతోని రాహుల్ ముచ్చటబెట్టబట్టిండు. ఛాయ్ దాక్కుంట జెనంతోని ముచ్చట బెట్టకుంటె ఛాయ్ పే చర్చను నకల్ గొడ్తుండ్రని బిజెపోల్లంటరు అని ఒక కాంగ్రెస్ ముదురు అన్నడు. గీ ముదుర్లు జెయ్యబట్కనే ఎఐసిసి ప్రెసిడెంట్ కుర్సి వొద్దను కున్న అని రాహుల్ మనసుల అనుకుండు.'

'రాహుల్ పాదయాత్ర గురించి బిజెపోల్లు ఏమన్నరు?'

'రాహుల్ 41 వేల రూపాయల టీషర్టు దొడిగిండు. దేఖో భారత్ అని బిజెపోల్లు అంటే ప్రతాని మోదీ 10 లక్షల రూపాయల కోటు దొడుక్కుండు. లచ్చన్నర రూపాయల కండ్లద్దాలు బెట్టిండు. ఒకసారి కండ్లు దెర్సి సూడుండ్రి అని కాంగ్రెసోల్లు అనబట్టిండ్రు. అమిత్ షా కార్టూన్ చపాయించి గా దాని కింద మన దేశం పెద్ద పప్పు అని రాసి ఉన్న తెల్ల రంగు టీషర్టులను దస్రకెల్లి దొడ్గుతమని తృణమూల్ కాంగ్రెసోల్లు అన్నరు.'

'కాంగ్రెస్ చోడో ఏంది?'

'ఒక దిక్కు రాహుల్ పాదయాత్ర జేస్తుంటె గోవాల ఎన్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిల దుంకిండ్రు. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి బిజెపీలకు దుంకితె గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్లకెల్లి ఎల్లి ఆజాద్ ఫ్రంట్ పార్టీ బెట్టిండు. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ముఖ్యమంత్రి కుర్సి మీది కెల్లి దించుతె మంచి గుండదని బెదిరిస్తె హన్మంతున్ని జెయ్యబోతె బోడ కోతి అయ్యె గదాని సోనియ మొత్తుకున్నది.'



'గిప్పుడు రాహుల్ యాడిదాంకొచ్చిండు?'

'ఎంతెంత దూరం శానశాన దూరమన్కుంట కర్నాటకల కొచ్చిండు. మీరు పెండ్లి ఎందుకు జేస్కోలేదని ఒక పొల్ల అడిగింది. సన్నాసైయ్యేబట్కె వాజపేయి ప్రతాని అయిండు. పెండ్లామున్న బైరాగి అయ్యేబట్కె మోదీ ప్రతాని కుర్సి ఎక్కిండు. సన్నాసినైతె ఇయ్యాల గాకున్నా రేపైన నేను ప్రతానినైత అని రాహుల్ అన్నడు. ఒక తాన ఒక ముండమోపిరాలు గాయినను గల్సి గామె కేమన్న జెయ్యమని అడిగింది. ఏం ఫికర్ జెయ్యకు నేను ప్రతానినైనంక నీ మొగన్కి సర్కార్ కొల్వు ఇప్పిస్త అని గాయిన అనంగనే సచ్చినోనికి కొల్వా అని గామె గుల్గింది. రాహుల్ తీరు బేగానీ షాదీమే అబ్దుల్లా దీవానా! వొస్త' అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.


తోక: 'సమీబియా కెల్లి దెచ్చిన చిర్తపులులకు పేరుబెట్టినోల్లకు ఇనాం ఇస్తనని ప్రతాని అన్నడు. నువ్వైతె ఏం పేరు బెడ్తవ్‌ర?' అని అడిగితె–

'ఒకదాని పేరు బేరోజ్గారి. ఇంకొక దాని పేరు గులాంగిరి అని బెడ్త' అని మా సత్నారి అన్నడు. మావోన్కి ప్రతాని ఇనాం ఇస్తడో ఇయ్యడో గని జెనమైతె తప్పకుంట ఇస్తరు.

– తెలిదేవర భానుమూర్తి
వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

అన్వేషణ

భగవంతుని అన్వేషించేవాళ్ళు లోకంలో కొద్ది మందే అయినా, వాళ్ళు ఎప్పుడూ ఉంటారు. అలాంటి భగవదన్వేషకుల్ని గురించి చెబుతూ మెహర్‌బాబా వారిని ముత్యాల అన్వేషకులతో పోల్చినారు. సముద్రమంటే సంసారం, ఈ ప్రపంచం సముద్రంలో ఉండే అలలు, సంసారంలో ఉండే కష్టాలు. ముత్యం అంటే భగవత్ సాక్షాత్కారం. భగవదన్వేషకుడు అంటే సాధకుడు. అమూల్యమైన ముత్యం సముద్రం అడుగున దొరుకుతుందని విని, సముద్రం ఒడ్డుకు వెళ్ళి సముద్రం విశాలత్వాన్ని చూసి ఆశ్చర్యపోతాడు.



జ్యోతిర్మయం

ఇలాంటి వాళ్ళలోంచి ఏ ఒక్కడో అన్వేషణ గుర్తుకు వచ్చి, ఈదటం మొదలుపెడతాడు. అనగా సాధకుడు తన సాధనా మార్గంలో పురోగమిస్తాడు. ఏ ఒక్కడో సముద్రం లోపలిదాకా ఈదుకొంటూ పోతాడు. మిగిలిన వాళ్ళంతా ప్రావీణ్యం సంపాదించిన ఉత్సాహంలో ముత్యం సంగతే మర్చిపోతారు. భగవంతుని సంగతి మర్చిపోతారు. సముద్రం లోపలికి వెళ్ళిన చాలామంది లోంచి ఏ ఒక్కడో ముత్యాన్ని దొరకబుచ్చుకుంటాడు. భగవత్ సాక్షాత్కారాన్ని పొందుతాడు. అలా ముత్యాన్ని దొరకబుచ్చుకొన్న చాలామంది లోంచి ఏ ఒక్కడో ఒడ్డుకు తిరిగివస్తాడు. ఆ ఒక్కడు సద్గురువు. అతడు తన ముత్యాన్ని మిగిలిన వాళ్ళకు చూపించి వారూ భగవంతుని కనుగొన వచ్చని వారిని భగవంతుని వైపు మరలుస్తాడు.

– దీవి సుబ్బారావు



కర్రల సమరం..పగిలిన తలలు

- దేవరగట్టులో ఈ ఏడాది కొనసాగిన ఆచారం
- 86 మందికి గాయాలు
- మెరుగైన చికిత్స కోసం ఏడుగురి తరలింపు
- అమలులో 144 సెక్షన్

హొళగుంద: కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో ఆచారం పేరుతో కర్రల సమరాన్ని ఈ ఏడాది కూడా భక్తులు కొనసాగించారు. తలలు పగిలి 86 మందికి గాయాలవ్వగా, ఏడుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోనిలోని ఆస్పత్రులకు తరలించారు. పోలీస్ ఉన్నతాధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... దేవరగట్టులో బుధవారం అర్ధ రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు బన్ని మహోత్సవాన్ని నిర్వహించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం, అధికారుల ఆదేశాలను పట్టించుకోని భక్తులు కర్రల సమరాన్ని కొనసాగించారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతానికి నెరణికి, నెరణికి తండా, కొత్తపేటతో పాటు జిల్లా నలుమూలల నుంచి, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కర్రల సమరంలో రక్తపాతాన్ని తగ్గించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది. రింగులు తొడిగిన కర్రలు వల్ల కొందరు, కాగడాలు విసరడంతో మరి కొందరు గాయపడ్డారు. ఉత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, బందోబస్తును ఎస్పీ శ్రీసిద్ధార్థకౌశల్ పరిశీలించారు.

వారసత్వ కట్టడంగా ధవళేశ్వరం బ్యారేజ్

అడిలైడ్‌లో గుర్తింపు పత్రాన్ని అందుకున్న మంత్రులు అంబటి, కాకాణి


అవార్డు అందుకుంటున్న మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి/సత్తెనపల్లి/ధవళేశ్వరం: గోదావరి డెల్టాను 160 ఏళ్లుగా సస్యశ్యామలం చేస్తూ.. భారతదేశపు ధాన్యాగారంగా నిలిపిన ధవళేశ్వరం బ్యారేజ్ (సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్ట) మణిహారంలో మరో కలికితురాయి చేరింది. ప్రపంచ సాగునీటి వారసత్వ కట్టడంగా బ్యారేజ్‌ను ఐసీఐడీ(ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్) గుర్తించింది. ఇందుకు సంబంధించిన గుర్తింపు పత్రాన్ని ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో జరుగుతున్న ఐసీఐడీ 24వ కాంగ్రెస్‌లో గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలకు ఆ సంస్థ చైర్మన్ ప్రొ.ఆర్. రగబ్ రగబ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, నీటిపారుదలరంగ నిపుణులు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ పాల్గొన్నారు. దీంతో ధవళేశ్వరం బ్యారేజ్‌కు అసలైన గుర్తింపు దక్కినట్లయిందని నిపుణులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

దేశంలో నాలుగు కట్టడాలకు గుర్తింపు

పురాతన కాలం నుంచి ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తున్న కట్టడాలను ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఐసీఐడీ గుర్తిస్తోంది. ఈసారి అడిలైడ్‌లో జరుగుతున్న 24వ కాంగ్రెస్‌లో ప్రపంచవ్యాప్తంగా 22 ప్రాజెక్టులను గుర్తించగా.. ఇందులో దేశంలోని నాలుగు ప్రాజెక్టులకు స్థానం దక్కింది. వీటిలో రాష్ట్రంలో ధవళేశ్వరం బ్యారేజ్, తమిళనాడులోని లోయర్ ఆనకట్ట, ఒడిశాలోని బైతరణి, రుషికుల్య ప్రాజెక్టులున్నాయి. ఇక 2019లో ఇండోనేషియాలో జరిగిన 23వ కాంగ్రెస్‌లో రాష్ట్రంలోని కేసీ (కర్నూల్–కడప) కెనాల్ (కర్నూల్ జిల్లా), కంబం చెరువు (ప్రకాశం జిల్లా), పోరుమామిళ్ల చెరువు (వైఎస్సార్ జిల్లా)లను ప్రపంచ సాగునీటి వారసత్వ కట్టడాలుగా ఐసీఐడీ గుర్తించింది.

ధవళేశ్వరం బ్యారేజ్‌కు అసలైన గుర్తింపు

గోదావరి డెల్టాకు 160 ఏళ్లుగా సాగు, తాగునీరు అందిస్తూ దేశ ధాన్యాగారంగా గోదావరి డెల్టా భాసిల్లడానికి కారణమైన ధవళేశ్వరం బ్యారేజ్‌ను మంత్రి అంబటి రాంబాబు, కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ సి. నారాయణరెడ్డిల సూచనల మేరకు ప్రపంచ సాగునీటి వారసత్వ కట్టడంగా గుర్తించాలని ఐసీఐడీకి పంపాం. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పోటీలో ధవళేశ్వరం బ్యారేజ్‌ను ఐసీఐడీ ఎంపిక చేసింది. దీంతో ధవళేశ్వరం బ్యారేజ్‌కు అసలైన గుర్తింపు లభించింది. శతాబ్దాల క్రితం రాజులు నిర్మించిన చెరువులు, ఆనకట్టలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా.. ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందిస్తున్నాయి. అందులో పెద్దతిప్పసముద్రం, వ్యాసరాయసముద్రం, రంగరాయ సముద్రం, బుక్కపట్నం, రాయల చెరువులు ప్రధానమైనవి. వాటికి కూడా ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా గుర్తింపు తేవడానికి ప్రయత్నిస్తాం.

– వాసుదేవరెడ్డి,
డీఈ, జలవనరుల శాఖ



ధవళేశ్వరం బ్యారేజ్ సంక్షిప్త స్వరూపం ఇదీ..

నిర్మాణం: రాజమహేంద్రవరానికి సమీపంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై
స్పిల్ వే పొడవు: 3,597.67 మీటర్లు (ధవళేశ్వరం బ్రాంచ్ 1,437.92, ర్యాలీ బ్రాంచ్ 884.45, మద్దూరు బ్రాంచ్ 469.66, విజ్జేశ్వరం బ్రాంచ్ 800.64 మీటర్లు)
స్పిల్ వే గేట్లు: 175
గరిష్ట నీటి మట్టం: 13.64 మీటర్లు
కనిష్ట నీటి మట్టం: 9.62 మీటర్లు
గరిష్ట నీటి నిల్వ : 2.931 టీఎంసీలు
ప్రధాన కాలువల పొడవు: 29.4 కి.మీలు (ఈస్టర్న్ డెల్టా, వెస్టర్న్ డెల్టా, సెంట్రల్ డెల్టాలకు వేర్వేరు కాలువలు)
బ్రాంచ్ కాలువల పొడవు: 794.25 కి.మీలు
డిస్ట్రిబ్యూటరీలు (పిల్ల కాలువల) పొడవు: 3,790.6 కి.మీలు
ఆయకట్టు: 10,13,376 ఎకరాలు
తాగునీరందే గ్రామాలు: 833 గ్రామాలకు పైగా.

డాక్టరమ్మ విరాళం రూ.20 కోట్లు

- గుంటూరు జీజీహెచ్‌లో ఎంసీహెచ్ భవన నిర్మాణానికి అందజేత
- డాక్టర్ ఉమ గవినిపై ప్రశంసల జల్లు కురిపిస్తున్న నెటిజన్లు


డాక్టర్ ఉమ గవిని

గుంటూరు మెడికల్: ఓ డాక్టరమ్మ తాను వైద్య విద్యను అభ్యసించిన కళాశాలకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.20 కోట్ల భారీ విరాళం ప్రకటించింది. నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది. వివరాల్లోకి వెళితే...గుంటూరు జిల్లా, తెనాలి సమీపంలోని కూచిపూడికి చెందిన డాక్టర్ గవిని వెంకటకృష్ణారావు రెండో కుమార్తె డాక్టర్ ఉమ గవిని. గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యనభ్యసించారు. అమెరికాలో 40 ఏళ్ల కిందట స్థిరపడి, ఇమ్యునాలజిస్టుగా వైద్య సేవలు అందిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింఖానా)కు అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమె ప్రస్తుతం జింఖానా కోశాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)కి డాక్టర్ ఉమ గవిని విరాళం ప్రకటించారు. అధిక మొత్తంలో విరాళం ప్రకటించిన డాక్టర్ ఉమ గవిని దాతృత్వాన్ని ప్రశంసిస్తూ అనేక పోస్టులు ఆమెకు మద్దతుగా సోషల్ మీడియాలో పెట్టారు.

సీఎం చిత్రపటానికి 1998 డీఎస్సీ అభ్యర్థుల క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి 1998 డీఎస్సీ అభ్యర్థులు గురువారం ఒంగోలులో క్షీరాభిషేకం చేశారు. నగరంలోని డీఆర్‌ఆర్‌ఎం మెమోరియల్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1998 డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం ప్రారంభమైంది. 1 నుంచి 200వ నంబర్ వరకు గల అభ్యర్థుల పత్రాలను డీఈవో బి.విజయభాస్కర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల కమిటీ సభ్యుడు జాలిరెడ్డితో కలిసి అభ్యర్థులు.. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఏయూతో కలిసి పనిచేస్తాం

- భారత్ మంచి స్నేహపూర్వక దేశం
- టోగో ఉన్నత విద్య, పరిశోధన శాఖ మంత్రి డాక్టర్ వటేబా

ఏయూ క్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేస్తామని టోగో ఉన్నత విద్య, పరిశోధన శాఖ మంత్రి డాక్టర్ వటేబా తెలిపారు. గురువారం ఆయన విశాఖపట్నంలోని ఏయూ ఫార్మసీ కళాశాల, ఇంక్యుబేషన్ సెంటర్ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. టోగో విశ్వవిద్యాలయాలు ఏయూతో అవగాహన ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం వటేబా మీడియాతో మాట్లాడుతూ భారతదేశంతో తమకు బలమైన అనుబంధం ఉందన్నారు. భారత్ మంచి స్నేహపూర్వక దేశమని కొనియాడారు. ఏయూతో సైన్స్, ఇంజనీరింగ్, స్పేస్ సైన్స్, అగ్రికల్చర్ తదితర రంగాల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రపంచానికి పెను సవాళ్లు విసురుతున్న పర్యావరణ, ఇంధన, ఆరోగ్య, వ్యవసాయ సంబంధిత అంశాలపై రెండు దేశాల విశ్వవిద్యాలయాలు సమష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. భారత్‌కు చెందిన వేలాది పరిశ్రమలు టోగోలో పనిచేస్తున్నాయన్నారు. భారత్‌లో 15 మంది టోగో విద్యార్థులు ఉన్నారని.. వీరిలో నలుగురు ఏయూలోనే ఉన్నారని చెప్పారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ మెషీన్ లెర్నింగ్, ఐవోటీ, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో కలిసి పనిచేస్తామన్నారు. విద్యార్థులతోపాటు అధ్యాపకుల ఎక్స్ఛేంజ్ చేసుకోవాలని వటేబా కోరారన్నారు. వైద్య రంగంలో నిపుణుడైన డాక్టర్ వటేబాను ఏయూ హ్యూమన్ జెనెటిక్స్ విభాగంలో గౌరవ ఆచార్యుడిగా నియమిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వటేబాను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

ఈడీ విచారణకు టీకాంగ్రెస్ నేతలు

హాజరైన మాజీ మంత్రి గీతారెడ్డి, గాలి అనిల్ కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో గురువారం మాజీ మంత్రి గీతారెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ నేత గాలి అనిల్ కుమార్‌లు ఈడీ విచారణకు హాజరయ్యారు. యంగ్ ఇండియా లిమిటెడ్‌కు విరాళాలు ఇచ్చిన వారికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసి విచారణ జరుపుతుండటం తెలిసిందే. ఈ సందర్భంగా మూడు గంటలకు పైగా గీతారెడ్డిని విచారించగా.. మరోసారి విచారణకు రావాలని ఈడీ కోరలేదని ఆమె విలేకరులకు తెలిపారు. కాగా ఈ కేసు విచారణకు హాజరుకావాలని సెప్టెంబర్ 23న తెలంగాణ కాంగ్రెస్ నేతలు, మాజీ మంత్రులు గీతారెడ్డి, సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, పార్టీ నేత గాలి అనిల్ కుమార్‌లకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ నెల 3న మాజీ మంత్రి షబ్బీర్ అలీ విచారణ ముగియగా.. పీఎంఎల్‌ఏ చట్టం సెక్షన్ 50–ఏ ప్రకారం గీతారెడ్డి, గాలి అనిల్ కుమార్‌లను ఈడీ అధికారులు గురువారం విచారించారు. ఈడీ అధికారులు కోరిన సమాచారాన్ని గీతారెడ్డి, అనిల్ కుమార్ అందించారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణ భారత అధ్యక్షుడిగా శ్రీనివాసులు



మదనపల్లె : జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణ భారత అధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన జబ్బల శ్రీనివాసులును నియమించారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ప్రతినిధుల సమావేశంలో ఏపీ కురబ, కురవ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులును దక్షిణ భారత అధ్యక్షుడిగా ఎంపిక చేశారు.

ఆ ముగ్గురూ మృతే

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరంలో స్నానాలు చేస్తూ ఈ నెల 4న ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. అదే రోజు మూడు మృతదేహాలు లభ్యంకాగా, మిగిలిన మూడు మృతదేహాలు బుధవారం తీరానికి కొట్టుకువచ్చాయి. ఓడరేవు బీచ్‌లో లభ్యమైన నల్లపు రాఘవ(18), సర్వసిద్ధి వెంకట ఫణికుమార్ (19), జక్కంపూడి ప్రభుదాస్ (17) మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

విశాఖ పోక్సో కోర్టు సంచలన తీర్పు

విశాఖ,లీగల్: ముక్కుపచ్చలారని చిన్నారిపై అత్యంత కిరాతకంగా లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడికి పదేళ్ల కారాగార శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ విశాఖలోని పోక్సో కేసుల (చిన్నారులపై శారీరక లైంగిక దాడుల నివారణచట్టం-2012) ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె.రామశ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. జైలుశిక్షతో పాటు వంద రూపాయల జరిమానా చెల్లించాలని లేని పక్షంలో అదనంగా 3 నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. చిన్నారికి రూ. 50వేల నష్టపరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు గొండి సాయిరామ్ కిరణ్ (20) అల్లూరి జిల్లా నర్సీపట్నంలోని హరిజన కాలనీ నివాసి. చిల్లర దొంగతనాలు చేస్తూ జీవనం సాగించేవాడు. అదే ప్రాంతానికి చెందిన చిన్నారి (6 ఏళ్లు) గత మే 6వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో తన అక్కతో కలసి కాల కృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి బయటకు వచ్చింది. గమనించిన సాయిరామ్ కిరణ్ చిన్నారిని నిర్జీవ ప్రదేశంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం నిందితుడిని గుర్తించి నర్సీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నిందితుడిపై సెక్షన్ 376 (ఏబీ)లతో పాటు పోక్సో చట్టం సెక్షన్ 5 (ఎం),6 కింద కేసు విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

బహుజనులంటే.. బాబుకు చులకన!

739వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: బహుజనుల ఓట్లతో గద్దెనెక్కి పేదల ఆత్మగౌరవంపై దెబ్బకొడుతూ.. వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 738, 739వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. బహుజనులను అన్ని విధాలా చులకన చేస్తూ పబ్బం గడుపుకుంటున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మూడు రాజధానులే మా అజెండా అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్ట సభల సాక్షిగా స్పష్టం చేయడం అభినందనీయమన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను తీసుకుంటున్న సీఎం జగన్‌కు మద్దతిచ్చేందుకు రాష్ట్రం యావత్తు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. చంద్రబాబు.. ఆయన బినామీలకు ఇది నచ్చకపోతే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి.. ప్రజల్లోకి వెళ్లి తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. 29 గ్రామాలను అడ్డుపెట్టుకుని తిష్టవేయాలని చూసిన కులవాదులకు, పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పి తరిమికొడతారన్నారు. కాగా, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో కొనసాగుతున్న బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం జోరువానలోనూ ఉత్సాహంగా కొనసాగింది. నాయకులు పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులిదాసు, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు డీకే విచారణకు హాజరు కావాల్సిందే: ఈడీ

మైసూరు: నేషనల్ హెరాల్డ్ వ్యవహారానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఈ నెల 7వ తేదీన విచారణ హాజరుకాలేనంటూ తాను చేసిన విజ్ఞప్తిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మన్నించలేదని కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ చెప్పారు. ఢిల్లీలో ఈడీ ఎదుట విచారణకు హాజరు కావాలో లేదో తమ పార్టీ నేతలతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని గురువారం అన్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం విచారణకు హాజరు కావాలంటూ డీకే శివకుమార్‌కు ఈడీ మరోసారి సందేశం పంపించింది. మనీలాండరింగ్ కేసులో ఆయనను ప్రశ్నించి, స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామని ఈడీ సహాయక డైరెక్టర్ కులదీప్ సింగ్ తెలిపారు. డీకే శివకుమార్ ప్రస్తుతం కర్ణాటకలో రాహుల్ గాంధీ వెంట భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్నారు. ఈ నెల 21వ తేదీ వరకూ తనకు విచారణ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన ఈడీకి విజ్ఞప్తి చేశారు. డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్‌కు కూడా ఇదే కేసులో ఈడీ సమన్లు జారీ చేసింది.

యూఏపీఏ ట్రిబ్యునల్ పీవోగా జస్టిస్ దినేశ్ శర్మ

సాక్షి, న్యూఢిల్లీ: చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) ట్రిబ్యునల్ ప్రిసైడింగ్ అధికారి (పీవో)గా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ), అనుబంధ సంస్థలపై విధించిన ఐదేళ్ల నిషేధాన్ని ఈ ట్రిబ్యునల్ సమీక్షించనుంది. యూఏపీఏలోని సెక్షన్-3 ప్రకారం ఏదైనా సంస్థచట్ట విరుద్ధమని ప్రకటితమైతే ఆ మేరకు వచ్చిన నోటిఫికేషన్‌ను కేంద్రం తగిన కారణాలు తెలుపుతూ ట్రిబ్యునల్‌కు పంపాలి. సెక్షన్-5 ప్రకారం ట్రిబ్యునల్‌లో హైకోర్టు న్యాయమూర్తి స్థాయి వ్యక్తి ఉండాలి. కేంద్రం కారణాలు పరిశీలించిన ట్రిబ్యునల్... చట్ట విరుద్ధమని ఎందుకు ప్రకటించకూడదో 30 రోజుల్లోగా తెలపాలని సదరు సంస్థ కోరుతుంది. సెక్షన్-4 ప్రకారం కేంద్రం విధించిన నిషేధం యూఏపీఏ ట్రిబ్యునల్ నిర్ధారించిన తర్వాతే అమలులోకి వస్తుంది.

21న జీఎస్ఎల్‌వీ మార్క్3 ప్రయోగం

సూళ్లూరుపేట: న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సంయుక్త ఆధ్వర్యంలో 21న సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ ప్రయోగవేదిక నుంచి జియో శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ మార్క్3)ను ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేషన్ లిమిటెడ్ (వన్‌వెబ్) ఇస్రో, న్యూస్పేస్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్‌లు ఈ ప్రయోగాన్ని చేసేందుకు ఇటీవల ఒప్పందం చేసుకున్నారు. వన్‌వెబ్ ఇండియా-1 పేరుతో 36 ఉపగ్రహాలను ఒక్కటిగా చేసి వాణిజ్యపరంగా రోదసీలోకి జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్ ద్వారా పంపేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇన్నాళ్లు పీఎస్ఎల్‌వీ రాకెట్‌నే వాణిజ్యపరమైన ప్రయోగాలకు వాడారు. జీఎస్ఎల్‌వీ మార్క్3 భారీ రాకెట్‌ను వాణిజ్యపరమైన ప్రయోగాలకు వాడటం ఇదే తొలిసారి. ప్రాజెక్టు ఒప్పందంలో భాగంగా 36 ఉపగ్రహాలను లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెడతారు. 'వన్‌వెబ్ అనేది గ్లోబల్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్. ఇది అంతరిక్ష వ్యాపారాలకు, ప్రభుత్వాలకు వెబ్ కనెక్టివిటీ సేవలు అందించే విధంగా రూపొందించారు' అని ఇస్రో పేర్కొంది.

16కు చేరిన మృతులు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీలో మంచు చరియలు విరిగి పడిన ఘటనలో మృతి చెందిన పర్వతారోహకుల సంఖ్య 16కు చేరింది. మంచు చరియల కింద నుంచి మరో 12 మృతదేహాలను వెలికి తీసినట్లు గురువారం నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెయినీరింగ్(ఎన్ఐఎం) తెలిపింది. మరో 15 మంది పర్వతారోహకుల జాడ తెలియాల్సి ఉందని వివరించింది. 34 మంది ట్రైనీలు సహా 42 మందితో కూడిన పర్వతారోహకుల బృందం మంగళవారం ద్రౌపదీ కా దండా-2 శిఖరం నుంచి తిరిగి వస్తుండగా 17 వేల అడుగుల ఎత్తులో వారిపైకి మంచు చరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

కేరళలో బస్సు ప్రమాదం


విహారయాత్రకు వెళ్తున్న ఐదుగురు విద్యార్థులు సహా 9 మంది మృతి


తిరువనంతపురం: ప్రైవేట్ టూరిస్ట్ బస్సు కేరళ ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఐదుగురు విద్యార్థులు సహా 9 మంది మృతి చెందారు. బుధవారం ఎర్నాకులంలోని బసెలియోస్ విద్యానికేతన్ స్కూల్‌కు చెందిన 42 మంది విద్యార్థులు, ఐదుగురు టీచర్ల బృందంతో ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సు తమిళనాడులోని ఊటీకి బయలుదేరింది. పాలక్కాడ్‌లోని వడక్కెంచేరీ వద్ద ఆ బస్సు డ్రైవర్ ముందున్న కారును ఓవర్ టేక్ చేసే యత్నంలో ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. నుజ్జయిన రెండు బస్సులు రోడ్డు పక్కకు దూసుకెళ్లాయి. ప్రైవేట్ బస్సులోని ఒక టీచర్, ఐదుగురు విద్యార్థులు, ఆర్టీసీ బస్సులోని ముగ్గురు ఘటనలో చనిపోయారు. మరో 40 మంది వరకు గాయపడ్డారు. విద్యార్థులంతా 15-17 ఏళ్ల లోపు వారే. ఆర్టీసీ బస్సులో 81 మంది ఉన్నారు. ప్రమాద సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు గంటకు 97 కిలోమీటర్ల వేగంతో వెళుతోంది. నిబంధనలను అతిక్రమించినందుకు గాను కొట్టాయం ఆర్టీవో ఆ బస్సును కొంతకాలం క్రితమే బ్లాక్ లిస్ట్‌లో చేర్చినట్లు దర్యాప్తులో తేలింది. ప్రమాదంపై సవివర నివేదిక ఇవ్వాలని కేరళ హైకోర్టు ఆదేశించింది.

రసాయన శాస్త్రంలో ముగ్గురికి ఉమ్మడిగా నోబెల్

కరోలిన్ ఆర్.బెర్టోజీ, కె.బ్యారీ షార్ప్‌లెస్, మోర్టెన్ మెల్డాల్‌కు ప్రతిష్టాత్మక బహుమతి


బెర్టోజీ


షార్ప్‌లెస్


మోర్టెన్ మెల్డాల్

స్టాక్‌హోమ్: రసాయన శాస్త్రంలో ఈ ఏడాదికి (2022) గాను ముగ్గురు శాస్త్రవేత్తలకు ఉమ్మడిగా నోబెల్ బహుమతి దక్కింది. అమెరికాకు చెందిన కరోలిన్ ఆర్.బెర్టోజీ, కె.బ్యారీ షార్ప్‌లెస్, డెన్మార్క్‌కు చెందిన మోర్టెన్ మెల్డాల్ ఈ ప్రతిష్టాత్మక బహుమతికి ఎంపికయ్యారు. పాలిమర్స్, క్యాన్సర్ ఔషధాల తయారీ, డీఎన్ఏ మ్యాపింగ్ వంటి వాటిలో ఉపయోగపడే క్లిక్ కెమిస్ట్రీ, బయో ఆర్థోగానల్ రియాక్షన్స్‌లో వారు విశేషమైన కృషి చేశారని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. మరింత మెరుగైన ఔషధాలను రూపొందించడానికి వారి పరిశోధనలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొంది. విశేషం ఏమిటంటే.. ఈసారి కెమిస్ట్రీలో నోబెల్‌కు ఎంపికైన ముగ్గురిలో ఒకరైన కె.బ్యారీ షార్ప్‌లెస్(81) 2001లో నోబెల్ బహుమతి అందుకున్నారు. ఇప్పుడు రెండోసారి స్వీకరించబోతున్నారు. ఇలా రెండుసార్లు నోబెల్ ప్రైజ్ స్వీకరించిన ఐదో వ్యక్తిగా రికార్డు సృష్టించబోతున్నారు. మోర్టెన్ మెల్డాల్ (68) యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హగన్‌లో పని చేస్తున్నారు. షార్ప్‌లెస్ కాలిఫోర్నియాలోని స్క్రిప్స్ రీసెర్చ్ సంస్థలో పరిశోధనలు సాగిస్తున్నారు. ఇక కరోలిన్ ఆర్.బెర్టోజీ (55) స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. ఆమె క్లిక్ కెమిస్ట్రీని కొత్త స్థాయికి తీసుకెళ్లారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. రసాయన శాస్త్రంలో గత ఏడాది (2021) నోబెల్ .. బెంజమిన్ లిస్ట్, డేవిడ్ మెక్‌మిలన్‌లకు లభించింది.

అన్నీ ఎర్నాక్స్‌కు సాహిత్య నోబెల్



స్టాక్‌హోమ్: ప్రముఖ ఫ్రెంచ్ రచయిత్రి అన్నీ ఎర్నాక్స్(82) 2022 సంవత్సరానికి గాను సాహిత్య రంగంలో అత్యున్నత నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. సాహిత్యంలో ఆమె విశేషమైన కృషి చేశారని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రశంసించింది. 'ద కరేజ్ అండ్ క్లినికల్ అక్యూటీ' పేరిట వ్యక్తిగత జ్ఞాపకశక్తికి సంబంధించిన మూలాలపై ఎర్నాక్స్ చేసిన రచనలకు గాను నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్లు తెలియజేసింది. ఎర్నాక్స్ తొలుత ఆటోబయోగ్రాఫికల్ నవలు రాశారు. తర్వాత కాల్పనిక సాహిత్యాన్ని వదిలేసి, జ్ఞాపకశక్తికి సంబంధించిన పుస్తకాల రచనపై దృష్టి పెట్టారు. 30కి పైగా పుస్తకాలు వెలువరించారు. ఇందులో అధికశాతం తన జీవితంలో, ఇరుగుపొరుగు ప్రజల జీవితాల్లో చోటుచేసుకున్న సంఘటనలపై ఆధారపడినవే కావడం విశేషం. తన తల్లిదండ్రుల మరణం, అనారోగ్యాలు, గర్భస్రావాలు, స్త్రీ పురుషుల మధ్య సంబంధాలను సున్నితంగా వ్యక్తీకరించారు. ఎర్నాక్స్ రాజీపడని రచయిత్రి, అందరికీ అర్థమయ్యేలా సులభ శైలిలో రచనలు చేశారని నోబెల్ కమిటీ చైర్మన్ ఆండర్స్ ఒల్సాన్ కొనియాడారు. 'ద ఇయర్స్' పేరిట 2008లో వెలువడిన ఎర్నాక్స్ రచన విమర్శకుల ప్రశంసలు పొందింది. తండ్రితో తన అనుబంధాన్ని వివరిస్తూ 'ద ప్లేస్' పేరిట మరో పుస్తకం రాశారు. లింగ, భాష, వర్గం వంటి అంశాలకు స్వీయ అనుభవాలను జోడిస్తూ, భిన్నమైన కోణాల్లో విశ్లేషిస్తూ ఎర్నాక్స్ చేసిన రచనలు పాఠకాదరణ పొందాయి. ఆమె 1940లో ఫ్రాన్స్ దేశం నార్మండీలోని యెవెటోట్ అనే పట్టణంలో పుట్టిపెరిగారు. 1901 నుంచి ఇప్పటిదాకా సాహిత్య రంగంలో 119 మందికి నోబెల్ ప్రైజ్ ప్రదానం చేయగా, ఈ బహుమతికి ఎంపికైన 17వ మహిళ ఎర్నాక్స్ కావడం గమనార్హం . నోబెల్ శాంతి బహుమతి విజేతను శుక్రవారం, ఆర్థిక శాస్త్రంలో విజేతను సోమవారం ప్రకటించనున్నారు.


గురువారం మాండ్యా జిల్లాలో భారత్ జోడో యాత్రలో కలిసి పాదయాత్ర చేస్తున్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీ

అడుగులో అడుగేస్తూ..

- రాహుల్ వెంట పాదయాత్రలో పాల్గొన్న సోనియా గాంధీ
- కరోనా నుంచి కోలుకున్నాక తొలిసారిగా ప్రజల మధ్యకు..

పాండవపుర: కర్ణాటకలో కొనసాగుతున్న కాంగ్రెస్ భారత్ జోడోయాత్రలో గురువారం పార్టీ అధినేత్రి సోనియా గాంధీ పాలుపంచుకున్నారు. కుమారుడు రాహుల్ గాంధీతో కలిసి అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగారు. అనారోగ్యంలో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన సోనియా చాలారోజుల తర్వాత ప్రజలకు దర్శనమిచ్చారు. ఆమె గత ఏడాది కరోనా మహమ్మారి బారినపడ్డారు. ఆ తర్వాత ప్రజల మధ్యకు రావడం ఇదే తొలిసారి. ఆమె చివరిసారిగా 2016 ఆగస్టులో వారణాసిలో ఓ రోడ్డుషోలో పాల్గొన్నారు. పార్టీ అధినేత్రి ఆగమనం పట్ల పాదయాత్రలో పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నినదాలు చేశారు. వారిలో ఉత్సాహం పరవళ్లు తొక్కింది. మాండ్యా జిల్లాలోని జక్కనహళ్లి, కరాడ్యా పట్టణాల మధ్య రాహుల్ వెంట కొన్ని కిలోమీటర్ల మేర సోనియా వడివడిగా అడుగులు వేశారు. ఈ అరుదైన ఘట్టానికి ప్రధాన స్రవంతి మీడియాతోపాటు సోషల్ మీడియాలోనూ మంచి స్పందన లభించింది. కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా రాహుల్, సోనియాతో పాదయాత్రలో పాల్గొన్నారు. గతంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, పెనుగాలులకు ఎదురొడ్డి నిలిచామని, సవాళ్లకు ఉన్న పరిమితులను బద్దలు కొడతామని రాహుల్ పేర్కొన్నారు. అందరం కలిసి దేశాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ ఆశయమని ట్వీట్ చేశారు. అన్ని సవాళ్లను అధిగమించి, దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొస్తామని వివరించారు. పాదయాత్రలో తన తల్లి సోనియా గాంధీ భుజాలపై తాను చేతులు వేసిన చిత్రాన్ని పోస్టు చేశారు. వారిద్దరూ కలిసి ఉన్న ఫొటోను ట్విట్టర్‌లో కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. వారికి ప్రేమే రక్షణ కవచమని పేర్కొంది.

తల్లి పూజ్యనీయురాలు

భారత్ జోడో యాత్రలో ఆసక్తికరమైన సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. సోనియా భుజాలపై చేతులు వేసి రాహుల్ నడవడం అందరి దృష్టిని ఆకర్షించింది. పాదయాత్రలో నడుస్తుండగా సోనియా బూట్ల లేసులు ఊడిపోయాయి. రాహుల్ వెంటనే కిందకు వంగి వాటిని గట్టిగా బిగించికట్టారు. ఈ చిత్రాన్ని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. దీనిపై పార్టీ సీనియర్ నేత శశి థరూర్ స్పందించారు. తల్లి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, అమ్మంటే అమ్మే అని పేర్కొన్నారు. తల్లి పూజ్యనీయురాలు అంటూ సోషల్ మీడియాలోనూ నెటిజన్లు కామెంట్లు చేశారు. యాత్రలో సోనియాను చూసేందుకు జనం బారులుతీరారు. ఆమె వారివైపు చేతులు ఊపుతూ అభివాదం చేశారు. రాహుల్ సైతం ప్రజలతో కరచాలనం చేశారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం సోనియా కేవలం 30 నిమిషాలపాటు యాత్రలో పాల్గొనాలి. కానీ, రెండు గంటలకుపైగానే భాగస్వాములు కావడం విశేషం. భారత్ జోడో యాత్రతో సోనియా మమేకమయ్యారని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ట్వీట్‌చేశారు. యాత్ర ముగిశాక సోనియాగాంధీ గురువారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

లోయలో పడిన పెళ్లి బృందం బస్సు

33 మంది మృతి..19 మందికి గాయాలు

పౌరిగఢ్వాల్: ఉత్తరాఖండ్‌లోని పౌరి గఢ్వాల్ జిల్లాలో మంగళవారం రాత్రి పెళ్లి బస్సు లోయలో పడిన ఘటనలో 33 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 19 మంది గాయపడ్డారు. బిరోంఖాల్‌లోని కందా గ్రామంలో పెళ్లి వేడుక అనంతరం సుమారు 50 మందితో కూడిన బృందం హరిద్వార్‌లో లాల్‌ఢంగ్ వైపు బస్సులో బయలుదేరింది. బస్సు సిమ్రి మలుపులో అదుపు తప్పి 500 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వరకు సహాయ చర్యలు కొనసాగాయి. కొండ ప్రాంతం కావడంతో సహాయక చర్యలు పూర్తి చేసేందుకు 24 గంటలు పట్టిందని పోలీసులు చెప్పారు. ఘటనలో 33 మంది చనిపోయారు. మరో 19 మంది గాయాలతో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థిక సాయం ప్రకటించారు.

గాంబియాలో ప్రాణాలు తీసిన 'భారతీయ' టానిక్‌లు !

- హరియాణాకు చెందిన సంస్థ తయారీ సిరప్‌లు తాగి 66 మంది చిన్నారులు మృతి
- ఆందోళన వ్యక్తం చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ


మేడిన్ కంపెనీ ఫ్యాక్టరీ

న్యూఢిల్లీ: హరియాణాలోని సోనేపట్ కర్మాగారంలో మేడిన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ సంస్థ తయారుచేసిన జలుబు, దగ్గు సిరప్‌లు తాగి ఆఫ్రికా ఖండంలోని గాంబియా దేశంలో 66 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది మూత్రపిండాలు పాడై ఇబ్బందులుపడుతున్నారు. ప్రోమిథజైన్ ఓరల్ సొల్యూషన్ బీపీ, కఫెక్సమలిన్ బేబీ కఫ్ సిరప్, మేకఫ్ బేబీ కఫ్ సిరప్, మేగ్రిప్ ఎన్ కోల్డ్ సిరప్‌లు తాగడం వల్లే ఈ మరణాలు సంభవించాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ ఘెబ్రెయెసుస్ ఆందోళన వ్యక్తంచేశారు. 'ఈ బ్రాండ్ సిరప్‌లు విషతుల్యమైన విషయం గాంబియాలో బయటపడింది. ఇవి వేరే దేశాలకు సరఫరా అయి ఉండొచ్చు. ప్రజా పంపిణీ వ్యవస్థ నుంచి ఈ బ్యాచ్ సిరప్‌లను తక్షణం తొలగించండి 'అని ఘెబ్రెయెసుస్ ఆదేశించారు. డబ్ల్యూహెచ్‌వో ఔషధ ఉత్పత్తుల అలర్ట్ విభాగం గత నెలలోనే డబ్ల్యూహెచ్‌వోను ఈ మేరకు అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రమాదకర స్థాయిలో డైఇథైలీన్ గ్లైకోల్, ఇథైలీన్ గ్లైకోల్‌లు ఈ సిరప్‌లలో ఉన్నట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలింది.

భారత్ సీరియస్..

గాంబియాలో మరణాల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఘటనపై డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) దర్యాప్తునకు ఆదేశించింది. డీసీజీఐ, హరియాణా ఫుడ్, డ్రగ్స్ విభాగ అధికారులు శాంపిళ్లను కోల్‌కతాలోని సీడీఎల్ ల్యాబ్‌కు పంపించారని హరియాణా ఆరోగ్య మంత్రి అనిల్ చెప్పారు. 'ఆ ఫార్మా సంస్థలో తయారైన ఈ సిరప్‌లను కేవలం ఎగుమతి చేస్తారు. భారత్‌లో స్థానికంగా అమ్మకాలు, వ్యాపార అనుమతులు లేవు' అని కేంద్రం తెలిపింది. ఈ విషయమై తయారీసంస్థకు అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధులు ఫోన్లు చేయగా స్పందన రాలేదు. ఉత్పత్తులను మార్కెట్ నుంచి తొలగించేందుకు గాంబియా ప్రభుత్వం నడుం బిగించింది.

మింగేసిన మెరుపు వరద

- దుర్గామాత విగ్రహం నిమజ్జనంలో విషాదం
- బెంగాల్‌లో కొట్టుకుపోయి 8 మంది భక్తుల జలసమాధి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో దుర్గామాత విగ్రహం నిమజ్జనం కోసం మాల్ నదిలో దిగిన భక్తులను ఆకస్మిక వరద కబళించింది. జల్‌పాయ్‌గురి జిల్లాలో బుధవారం రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిన్నపాటి ప్రవాహం, బురదమయమైన మాల్ నది ఒడ్డున దాదాపు 70 మంది స్థానికులు దుర్గామాత విగ్రహంతో చేరుకున్నారు. లోపలికి వెళ్లి విగ్రహం నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా నది ప్రవాహం ఉధృతమైంది. అందరూ అప్రమత్తమై ఒడ్డుకు చేరుకునేలోపే ప్రవాహం మహోగ్రంగా మారింది. దీంతో దాదాపు 80 మంది కొట్టుకుపోసాగారు. ఒడ్డున ఉన్న యువత, వలంటీర్లు దాదాపు 70 మందికిపైగా భక్తులను కాపాడారు. ఎనిమిది మంది ప్రవాహంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ప్రధాని జాతీయసహాయక నిధి నుంచి మృతుల కుటుంబాలకు చెరో రూ.2 లక్షల సాయం ప్రకటించారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం సైతం మృతులకు చెరో రూ.2లక్షల సాయం ప్రకటించింది.

సమగ్ర జనాభా విధానం కావాలి

అన్ని వర్గాలకు సమానంగా వర్తించాలి: భగవత్

నాగపూర్: దేశంలో అన్ని వర్గాలకు సమానంగా వర్తించే ఒక సమగ్ర జనాభా విధానాన్ని (పాపులేషన్ పాలసీ) రూపొందించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ అన్నారు. విస్తృతమైన చర్చలు, సంప్రదింపుల తర్వాత ఈ విధానాన్ని తయారు చేయాలని చెప్పారు. నాగపూర్‌లో బుధవారం నిర్వహించిన దసరా వేడుకల్లో మోహన్ భగవత్ మాట్లాడారు. కమ్యూనిటీ ఆధారిత జనాభా అసమతుల్యత అనేది చాలా కీలకమైన అంశమని, దీన్ని విస్మరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. జనాభా అసమతుల్యత అనేది దేశ భౌగోళిక సరిహద్దులను సైతం మార్చేస్తుందని వ్యాఖ్యానించారు. వివిధ వర్గాల జనాభా మధ్య సమతుల్యత కోసం అన్ని వర్గాలకు సమానంగా వర్తించే నూతన జనాభా విధానాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు. దేశంలో వర్గాల మధ్య సమతుల్యత ఉండాలన్నారు. ''జననాల రేటులో భేదాలు, బలవంతపు మత మార్పిడులు, ప్రలోభాలు, అత్యాశ కారణంగా మతాలు మారడం, దేశంలోకి అక్రమ చొరబాట్లు.. ఇలాంటివన్నీ ముఖ్యమైన అంశాలు. వీటిని కచ్చితంగా అరికట్టాలి'' అని మోహన్ భగవత్ సూచించారు. భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఆంగ్ల భాష ఒక్కటే ముఖ్యం కాదని తెలిపారు. మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మాతృభాషను ప్రభుత్వమే ప్రోత్సహించాలని మనం ఆశిస్తున్నామని, అదే సమయంలో మనం సంతకం మాతృభాషలోనే చేస్తున్నామా లేదా అనేది ఆలోచించుకోవాలని హితవు పలికారు. మన ఇళ్లపై నేమ్‌ప్లేట్లు మాతృభాషలోనే ఉంటున్నాయా? అని ఏదైనా ఆహ్వానం పంపేటప్పుడు మాతృభాషలోనే పంపిస్తున్నామా? అని ప్రశ్నించారు. జనాభా పెరుగుదలను నియంత్రించాలని ప్రయత్నించేటప్పుడు చైనాలో ఏం జరుగుతోందో చూడాలని చెప్పారు. 'ఒక కుటుంబం, ఒక బిడ్డ' విధానం వల్ల చైనా వృద్ధ దేశంగా మారుతోందన్నారు. భారతదేశ జనాభాలో 57 శాతం మంది యువతే ఉన్నారని, మరో 30 ఏళ్లపాటు మన దేశం యువదేశంగానే కొనసాగుతుందని మోహన్ భగవత్ ఉద్ఘాటించారు. 50 ఏళ్ల తర్వాత పరిస్థితి ఏమిటి? ఇప్పటి యువత వృద్ధులుగా మారుతారు, వారందరి ఆకలి తీర్చేటంత ఆహారం మనవద్ద ఉంటుందా? అని అన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంత వ్యాపారాలు ప్రారంభించాలని, స్వయం ఉపాధి పొందాలని పిలుపునిచ్చారు. అందరికీ ఉద్యోగాలిచ్చే శక్తి ప్రభుత్వాలకు ఉండదన్నారు.



దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి ఏడు అత్యంత ఖరీదైన వాచీలను ఢిల్లీ విమానాశ్రయం అధికారులు సీజ్ చేశారు. వీటిలోని బంగారంతో తయారుచేసిన వజ్రాలు పొదిగిన జాకబ్ అండ్ కో తయారీ వాచీ విలువ రూ.27 కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. వాచీల మొత్తం విలువ 60 కిలోల బంగారంతో సమానమని చెప్పారు. పట్టుబడిన వ్యక్తికి దుబాయ్‌లో ఖరీదైన వాచీల దుకాణం ఉందన్నారు. గుజరాత్‌కు చెందిన ఓ వినియోగదారుడికి వీటిని అందజేసేందుకు ఇతడు వచ్చినట్లు గుర్తించామన్నారు.

రక్తమోడిన శిశు సంరక్షణాలయం

- 24 మంది చిన్నారులు సహా 37 మందిని బలిగొన్న మాజీ పోలీసు
- థాయ్‌లాండ్‌లో దారుణం

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో మాజీ పోలీసు జరిపిన కాల్పులతో శిశు సంరక్షణాలయం రక్తసిక్తమైంది. ఈశాన్య థాయ్‌లాండ్‌లోని నోంగ్‌బూ లాంఫూ నగరంలోని డే కేర్ సెంటర్‌పై పన్యా కామ్రాప్(34) విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో అభంశుభం తెలియని 24 మంది చిన్నారులు సహా మొత్తంగా 37 మంది ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోజన విరామం సమయంలో అతను డే కేర్ సెంటర్‌కి వచ్చి మొదట ఐదుగురు సిబ్బందిని హతమార్చాడు. తర్వాత ఒక గదిలో నిద్రిస్తున్న చిన్నారులపైకి బుల్లెట్ల వర్షం కురిపించాడు. దాంతో పరుపులన్నీ రక్తంతో నిండి ఘటనాస్థలి భీతావహంగా మారింది. డే కేర్ సెంటర్‌లో ఎనిమిది నెలల గర్భిణిని సైతం అతడు చంపేశాడు. ఆ తర్వాత కారులో అక్కడి నుంచి పారిపోయాడు. వెళ్తూ వెళ్తూ రహదారి వెంట ఉన్న వారిపైనా తూటాల వర్షం కురిపించాడు. దీంతో ఒక చిన్నారిసహా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ఇంటికి చేరుకున్న అతను తన కొడుకును, భార్యను సైతం చంపేసి చివరకు తనను తాను కాల్చుకుని చనిపోయాడు. శిశు సంరక్షణాలయంలో చిన్నారుల తల్లిదండ్రుల రోదనలతో ఆ ప్రాంతం హృదయవిదారకంగా మారింది. దాడికి అతను పిస్టల్, షాట్‌గన్‌తోపాటు పదునైన కత్తిని వాడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు.


రక్తసిక్తమైన గది

ఈ ఏడాది తొలినాళ్లలో ఒక మాదకద్రవ్యాల కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న అతడిని పోలీసు విధుల నుంచి ప్రభుత్వం తప్పించింది. థాయ్‌లాండ్ చరిత్రలో పాఠశాలలో కాల్పుల ఘటనలో ఇంత మంది మరణించడం ఇదే తొలిసారి. వాస్తవానికి థాయ్‌లాండ్‌లో ఆయుధాలతో దాడి ఘటనలు అరుదు. ఆయుధాలతో దాడి ఘటనల్లో బ్రెజిల్‌లో ప్రతి లక్షలమందికి 23 మంది చనిపోతే థాయ్‌లాండ్‌లో నలుగురే మరణించారు.

ఉక్రెయిన్‌లో మళ్లీ రష్యా క్షిపణి దాడులు

కీవ్: దక్షిణ ఉక్రెయిన్‌లోని జపొరిజాజియా సిటీలో రష్యా క్షిపణులు గర్జించాయి. క్షిపణి దాడుల్లో 40కిపైగా భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారని, కనీసం 12 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు గురువారం వెల్లడించారు. ఒకటి సూర్యోదయానికి ముందు, మరొకటి ఉదయం క్షిపణి దాడి జరిగిందని పేర్కొన్నాయి. యూరప్‌లోనే అతి పెద్దదైన అణు విద్యుత్ ప్లాంట్ జపొరిజాజియాలో ఉంది. ఈ ప్లాంట్ సమీపంలోనే రష్యా సైన్యం క్షిపణి దాడులు నిర్వహించడం గమనార్హం. అణు విద్యుత్ ప్లాంట్‌ను రష్యా గతంలోనే ఆక్రమించుకుంది. రష్యా ఆక్రమించుకున్న తమ భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. దీనివల్ల రష్యా అధినేత పుతిన్ అణ్వస్త్ర ప్రయోగానికి పాల్పడతారా? అనేది చెప్పడం కష్టమని అన్నారు. అణు దాడికి పుతిన్ సాహసించకపోవచ్చని తాను భావిస్తున్నాని తెలిపారు. సిడ్నీలో లోవీ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఓ సదస్సులో జెలెన్‌స్కీ వీడియో లింక్‌లో ప్రసంగించారు.

అమెరికాలో సిక్కు కుటుంబం విషాదాంతం

- 8 నెలల చిన్నారి సహా నలుగురినీ చంపేసిన దుండగుడు
- నగలు, డబ్బు కోసమే ఘాతుకానికి పాల్పడ్డాడంటున్న పోలీసులు



లాస్‌ఏంజెలిస్: అమెరికాలోని కాలిఫోర్నియాలో పంజాబీ కుటుంబం కిడ్నాప్ ఘటన విషాదాంతమైంది. చిన్నారి సహా నలుగురిని అపహరించిన దండగుడు వారిని దారుణంగా హతమార్చాడు. డబ్బు కోసమే ఈ దారుణానికి పాల్పడ్డాడినట్లు పోలీసులు భావిస్తున్నారు. జస్దీప్ సింగ్ (36) అతడి భార్య జస్లీన్ కౌర్ (27), వారి కూతురు అరూహి ధేరి (8 నెలలు), జస్దీప్ సోదరుడు అమన్‌దీప్(39) సోమవారం తమ ట్రక్కింగ్ వ్యాపార సంస్థలో ఉండగా జెసుస్ సల్గాడో అనే దుండగుడు చేతులు కట్టేసి, తుపాకీతో బెదిరించి ట్రక్కులో తీసుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత డాస్ట్‌ర్యాం ట్రక్కు తగులబడిపోతోందంటూ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆ ట్రక్కు యజమాని చిరునామా తెలుసుకుని బాధితుల ఇంటికి వెళ్లారు. అక్కడుంటున్న కుటుంబసభ్యుల నుంచి ఫోన్ నంబర్లు తెలుసుకుని ఇద్దరు సోదరులతో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించగా స్విచ్చాఫ్ వచ్చాయి. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా వారంతా కిడ్నాప్ అయినట్లు గుర్తించి, దర్యాప్తు చేపట్టారు. నలుగురి మృతదేహాలు బుధవారం సాయంత్రం ఇండియానా-హచిన్‌సన్ రహదారిలోని ఓ తోటలో కనిపించాయి. 'నగలు, నగదు కోసమే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది'అని మెర్సెడ్ కౌంటీ షరీఫ్ వెర్న్ వార్న్‌కే చెప్పారు. సల్గాడో వారిని ఎలా చంపాడో ఆయన వెల్లడించలేదు. ఈ ఘాతుకం వెనుక కారణాలు, ఇందులో మరెవరైనా అడికి సహకరించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. కిడ్నాప్‌తో సల్గాడో హస్తం ఉందంటూ అతడి కుటుంబసభ్యులే సమాచారం అందించారన్నారు. మంగళవారం మధ్యాహ్నం పోలీసులు సల్గాడో(48)ను అదుపులోకి తీసుకున్నారు. అతడు ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి విషమంగా మారడంతో ఆస్పత్రికి తరలించారు.

ఎల్జీలాగా నన్ను నా భార్య కూడా సాధించదు

ఎల్జీ సక్సేనాపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాతో అనేక అంశాల్లో కొనసాగుతున్న విభేదాలపై సీఎం కేజ్రీవాల్ గురువారం వెరైటీగా స్పందించారు. ఎల్జీ అంత తీవ్రంగా తన భార్య కూడా సాధింపులకు పాల్పడదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 'గడిచిన ఆరు నెలల్లో ఎల్జీ నుంచి వచ్చినన్ని ప్రేమలేఖలు జీవితంలో ఇప్పటి వరకు నా భార్య నుంచి కూడా రాలేదు. కాస్త శాంతించండి ఎల్జీ సాబ్' అంటూ ట్వీట్ చేశారు. ఎల్జీని ఉద్దేశించి సీఎం కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు ఆయన మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని బీజేపీ నేతలు పేర్కొన్నారు. గత ఏడేళ్లుగా ఒక శాఖను కూడా పర్యవేక్షించని, ఒక్క ఫైల్‌పై కూడా సంతకం చేయని కేజ్రీవాల్ మానసిక స్థితికి ఈ వ్యాఖ్యలే నిదర్శనమని బీజేపీ నేతలు సాహిబ్ సింగ్ వర్మ, కపిల్ మిశ్రా, మనోజ్ తివారీ పేర్కొన్నారు. కుంభకోణాలు మానుకుని నడవడిక మార్చుకోవాలని మాత్రమే ఎల్జీ సాధిస్తున్నారని వారు చెప్పారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్లో పాల్గొనకపోవడం, మౌలిక వనరుల ప్రాజెక్టుల అనుమతుల్లో జాప్యంపై ఇటీవల ఎల్జీ సక్సేనా కేజ్రీవాల్‌కు లేఖలు రాశారు. ఇలాంటి అనేక అంశాలపై ఇరువురి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి.

విషమంగానే ములాయం ఆరోగ్యం

లక్నో/గురుగ్రామ్: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్(82) ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉందని గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రి వర్గాలు గురువారం తెలిపాయి. ఐసీయూలో చికిత్స కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఆరోగ్యం విషమించడంతో ములాయంను ఆదివారం మేదాంత ఐసీయూలో చేర్పించిన విషయం తెలిసిందే.

సాక్షి
విజయనగరం
శుక్రవారం । 7 । అక్టోబర్ । 2022

అశోక్‌కు ఉత్సవ ఆహ్వానం



విజయనగరం అర్బన్: కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోకగజపతిరాజుకు విజయనగరం ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆర్డీఓ సూర్యకళ అశోక్ బంగ్లాలో గురువారం అందజేశారు. ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.

విజయనగరానికి వైభవం



విజయనగరం నగరాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. - 8లో

నవంబర్ 12న జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం లీగల్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నవంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణచక్రవర్తి గురువారం తెలిపారు. రాజీ అయ్యేదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్, మోటార్ వాహనాల చట్టానికి సంబంధించిన కేసులు పరిష్కరిస్తామని చెప్పారు. కేసుల్లో ఇరువర్గాలకు రాజీమార్గాన్ని సూచిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

22,23 తేదీల్లో టెన్నిస్ లీగ్ టోర్నీ

విజయనగరం: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో శాప్ జోనల్ టెన్నిస్ లీగ్ టోర్నీ నిర్వహించనున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామానందం గురువారం తెలిపారు. నగర శివారులోని విజ్జి స్టేడియంలో అండర్-8, 10, 12, 14, 16, 18 బాల, బాలికల విభాగాలతో పాటు మెన్‌అండ్ ఉమెన్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. శాప్ యాప్‌లో నమోదైన క్రీడాకారులు మాత్రమే పోటీలకు అర్హులని, ఈ నెల 16వ తేదీలోగా పేర్లను సంబంధిత యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 98668 63619 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- తొలిరోజు 285 మందిహాజరు



ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో డీఎస్సీ-1998 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన గురువారం జరిగింది. మొత్తం 575 మంది అభ్యర్థుల్లో 1-300 ర్యాంకు లోపు అభ్యర్థుల (హాల్‌టికెట్ నంబర్ 100012-102529) ధ్రువపత్రాలను తొలిరోజు పరిశీలించగా 285 మంది హాజరైనట్టు డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 15 మంది గైర్హాజరయ్యారన్నారు. 301 నుంచి 575 వరకు గల అభ్యర్థులు (హాల్ టిక్కెట్ నంబర్ 102531-105581) శుక్రవారం హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకురావాలని కోరారు. డీఎస్సీ ఇంటర్వ్యూ లెటర్, పాస్‌ఫొటోలు-3, ఆన్‌లైన్ రిఫరెన్స్ నంబర్/జెరాక్స్ కాపీ, హాల్‌టిక్కెట్/ర్యాంకు కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్ (బీసీ, ఎస్సీ, ఎస్టీ), అకడమిక్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్స్ (ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇతరములు), టెక్నికల్ క్వాలిఫికేషన్స్ (డీఈడీ, బీఈడీ), స్టడీ సర్టిఫికెట్స్, రెసిడెన్స్ సర్టిఫికెట్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్స్, పీహెచ్‌సీ సర్టిఫికెట్స్‌తోపాటు గెజిటెడ్ అధికారితో సంతకం చేయించిన మూడు సెట్ల జిరాక్స్‌కాపీలు తీసుకురావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: ఓపెన్‌స్కూల్స్‌లో 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో ప్రవేశానికి విద్యార్థులు 2022 ఆగస్టు 31నాటికి 14 సంవత్సరాలు కలిగిన రికార్డుషీట్, టీసీతో పాటు ఆధార్‌కార్డు, తల్లి ఆధార్‌కార్డు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కులధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులు తమ దివ్యాంగత్వ ధ్రువపత్రాలు జతపరచాలన్నారు. ఎటువంటి విద్యార్హత లేకున్నా తహసీల్దార్ ధ్రువీకరించిన జనన ధ్రువీకరణ పత్రాలతో నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 15వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

డిసెంబర్ నాటికి ఐదువేల ఇళ్ల నిర్మాణం

- టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

విజయనగరం గంటస్తంభం: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో డిసెంబర్ 21 నాటికి ఐదువేల టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అధికారులకు సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ఆయన గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో రాష్ట్రంలో లక్షా 50వేలు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించారన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, సాలూరు మున్సిపాలిటీలో ఐదువేల గృహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. సోనియానగర్‌లో నిర్మిస్తున్న 1120, సారిపల్లిలో నిర్మాణంలో ఉన్న 2,880 టిడ్కో ఇళ్ల నిర్మాణాలను నిర్దిష్ట కాలవ్యవధిలో లబ్ధిదారులకు అందించేందుకు సమష్టిగా కృషిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో టిడ్కో ఎస్‌ఈ నరసింహమూర్తి, ఈఈ జ్యోతి, డీఈ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో అలజడి





బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో తీరంలో 'అల'జడి నెలకొంది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో తీరానికి ఆనుకుని ఉన్న తిప్పలవలస, చింతపల్లి, ముక్కాం, చేపలు కంచేరు గ్రామాల మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సంద్రం ఒడ్డున ఉన్న పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరో 48 గంటల పాటు సంద్రంలోకి వేటకు వెళ్లరాదంటూ మత్స్యశాఖ డీడీ నిర్మలా కుమారి హెచ్చరికలు జారీచేశారు. పీహెచ్‌సీల్లో నిరంతరం వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. చింతపల్లి, పతివాడ పంచాయతీల్లో తహసీల్దార్ ఇ.భాస్కరరావు దండోరా వేయించారు. - పూసపాటిరేగ


పోటెత్తిన వరద

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు(తాటిపూడి) జలాశయానికి వరదనీరు పోటెత్తింది. తాటిపూడి నీటి మట్టం 297 అడుగులకాగా, గురువారం మధ్యాహ్నానికి 296.12 అడుగులకు చేరింది. ప్రాజెక్టు అధికారులు 600 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేశారు. - గంట్యాడ

నిండిన చెరువులు

భారీ వర్షాలకు విజయనగరం జిల్లాలోని చెరువులన్నీ నిండిపోయాయి. సంతకవిటి మండలంలోని సిరిపురం తామరచెరువు పూర్తిస్థాయిలో నిండి పొర్లుపొరుతోంది. కొండకామేశ్వర ఆలయం వద్ద పాతకాలంనాటి రాతి చప్టా మీదుగా జాలువారుతున్న నీరు చూసేవారికి కనువిందు కలిగిస్తోంది. - రాజాం

మడ్డువలస గేట్లు ఎత్తివేత





వంగర మండల పరిధిలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. విస్తారంగా వర్షాలు కురవడంతో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 16వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. మూడు గేట్లు ఎత్తి ప్రాజెక్టులో చేరుతున్న నీటిని విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు. - వంగర

మారాలి మనసు.. కలగాలి సద్బుద్ధి





పైడితల్లి ఆలయం వద్ద పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు

- తల్లీ.. సద్బుద్ధిని ప్రసాదించు...
- టీడీపీ నాయకుల తీరును మార్చాలని అమ్మవార్లకు పూజలు
- వికేంద్రీకరణకు మద్దతు పలికేలా బుద్ధి ప్రసాదించాలని ప్రార్థనలు
- దసరా ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిలిచిన 'సద్బుద్ధి' పూజలు
- వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఎన్నేళ్లగానో అభివృద్ధికి నోచుకోని ఉత్తరాంధ్రకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా రాజధాని రూపంలో వరం ప్రసాదించారని, దాన్ని భగ్నం చేసేలా టీడీపీ సహా ప్రతిపక్ష నాయకుల ప్రవర్తన ఉందని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి కోసం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలే తప్ప.. కాలదన్నుకోవడం సరికాదని నాయకులకు హితవు పలికారు. మూడు ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి తలపెట్టిన వికేంద్రీకరణకు మద్దతు పలికేలా టీడీపీ నాయకులకు సద్బుద్ధి ప్రసాదించాలని విజయదశమి రోజున బుధవారం అమ్మవారిని వేడుకున్నారు. తమ ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా వారి మనస్సు మారాలని కోరుతూ వాడవాడలా పూజలు నిర్వహించారు.

విజయనగరం నియోజకవర్గంలో...

విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధితోనే సమాజంలో అసమానతలు, వైషమ్యాలు తొలగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ప్రతిపక్ష టీడీపీ నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని అమ్మవారిని కోరుతూ టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉండాల్సిన హైదరాబాద్‌పై హక్కును స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో రాజధాని నిర్మిస్తానంటూ ప్రజలు చేసిన అన్యాయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. ఇలాంటి పరిస్థితులు భవిష్యత్‌లో తలెత్తకుండా మూడు రాజధానులను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని, ఇందుకు అన్ని వర్గాల ప్రజల మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం మేయరు వెంపడాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి నియోజకవర్గంలో....



చీపురుపల్లి మండలం జి.అగ్రహారంలో భవానీ భక్తులతో కలిసి దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

మూడు రాజధానులకు మద్దతుగా చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో పూజలు జరిపారు. గరివిడి మండల కేంద్రంలోని దుర్గాదేవీ మండపం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు టెంకాయలు కొట్టారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి పట్టణంలోని రుంకానవీధి, గరివిడిలో గల దుర్గాదేవీ అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు చేశారు. మూడు రాజధానుల ఏర్పాటులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని ఉత్తరాంధ్ర ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణతో అభివృద్ధి సాధ్యం



బొబ్బిలి దాడితల్లి ఆలయంలో 101 టెంకాయలతో పూజలుచేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

అధికార వికేంద్రీకరణతోనే రాష్ట్రం సమూల అభివృద్ధి అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి ఆలయం సమీపంలో దుర్గాదేవి మండపం వద్ద పూజలు చేశారు. వికేంద్రీకరణకు వ్యతిరేక ప్రకటనలు చేస్తున్న టీడీపీ సహా దుష్ట చతుష్టయం మనసు మారేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. 101 టెంకాయలు కొట్టారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు, పార్టీ నాయకులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాల నాయుడు, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, డాక్టర్ బొత్స కాశి నాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట దేవి ఆలయంలో..

మూడు రాజధానులకు అడ్డం పడుతున్న ప్రతిపక్ష నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ బుధవారం ఉదయం శృంగవరపుకోటలో దేవి ఆలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



కొత్తవలస రూరల్: తుమ్మికాపల్లి దుర్గాదేవి ఆలయంలో పూజలుచేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు

రామతీర్థంలో పూజలు...



నెల్లిమర్ల రామతీర్థం ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రాజధాని వికేంద్రీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న చంద్రబాబు సహా టీడీపీ నేతల మనసులు మార్చాలని కోరుతూ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు తదితరులు నెల్లిమర్ల అభయాంజనేయస్వామి ఆలయం, రామతీర్థం రామస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. విశాఖలో రాజధాని ఏర్పాటును అడ్డుకుంటూ ఉత్తరాంధ్ర అభివృద్ధిని విస్మరిస్తున్న నాయకుల తీరును ఎమ్మెల్యే తప్పుబట్టారు. కేవలం తన అనుకూల వర్గానికి లబ్ధి చేకూర్చడానికే అమరావతిలో చంద్రబాబు రాజధానిని ఏర్పాటు చేశారన్నారు. అమరావతి రైతుల పేరుతో చేస్తున్న పాదయాత్రను ఉత్తరాంధ్రలో అడుగు పెట్టనివ్వకుండా ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం నియోజకవర్గంలో....



బొండపల్లి: గొట్లాంలోని బంగారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య గొట్లాంలోని బంగారమ్మ ఆలయంలో, గజపతినగరంలోని రామాలయంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పూజలు చేశారు. వైజాగ్ పరిపాలన రాజధాని అయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనిని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నవదుర్గామాత ఆలయంలో...



రాజాం: నవదుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాం బస్టాండ్ ఆవరణలోని నవదుర్గామాత ఆలయంలో పూజలు నిర్వహించారు. మూడు రాజధానులను వ్యతిరేకిస్తున్న ఉత్తరాంధ్ర టీడీపీ నేతల బుద్ధిమార్చాలని అమ్మవారిని ప్రార్థించారు. ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి పటిష్ట బందోబస్తు

- మూడువేల మంది పోలీసుల మోహరింపు
- డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ
- అధికారులతో సమన్వయానికి 200 వైర్‌లెస్ సెట్స్ వినియోగం
- నేరాల నియంత్రణకు 200 మందితో ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక రూట్‌లు
- ఉత్సవానికి ఎన్‌సీసీ, పోలీస్ సేవాదళ్ సేవలు
- ఎస్పీ ఎం.దీపిక



పైడితల్లి అమ్మవారి ఉత్సవ బందోబస్తు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు మూడువేల మంది పోలీస్ బలగాలతో పటిష్టబందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. ఈ నెల 10న జరిగే తొలేళ్ల ఉత్సవం, 11న జరిగే సిరిమానోత్సవానికి గట్టి బందోబస్తు ఏర్పాటుచేస్తామని చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ టి.త్రినాథ్, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావుతో కలిసి గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సిరిమానోత్సవం రోజున బందోబస్తును 22 సెక్టార్లుగా విభజించి, సుమారు మూడువేల మంది పోలీసులు రెండు షిఫ్టులుగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్పీ, అదనపు ఎస్పీ, 12 మంది డీఎస్పీలు, 63 మంది సీఐ/ఆర్‌ఐలు, 166 మంది ఎస్‌ఐ/ఆర్‌ఎస్‌ఐలు, 11 మంది మహిళా ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బందితో సహా సుమారు మూడువేలమంది పోలీస్ అధికారులను, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తారన్నారు. మహిళా పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలను వినియోగిస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ జి.రాంబాబు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

అమ్మవారి చదురుగుడి ఎదురుగా తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేస్తామని ఎస్పీ దీపిక తెలిపారు. సిరిమాను తిరిగే ప్రాంతాలను, సిరిమాను తీసుకుని వచ్చే మార్గంలోనూ, ఇతర ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. బందోబస్తు నిర్వహించే పోలీస్ సిబ్బందికి బాడీ వార్న్ కెమెరాలను ధరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. భద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు డ్రోన్ కెమెరాలను ఏర్పాటుచేశామన్నారు. వాటన్నంటినీ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు.

30 ప్రాంతాల్లో రూఫ్ టాప్‌ల ఏర్పాటు

సిరిమాను తిరిగే ప్రాంతంలో ముందుగా గుర్తించిన 30 ప్రాంతాల్లో రూఫ్ టాప్‌లలో పోలీసులను నియమించి, నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. రూఫ్ టాప్‌లలో విధులు నిర్వహించే సిబ్బంది బైనాక్యూలర్స్‌తో సిరిమాను తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తూ, అవసరమైన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేసి పోలీసులను అప్రమత్తం చేస్తారన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక క్రైమ్ బృందాలు

నేరాలను నియంత్రించేందుకు, నేరస్తులను గుర్తించడంలో అనుభవజ్ఞులైన 200 మంది క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామన్నారు. ఈ బృందాలు ఆలయం రద్దీ ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ జేబు దొంగతనాలు, గొలుసు దొంగతనాలు జరగకుండా చర్యలు చేపడతారన్నారు.

బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు

అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేందుకు పోలీసు జాగిలాలతో పాటూ ప్రత్యేక బాంబ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దింపుతున్నట్టు ఎస్పీ స్పష్టం చేశారు. ఈ బృందాలు ఆలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, ఇతర రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపడతారన్నారు. అదేవిధంగా అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించేందుకు ఏడు ప్రత్యేక పోలీస్ బృందాలు కమాండ్ కంట్రోల్ వద్ద సిద్ధంగా ఉంటాయన్నారు.

వాహనాల పార్కింగ్ ప్రాంతాలు

ట్రాఫిక్ నియంత్రణకు వాహనాల పార్కింగ్‌కి సంబంధించి అయోధ్యా మైదానం, రాజీవ్‌స్టేడియం, రామానాయుడు రోడ్డు, పెద్దచెరువు గట్టు, అయ్యకోనేరు గట్టు, పోర్ట్ సిటీ స్కూల్ రోడ్డు, ఎస్‌వీఎన్ నగర్ రోడ్డు, ఐస్ ఫ్యాక్టరీ కూడలి నుంచి బాలాజీ కూడలి వరకూ గల రింగురోడ్డు ప్రాంతాల్లో ప్రజలు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు స్థలాలు ఏర్పాటుచేశామన్నారు. వీఐపీల వాహనాల పార్కింగ్‌కు బొంకులదిబ్బ, టీటీడీ కల్యాణమండపం, గురజాడ కళాక్షేత్రం, కోట ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేసినట్టు వివరించారు. ప్రజలకు సూచనలు చేసేందుకు, సమాచారాన్ని చేర్చేందుకు వాహనాలకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేశామన్నారు. సిరిమానోత్సవం రోజున ఫోర్ వీలర్స్ వాహనాలు ఎంఆర్ కళాశాల, కేపీ టెంపుల్, గంటస్తంభం, ట్యాక్సీ స్టాండ్, శివాలయం వీధి, ఘోషా ఆస్పత్రి, గుమ్చీ రోడ్డు, సింహాచలం మేడ, సత్యా లాడ్జి ప్రాంతాల్లో ప్రవేశించేందుకు అనుమతి ఉండదన్నారు.

సిరిమానోత్సవం రోజున డైవర్షన్స్ ఇలా..

- పట్టణంలోని వాహనాలు సీఎంఆర్ జంక్షన్, గూడ్స్‌షెడ్‌ల మీదుగా పట్టణం బయటకు వెళ్లవచ్చు.
- బాలాజీ జంక్షన్, రామానాయుడు రోడ్డు, సీఎంఆర్ జంక్షన్, గూడ్స్‌షెడ్ మీదుగా పట్టణం బయటకు వెళ్లవచ్చు.
- ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, బాలాజీ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎత్తుబ్రిడ్జి మీదుగా పట్టణం బయటకు వెళ్లవచ్చు.
- కొత్తపేట జంక్షన్, దాసన్నపేట, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, ధర్మపురి రోడ్డు మీదుగా పట్టణం నుంచి వెళ్లేందుకు వాహనాలకు అనుమతిస్తారు.
- జేఎన్‌టీయూ, కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ, ఎత్తుబ్రిడ్జి, ప్రదీప్‌నగర్ మీదుగా పట్టణ బయటకు వాహనాలకు అనుమతిస్తారు.
- ప్రదీప్‌నగర్ కూడలి, ధర్మపురి రోడ్డు, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, దాసన్నపేట మీదుగా బయటకు అనుమతిస్తారు.

సిరిమాను తిరిగే ప్రాంతంలో...

సిరిమాను తిరిగే ప్రాంతంలో ఎటువంటి తోపులాటలు, అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలందరూ సిరిమాను తిలకించేలా అనుసంధాన రోడ్లలో బాక్స్ సిస్టమ్స్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. అధికారులు 200 వైర్‌లెస్ సెట్స్‌ను పోలీసుల వద్ద ఉంచి, ప్రజలకు సూచనలు చేస్తారు. పోలీసు సేవాదళ్ భక్తులకు సేవలందిస్తారు. బందోబస్తుకు వచ్చే మహిళా సిబ్బందికి దిశ మహిళా టాయిలెట్స్ ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ప్రజలందరూ సహకరించాలి

పైడితల్లి అమ్మవారి పండగ శాంతియుతంగా భక్తి వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ పోలీసుశాఖకు సహకరించాలని, పోలీసుల సహాయాన్ని పొందాల్సిన వారు దేవాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన తాత్కాలిక కంట్రోల్‌రూమ్‌ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. పోలీసులందరూ భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారికి ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా చూడాలని, దురుసుగా ప్రవర్తించరాదన్నారు. వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలందించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

మాజీ సైనికులకు ఉద్యోగావకాశాలు

- సైనిక సంక్షేమ అధికారి కృష్ణారావు



పార్వతీపురం టౌన్: దేశానికి సేవచేసి పిన్న వయసులో ఉద్యోగ విరమణ పొందిన సైనికులకు పునరావాసం, ఉద్యోగం వంటి సమస్యలు ఉన్నాయని పార్వతీపురం, విజయనగరం జిల్లాల సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని మాజీ సైనికుల కోసం నిర్వహించిన ఉపాధికల్పన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైనికులు సర్వీస్ నుంచి వెలుపలకు వచ్చిన తరువాత ఉద్యోగావకాశాల కోసం ప్రభుత్వ రంగంలో కేటాయించిన ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి కల్పన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రంగాల్లో ఎన్నో అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగాల నుంచి వస్తున్న ఉద్యోగాలు అమ్ముడుపోతున్నాయని వస్తున్న అపోహలు సరికాదని, అటువంటి వదంతులను నమ్మవద్దని హితవు పలికారు. ఎవరికి వారే వ్యక్తిగతంగా కష్టపడే వారికి ఉద్యోగాలు రావచ్చునన్నారు. పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకుని బ్యాంక్ అధికారులు, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీ సెంటర్స్ అధికారులు, ప్రైవేట్ సంస్థల అధికారులతోను సంప్రదింపులు చేసి అన్ని ప్రదేశాల సమావేశాలకు వారిని తీసుకువెళ్లి మాజీ సైనికులకు ఉపాధికల్పన చేకూరేలా ముమ్మర ప్రయత్నాలు చేశామన్నారు. నిరుద్యోగ మాజీ సైనికులు స్వయం ఉపాధి పట్ల మొగ్గు చూపే విధంగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న స్వయం ఉపాధి ద్వారా అనేక రకాలైన వ్యాపారాలు పెట్టుకోవడానికి గాను రుణ సదుపాయంతో పాటు 35% సబ్సిడీలు కల్పిస్తున్నారని వివరించారు. కావున మాజీ సైనికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఆర్థికంగా అభివద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఉప్పొంగుతున్న నదులు



కవిరిపల్లి గ్రామ సమీపంలో కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న గోముఖి నది

మక్కువ: వీఆర్‌ఎస్ ప్రాజెక్టు ద్వారా ఇరిగేషన్ అధికారులు బుధవారం నీరు విడుదల చేయడంతో గోముఖి, సువర్ణముఖి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోముఖి రెగ్యులేటర్ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటిని, సువర్ణముఖి రెగ్యులేటర్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీటిని అధికారులు నదుల్లోకి విడిచిపెట్టారు. దీంతో గోముఖి, సువర్ణముఖి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఒడిశా రాష్ట్రంతోపాటు, మండలంలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ముందుజాగ్రత్తగా నదుల్లోకి నీటిని విడిచిపెట్టినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కవిరిపల్లి గ్రామ సమీపంలోని కాజ్‌వేపై నుంచి గోముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు రాకపోకలకు అంతరాయం కలిగింది.అలాగే మార్కొండపుట్టి గ్రామ సమీపంలోని కాదంబరిగడ్డ కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహించడంతో సుమారు పది గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి.

విజయనగరానికి వైభవం

- దశల వారీగా తీసుకు వస్తాం
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- నగరంలో సుందరీకరణ పనుల ప్రారంభం
- సిరిమాను సంబరానికి అందరికీ అనుమతి



రైల్వేస్టేషన్ రోడ్డులో సెంటర్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్ససత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు



విద్యుత్‌కాంతులతో ఆధునీకరించిన గంటస్తంభాన్ని, ప్రారంభిస్తున్న మంత్రి బొత్ససత్యనారాయణ, (ఇన్‌సెట్లో) సుందరీకరణకు నోచుకున్న గంటస్తంభం



విజయనగరం: విజయనగరం నగరాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రాష్ట్ర తెలిపారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ.18లక్షల వ్యయంతో చేసిన గంటస్తంభం సుందరీకరణ, ఐలాండ్, వాటర్ ఫౌంటెన్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అలాగే మయూరి జంక్షన్ నుంచి వైఎస్‌ఆర్ జంక్షన్ వరకు, రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్ రోడ్డు, సెంటర్ లైటింగ్, వాటర్ ఫౌంటెన్లను ప్రారంభించారు. అనంతరం విజయనగరం ఉత్సవాల ప్రోమోను లాంఛనంగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ చెప్పారు. చారిత్రక నగరమైన విజయనగరానికి, గంటస్తంభం తలమానికమని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రధాన రహదారులకు మాత్రమే పరిమితం కాదని, వీధులను కూడా అభివృద్ధి చేస్తామని, విజయనగరానికి దశల వారీగా వైభవం తీసుకు రావడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. విజయనగరం ఉత్సవాలను, పైడిమాంబ సిరిమానోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గత రెండేళ్లు కోవిడ్ కారణంగా, సామాన్య భక్తులు సిరిమానోత్సవానికి దూరమయ్యారని, ఈ ఏడాది అందరినీ అనుమతించనున్నట్లు తెలిపారు. అమ్మవారి జాతరకు చుట్టుపక్కల జిల్లాలనుంచే కాకుండా, ఇతర రాష్ట్రాలనుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి చెప్పారు.

ఉత్సవాల ప్రోమో విడుదల

కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన, విజయనగరం ఉత్సవాల ప్రోమోను, బుధవారం సాయంత్రం మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విడుదల చేశారు. స్థానిక మయూరి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ఈ ప్రోమోను మంత్రితో పాటు అతిథులంతా తిలకించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు ఇసరపు రేవతీదేవి, కోలగట్ల శ్రావణి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్, ఇతర అధికారులు, కార్పొరేటర్లు,నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి 8 కేజీల వెండి చీర

- బహూకరించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబసభ్యులు



వెండి చీర అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారికి వెండిచీరను అలంకరించిన ఎంపీ సతీమణి శ్రీదేవి, కుమారుడు, కోడలు వంశీకృష్ణ, పావని, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులు, ఆయన కుమారుడు వంశీకృష్ణ, పావని దంపతులు వెండి చీరను బహూకరించారు. విజయదశమి పర్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వచ్చిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సతీమణి శ్రీదేవి, తల్లి అప్పలనర్సమ్మలతో బాటు కుటుంబ సభ్యులు స్వయంగా అమ్మవారికి అలంకరణ చేసి దేవస్థానానికి అప్పగించారు. రూ.6 లక్షలు సొంత నిధులు వెచ్చించి దాదాపు 8 కేజీల వెండితో అమ్మవారికి వెండి చీరను తయారు చేయించారు. అమ్మవారికి వెండి చీరను అలంకరించిన అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం ఎంపీ భార్య శ్రీదేవి, కుమారుడు వంశీకృష్ణలు మాట్లాడుతూ కనకమహాలక్ష్మి అమ్మవారు మహిమ కలిగినదని భక్తులు కొలుచుకుంటున్నట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు అమ్మవారి ప్రాబల్యం అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవింద్), వైస్‌చైర్మన్ సూరు కుమార్, డీఆర్‌యూసీసీ మెంబర్ తాడేల ఉమ, జిల్లా టెలికాం మెంబర్ ఇప్పిలి తిరుమల, దేవస్థానం ఈఓ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ పోస్టర్ ఆవిష్కరణ



కౌశల్ పోటీ-2022 పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్ తదితరులు

పార్వతీపురం: కౌశల్ పోటీ-2022 పోస్టర్‌ను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు భారతీయ విజ్ఞాన మండలి(బీవీఎం), ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి(ఏపీసీఓఎస్‌టీ) సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్ ప్రతిభాన్వేషణ పరీక్షలు నిర్వహిస్తాయని చెప్పారు. డీఈఓ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ కౌశల్ 2022 పోటీలకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8,9,10 తరగతి విద్యార్థులు ఈనెల 15 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ క్విజ్, ప్రాజెక్టు ప్రెజెంటేషన్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో నవంబర్ 2,3 తేదీలలో, జిల్లా స్థాయిలో నవంబర్ 26న, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 9న ఆన్‌లైన్‌లో పోటీలను నిర్వహిస్తారని చెప్పారు. ఈపోటీలలో విజేతలకు సర్టిఫికెట్, జ్ఞాపిక, నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జె.వెంకటరావు, జిల్లా కోఆర్డినేటర్ పి.రామకృష్ణ, ఆర్.సతీష్‌రాజు తదితరులున్నారు.

10న ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు

- పాల్గొననున్న 15 జట్లు
- విజేతలకు నగదు బహుమతులు
- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్



కబడ్డీ పోటీల వివరాలు వెల్లడిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఈనెల 10న ఒక్క రోజు ఉత్తరాంధ్ర స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి నుంచి బయటపడిన తర్వాత ఈ సం వత్సరం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా అధికారుల నేతృత్వంలో విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఈనెల 10వ తేదీన సోమవారం ఉదయం 8.30 గంటలకు రాజీవ్ స్టేడియంలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. మొత్తం 15 టీమ్‌లు పాల్గొనే ఈ పోటీలు ఉదయం ప్రారంభమై రాత్రి వరకు కొనసాగుతాయని చెప్పారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నామని తెలిపారు. పురుషులలో ప్రథమ విజేతకు రూ.20వేలు, ద్వితీయ విజేతకు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విజేతకు రూ.10వేలు చొప్పున అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే స్త్రీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్న జట్లకు రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. విజయనగరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో అందరూ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి రమణ, రిఫరీ బోర్డు చైర్మన్ ఎస్.సూర్యారావు, జాయింట్ సెక్రటరీలు సీహెచ్‌వీఆర్ ఎస్ రాజు, రామకృష్ణ యాదవ్, దన్నాన తిరుపతిరావు, కేపీ బాలకృష్ణ, కె.తౌడుబాబు తదితరులు పాల్గొన్నారు.

లంపి వ్యాధితో రెండు ఆవుల మృతి



లంపి వ్యాధి సోకి మరణించిన ఆవు

భోగాపురం రూరల్: మండలంలోని కవులవాడ సచివాలయం పరిధి మరడపాలెంలో లంపి వ్యాధి సోకి రెండు ఆవులు చనిపోయినట్లు మండల పశువైద్యాధికారి వై. కమలకుమారి తెలిపారు. గ్రామంలో లంపి వ్యాధి సోకిన రెండు ఆవులు చనిపోయినట్లు సమాచారం రావడంతో వెంటనే ఆమె సిబ్బందితో సహా గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పశుపోషకులు ఆవుల శరీరంపై ఏర్పడిన బొడిపెలు గుర్తించి వాటిని మిగిలిన పశువులకు దూరంగా ఉంచితే ప్రమాదం జరగదని సూచించారు. లోపింటి తోటయ్య, ముడసర్ల అప్పన్నకు చెందిన రెండు ఆవులు మృతిచెందాయని, అలాగే గ్రామంలో రెండు మేకలు న్యూమోనియాతో మరణించాయన్నారు. ప్రస్తుతం లంపి వ్యాధి సోకకుండా 10 ఆవులకు వ్యాక్సిన్ వేశామని శుక్ర, శని వారాల్లో గ్రామంలో పశువులకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి



మృతి చెందిన పోలమ్మ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం బాలగుడప గ్రామానికి చెందిన బొండపల్లి పోలమ్మ (36) చెరువులో పడి గురువారం మృతి చెందింది. ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొద్ది రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్న ఆమె రెండు రోజులుగా కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు గ్రామంలో అన్నిచోట్ల గాలించారు. గురువారం వెంకటరాయుడిపేట దారిలో స్థానికులు మహిళ మృతదేహాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి ఆమెను పోలమ్మగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,200-00
బంగారం(22సి. 10గ్రా.)	46,000-00
వెండి (కిలో)	60,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

ఆర్టీసీబస్సు, ఆటో ఢీ : ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయరాజు, గాయపడిన బాల, సరోజని

పార్వతీపురం టౌన్: ప్రయాణికుల ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో బుధవారం ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలానికి చెందిన సీహెచ్ జయరాజు టిఫిన్ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం అతని భార్య బాల, అత్త, సరోజినిలతో కలిసి కురుపాం నుంచి పార్వతీపురం ఆటోలో వస్తుండగా తోటపల్లి ఎడమకాలువ బ్రిడ్జివద్ద ఎదురుగావస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో జయరాజు, బాలలకు తీవ్రగాయాలయ్యాయి. సరోజినికి స్వల్పగాయాల య్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

లారీని బైక్ ఢీ కొని ఇద్దరికి..

ఆగి ఉన్న లారీని బైక్ ఢీ కొని ఇద్దరు గాయాలపాలయ్యారు. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం గల్లికోట గ్రామానికి చెందిన గణపతి, శివ గండికోట నుంచి వికలాంపురం వెళ్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వారిని తరలించారు. ఈ ఘటనపై అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని వ్యక్తికి..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వేగేట్ సమీపంలో రైలు ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన బల్లిరెడ్డి మహేష్ తీవ్ర గాయాల పాలై రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. మహేష్ బుధవారం పొలానికి వెళ్లి మధ్యాహ్న భోజనానికి తిరిగి వస్తుండగా విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వస్తున్న రైలును గమనించకుండా పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొట్టడంతో రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు వెంటనే విజయనగరం మహారాజా ఆస్పత్రికి అక్కడి నుంచి వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పిందని కుటుంబసభ్యులు గురువారం తెలిపారు.

వచ్చే దసరాకు విశాఖలోనే పరిపాలనా రాజధాని

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ఏది ఏమైనప్పటికీ వచ్చే ఏడాది విజయదశమి నాటికి విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటై ఇక్కడి నుంచే కార్యకలాపాలు జరుగుతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు స్పష్టం చేశారు. ఎన్నో తరాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న అభివృద్ధి ఫలాలు అందుతాయన్న సమయానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడి నుంచి జిల్లాల వరకు ఆ పార్టీ నేతలు అడ్డుకునేందుకు చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సొంత ప్రయోజనం కోసం ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధిని పణంగా పెట్టాలని ఉత్తరాంధ్ర జిల్లాల్లోని టీడీపీ నాయకులు చూస్తున్నారని, వారికి దుర్గమ్మ మంచి బుద్ధి ప్రసాదించాలని, ఉత్తరాంధ్ర ప్రజల కోసం వారి ఆలోచనల్లో మార్పు రావాలని జిల్లా వ్యాప్తంగా అమ్మవారి విగ్రహాలు వద్ద కొబ్బరికాయలు కొట్టి వేడుకున్నట్లు స్పష్టం చేశారు. వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి గొప్ప సంకల్పంతో ఉన్నారని చెప్పారు. అందులో భాగంగానే ఎంతో సమృద్ధిగా వనరులు ఉన్న విశాఖపట్టణంలో పరిపాలన రాజధాని ఏర్పాటుకు నిర్ణయించారన్నారు. దీంతో ఇంతవరకు ఎంతో వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు ఎంతో అభివృద్ధికి నోచుకోగలరన్న ఆశ ప్రారంభమైందన్నారు. కానీ చంద్రబాబునాయుడు వికేంద్రీకరణపై విషం చిమ్ముతూ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు భంగం కలిగిస్తూ రైతులు ముసుగులో దోపిడీదారుల యాత్ర చేపడుతున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌ను కాపాడుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ఉద్యోగులు అంతా కలిసి రావాలని కోరారు. స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ. సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు, దాలయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సలకు 40 మంది ఎంపిక

భోగాపురం: మండల కేంద్రంలో వైఎస్సార్ కంటివెలుగు పథకం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సిబ్బంది గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది రోగులను పరీక్షించి 40 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె. బంగారురాజు, సేవా సమితి సభ్యులు జె.మాధవరావు, కేవీ కృష్ణారావు, అట్టాడ సూర్యనారాయణ, ఆళ్ల మాధవరావు, డి.సన్యాసిరావు, వైద్యులు దివ్య, ఎం.సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మెప్మా పీడీ సుధాకర్

విజయనగరం: పేదల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) పీడీ సుధాకర్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని కంటోన్మెంట్‌లో ఉన్న తిలక్ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీడీ సుధాకర్ మాట్లాడుతూ బియ్యం, పప్పులు, వంటనూనెలు వంటి నిత్యావసరాలను కూడా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో తిలక్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాలుగెస్సుల రాజు, కార్యదర్శి కందాళ సాయిబాబా గురుస్వామి, కోశాధికారి కేవీ రామకృష్ణ, ప్రతినిధులు వాసు, ఎర్నాయుడు, రెడ్డి, పైడి చిట్టి, ఆదిత్య, వాసు, రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం రామస్వామివారి పుష్కరిణిలో వేంకటేశ్వరస్వామి చక్రస్నానం బుధవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో తీరువీధి చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతమైన జీవితం

విజయనగరం టౌన్: ఆధ్యాత్మికతతోనే ప్రశాంతమైన జీవితం సాధ్యపడుతుందని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కమ్మ వీధిలో ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో నవదుర్గల ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజయోగ అభ్యసనం ద్వారా ఒత్తిడి, మానసిక, శారీరక దుఃఖాలు దూరమవుతాయన్నారు. బ్రహ్మకుమారీస్ చేపడుతున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రేవతీ దేవీ, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు



జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ఆలయ ఈఓ కిశోర్ కుమార్

విజయనగరం టౌన్: విజయదశమిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడి ఆవరణలో జమ్మిచెట్టుకు ఆలయ ఈఓ కిశోర్‌కుమార్, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతగోష్టి ఆధ్యాత్మిక సంఘ వ్యవస్థాపకురాలు అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో మహిళా కోలాటం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు మెంబర్లు బలివాడ లలిత, కాశీ, పుష్ప, గంధం లావణ్య, విశాలాక్షి, అచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ఆయుధ పూజ..



నెల్లిమర్ల రూరల్: రామాలయంలో ఆయుధ పూజ జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో విజయదశమి వేడుకలను పురస్కరించుకొని స్వామివారి ఆయుధాలకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వర్షం కారణంగా ఆలయంలోనే జమ్మి వృక్షాన్ని ఏర్పాటు చేసి విశేష అర్చనలు చేశారు. స్వామివారి ధనస్సు, దనుర్బాణం, ఖడ్గం తదితర ఆయుధాలను జమ్మి వృక్షంపై ఉంచి ప్రత్యేక పూజలను జరిపారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

వికేంద్రీకరణతోనే సర్వతోముఖాభివృద్ధి

- విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయాలి
- అమరావతి రైతులది పాదయాత్ర కాదు.. పెత్తందారుల యాత్ర
- ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పైడితల్లికి ప్రత్యేక పూజలు



విజయనగరం: పైడితల్లి ఆలయం బయట కొబ్బరికాయ కొడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం: పరిపాలనా వికేంద్రీకరణతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు కావాలని ఆకాంక్షిస్తూ నగరంలోని మూడు లాంతర్లు జంక్షన్ వద్దనున్న పైడితల్లి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఆలోచనలు సన్మార్గంలో ఉంచాలని... ఉత్తరాంధ్ర టీడీపీ నేతల బుద్ధి మారాలని... విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా చేయాలని కోరారు. ముందుగా కోలగట్ల వీరభద్రస్వామి, మజ్జి శ్రీనివాసరావులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ప్రతిపక్ష నేత చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ప్రకటించిన హైదరాబాద్ లాంటి మహానగరాన్ని విడిచిపెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేవలం ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారానే ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయని, మరలా అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ఏర్పాటును ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా విశాఖ పరిపాలనా రాజధానిగా రూపాంతరం చెందాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విశాఖపట్నం రాజధానిగా ఉండాలని తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గతంలో ఉమ్మడి రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని, కాని పాలనంతా ఒకేచోట ఉండడంతో రెండు రాష్ట్రాలుగా విడిపోయిన నేపథ్యంలో మనం ఎంతో నష్టపోవాల్సి వచ్చిందన్నారు. అన్ని జిల్లాలు సమగ్ర అభివృద్ధి సాధించాలంటే పాలన వికేంద్రీకరణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమరావతి రైతులమనే ముసుగుతో చేస్తున్న పాదయాత్ర పెత్తందారుల యాత్రగా అభివర్ణించారు. అటువంటి వారికి మంచి బుద్ధిని ప్రసాదించాలని అమ్మవారిని కోరామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, వైఎస్సార్‌సీపీ నగర జోనల్ ఇన్‌చార్జ్‌లు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వికేంద్రీకరణతోనే అభివృద్ధి..

విజయనగరం: విభజనతో వెనుకబాటుకు గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిపాలనా వికేంద్రీకరణతోనే సాధ్యమవుతుందని ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు నగరంలోని పుచ్చలవీధిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మూడు రాజధానులు ఏర్పాటు కావాలని కోరుతూ దీపాలు వెలిగించి దుర్గామాతను ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వచ్చే విజయదశమి నాటికి మూడు రాజధానులతో రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకు దూసుకుపోతుందని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్ మాట్లాడుతూ, విశాఖ పరిపాలనా రాజధాని అయితే ఉత్తరాంధ్ర పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాళ్ల గౌరీశంకర్, మహిళలు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.



భోగాపురం: మూడు రాజధానులకు మద్దతుగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



విజయగరం: దీపాలతో మొక్కు తీర్చుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రత్యేక పూజలు

భోగాపురం: మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరు సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, పడాల భానుప్రకాష్, రామిశెట్టి వెంకటరావు, ఆళ్ళ ఉదయబాబు, పాలెపు కనకరాజు, ఇమ్మిశెట్టి గిరి, తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులకు మద్దతుగా...

డెంకాడ: మూడు రాజధానులకు మద్దతుగా మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయదశమి రోజున గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. డెంకాడ గ్రామంలోని రామాలయంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్ము నాయుడు, డెంకాడ సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, నాయకులు, కార్యర్తలు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన వీధిలో ర్యాలీ నిర్వహించారు.



డెంకాడ: రామాలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు

మూడు రాజధానులతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: మూడు రాజధానుల ఏర్పాటులో భాగంగా విశాఖను పరిపాలనా రాజధానిగా చేసినప్పుడే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. విశాఖపట్నంలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయాలని, రాజధాని వికేంద్రీకరణకు అడ్డుపడుతున్న టీడీపీ నాయకుల మనసు మార్చాలని కోరుతూ నెల్లిమర్ల మొయిద జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం, రామతీర్థం రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ డీవీజీ శంకరరావు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, నెల్లిమర్ల మండల, నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, చనమల్లు వెంకటరమణ, తదితరులు కొబ్బరికాయలు కొట్టి, విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజధాని ఏర్పాటుకు విశాఖపట్నం అన్ని విధాలా అనుకూలమని శ్రీకృష్ణ కమిటీ స్పష్టం చేసినప్పటికీ చంద్రబాబు పెడచెవిన పెట్టారన్నారు. రాజధాని విషయమై నిపుణులతో చర్చించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖపట్నం అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చారన్నారు. రూ. 50 వేల కోట్లతో విశాఖలో పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు.

టీడీపీ నాయకులు మారాలి..

రాజధాని ఏర్పాటు విషయంలో టీడీపీ నాయకులు మారాలని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉండాలని కేంద్రం చెప్పినప్పటికీ, ఓటుకు నోటు కేసులో చిక్కుకున్న చంద్రబాబు హడావిడిగా తట్టాబుట్టా సర్దుకుని వచ్చేశారని ఆరోపించారు. సినీ గ్రాఫిక్స్‌తో రాజధాని నిర్మాణాన్ని చేపట్టి అభాసుపాలయ్యారని ఎద్దేవా చేశారు. కార్యక్రమాల్లో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నౌపడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణకు మద్దతు..

పూసపాటిరేగ: పరిపాలనా వికేంద్రీకరణకు అన్నివర్గాల ప్రజలు మద్దతివ్వాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక శివాలయంలో మూడు రాజధానులకు మద్దతుగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, ఎం. లక్ష్మణరావు, టి.సీతారాం, చిట్టి, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అప్పలనాయుడు, తదితరులు

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

నెల్లిమర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపైనే ఉందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండల వ్యాప్తంగా చేపడుతున్న మనబడి నాడు-నేడు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావుకు, జేఈ శ్రీరాములనాయుడుకు సూచించారు. ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, గ్రామాలకు మంజూరైన డిజిటల్ లైబ్రరీలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

సాదా బైనామా రిజిస్ట్రేషన్ అవకాశాన్ని వినియోగించుకోవాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సాదా బైనామాల రిజిస్ట్రేషన్ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు. గతేడాది మార్చి 31లోపు పురోణీలు, పంచాయతీ రిజిస్ట్రేషన్లను ఎటువంటి ఫీజు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు.

ఇళ్ల వివరాలు అందజేయాలి

గ్రామాల్లో ఇప్పటికే నిర్మాణం ప్రారంభమై బిల్లులు మంజూరుకాని ఇళ్ల వివరాలను ఆయా సచివాలయాలకు వెంటనే అందజేయాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. ఎటువంటి వివక్షత లేకుండా అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందని చెప్పారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు సీఎస్‌డీటీ తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సరఫరాకు ప్రభుత్వం రూ. 16.9 కోట్లు మంజూరు చేసిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, డీసీసీబీ ఉపాధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిని పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన నివాసంలో ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 6,88,000 మొత్తాన్ని లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. రాజాపు చిట్టెమ్మకు రూ.1,40,000, దుక్క వైష్ణవికి రూ.2, 50,000, పతివాడ పార్వతికి రూ.1,20,000, మరుపల్లి దానయ్యకు రూ. 60,000, ఇండుగు కేశవరావు రూ.20,000, దాసరి రమేష్ కు రూ.55,000, గొల్లపల్లి సుగుణకు రూ.43,000 రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, పార్టీ నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, మీసాల రమాదేవి పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

విజయనగరం క్రైమ్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవమైన పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే తొలేళ్ల, సిరిమానోత్సవ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక గురువారం పర్యవేక్షించారు. అయోధ్య మైదానం, మూడులాంతర్లు నుంచి కోట ప్రాంతాలను సందర్శించారు. అధికారులకు భద్రతాపరమైన సూచనలు చేశారు. అనంతరం హుకుంపేటలోని సిరిమాను సిద్ధమవుతున్న ప్రాంతానికి వెళ్లి అర్చకులతో మాట్లాడారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ టి.త్రినాథ్, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో సిరిమాను ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, తదితరులు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



డెంకాడ: ఆర్థిక ప్రయోజనాలను వివరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు



నెల్లిమర్ల రూరల్: బూరాడపేటలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- ఎంపీ బెల్లాన..

నెల్లిమర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రెండు కళ్లు లాంటివని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బూరాడపేట, పారసాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు తమ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడు, తహసీల్దార్ రమణరాజు, ఈఓపీఆర్‌డీ భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులతో మేలు

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ప్రజలకు మేలు చేశారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని పినతాడివాడ పంచాయతీ పరిధిలోని ఒమ్మిపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు,వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, సర్పంచ్‌లు లెంక లక్ష్మణరావు, కలిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చుంనాయుడు, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ, అయ్యప్ప సన్నిధాన భవనం ప్రారంభం

మండలంలోని పినతాడివాడలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ, అయ్యప్ప సన్నిధానం భవనాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు ప్రారంభించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

లాటరీలు అవాస్తవం..

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాల నిధుల సేకరణకు లాటరీ టికెట్లు విక్రయిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని కలెక్టర్ ఎ.సూర్యకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లాటరీ టికెట్లు విక్రయించాలని ఏ అధికారికీ టార్గెట్‌లు నిర్ణయించలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే లక్కీ డ్రా పేరుతో ఎక్కడైనా టికెట్లు విక్రయించినా ఆ డ్రాలు రద్దు చేయాలని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

విజయనగరం టౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే ఎన్‌ఎంయు ధ్యేయమని జిల్లా అధ్యక్ష్యుడు రాఫెల్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయం ఆవరణలో ఇప్పటివరకూ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా ఉన్న రవికాంత్ తన అనుచరులతో కలిసి ఎన్‌ఎంయూలో చేరారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు వి.ప్రదీప్‌కుమార్, కార్యదర్శి బి.రాములు, కె.సత్యం, సీహెచ్ దుర్గరాజు, చంద్రమౌళి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

విజయనగరం ఫోర్ట్: కిశోర బాలికలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని కార్పొరేటర్ నాగవల్లి అన్నారు. స్థానిక 26వ సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సఖి గ్రూపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కిశోర బాలికలు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.

మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోండి..

భోగాపురం: బెల్ట్‌షాపుల ద్వారా అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పూసపాటిరేగ మండలం కనిమెళ్ల గ్రామానికి చెందిన నడిపేన అప్పలస్వామి నాయుడు, దురగాణి సన్యాసి, పిన్నింటి తవుడు, వి.రామునాయుడు, తదితరులు కోరారు. ఈ మేరకు ఎస్ఈబీ భోగాపురం సర్కిల్ కార్యాలయ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందజేశారు. మద్యం విక్రయాలు అరికట్టాలని కోరారు.

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సావాల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి వనంగుడి ఆవరణలో గురువారం రాత్రి సీహెచ్.లక్ష్మి ఆలపించిన భక్తిగీతాలాపన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం కనకరం పెంటలింగం నిర్వహించిన శ్రీరామాంజనేయ యుద్ధం సీన్.. చదురుగుడి వద్ద నైదాన సత్యనారాయణ హరికథ గానాలాపన చూపరులను అలరించింది. అనంతరం ఆలయ నిర్వాహకులు కళాకారులను సత్కరించారు.



విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే వాతావరణం చల్లబడడంతో నగర ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



నగరంలో రోడ్డు మీదుగా పారుతున్న నీరు



తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తిరుగుడుమెట్టలో సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



బాపట్ల జిల్లా అరవపల్లిలో ప్రజల సమస్యలు తెలుసుకుని, సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

ఆత్మీయ ఆదరణ

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లగా వారికి ప్రజల నుంచి ఆత్మీయ ఆదరణ లభించింది. 'సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమకు ఆసరాగా నిలుస్తున్నాయని ప్రజలు చెప్పారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను నాయకులు ఎక్కడికక్కడే పరిష్కరించారు.



శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం జానకంపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా విజయనగరం జిల్లా చందులూరులో కేక్ కట్ చేస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కాణిపాక ఆలయంలో ఆర్జిత సేవల టికెట్ల రేటు పెంచలేదు

- అభిషేకం టికెట్ రేటు పెంపు వార్తలు అవాస్తవం
- ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి వెల్లడి



మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆర్జిత సేవల టికెట్ల రేటు పెంచుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని ఆలయ పాలక మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి చెప్పారు. ఎటువంటి టికెట్ల రేట్లు పెంచబోమని ఆయన స్పష్టంచేశారు. కాణిపాకంలో మోహన్‌రెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి ఆర్జిత సేవల టికెట్లలో అభిషేకం టికెట్ ధరను రూ.700 నుంచి రూ.5 వేలకు పెంచేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం గత నెల 27న దేవదాయ శాఖ ఆర్‌సీ నంబరు జీ1-2380-2011 పత్రం విడుదల చేసిందని తెలిపారు. దీనిపై దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించి అభిప్రాయ సేకరణ పత్రాన్ని తిరస్కరించామని చెప్పారు. అభిషేకం టికెట్ల ధర పెంచకూడదని నిర్ణయించామని స్పష్టం చేశారు. స్వామివారి ఆర్జిత సేవల టికెట్ల ధరలు యథాతథంగా పాతవే ఉంటాయని, ఈ విషయాన్ని భక్తులు గుర్తించాలని కోరారు. కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను దాతల సహకారంతో చేపట్టామని, దేవదాయ శాఖకు ఎలాంటి ఖర్చు లేదని ఆయన తెలిపారు. అందువల్ల ఆలయంలో స్వామివారికి నిర్వహించే ఆర్జిత సేవలు, పరోక్షంగా, ప్రత్యక్షంగా నిర్వహించే కార్యక్రమాల టికెట్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని మోహన్‌రెడ్డి వివరించారు. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలను నమ్మి భక్తులు ఆందోళనకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- చక్రస్నానంతో సేదతీరిన స్వామి
- తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ధ్వజావరోహణతో అంగరంగ వైభవంగా ముగిశాయి. రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య బంగారు తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తర్వాత శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ చేశారు. ధ్వజస్తంభం మీద నుంచి గరుడపతాకాన్ని కిందకు దించటంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు బుధవారం వేకువజామున మూడుగంటల నుంచి పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవంతో స్వామి వరాహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదఘోష, గోవిందనామస్మరణల మధ్య సుదర్శన చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణిలో పవిత్రస్నానం చేయించారు. పెద్ద ఎత్తున భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు, జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవి రంజన్ స్వామిని దర్శించుకున్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మధుసూదన్ యాదవ్, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, చెన్నై స్థానిక సలహామండలి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బ్యాక్ సవారి

శ్రీవారి బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటిరోజు సంప్రదాయబద్ధంగా నిర్వహించే బ్యాక్ సవారి ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరిన మలయప్పస్వామి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరుకున్నారు. అక్కడ అర్చకులు అశ్వత్థవృక్షానికి పూజలు చేశారు. తోటలో ప్రత్యేక పూజలందుకున్న శ్రీవారు తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, నారాయణగిరి ఉద్యానవనాల్లోని అన్ని షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం పడుతోంది.



బ్యాక్ సవారిలో శ్రీదేవి, భూదేవి, మలయప్పస్వామి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.20.43 కోట్లు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం(సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 4 వరకు) రూ.20.43 కోట్లు లభించింది. 5.69 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. గరుడసేవ రోజు 81,318 మంది శ్రీవారిని దర్శించుకోగా.. గరుడసేవలో మూడులక్షల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. మొత్తం 24.89 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించారు. అందరి సహకారం, సమష్టి కృషితో తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయని టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి బుధవారం చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లు చేశామని తెలిపారు. టీటీడీ అధికారులు, సిబ్బంది, జిల్లా యంత్రాంగం, పోలీసులు, శ్రీవారి సేవకుల సమష్టి కృషి, భక్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతం అయ్యాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఈ ఎనిమిది రోజుల్లో 2.20 లక్షలమంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు తెలిపారు. ఆర్టీసీ తిరుపతి నుంచి తిరుమలకు 12,638 ట్రిప్పుల్లో 3.47 లక్షల మంది భక్తులను, తిరుమల నుంచి తిరుపతికి 12,835 ట్రిప్పుల్లో 4.47 లక్షల మంది భక్తులను చేర్చిందని వివరించారు. గరుడసేవ రోజు తిరుపతి నుంచి తిరుమలకు 2,345 ట్రిప్పుల్లో 1,01,880 మంది, తిరుమల నుంచి తిరుపతికి 2,386 ట్రిప్పుల్లో 72,637 మంది భక్తుల్ని చేరవేసిందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 147 బస్సుల ద్వారా 6,997 మంది వెనుకబడిన పేదవర్గాల వారిని ఉచితంగా తిరుమల తీసుకొచ్చి శ్రీవారి మూలమూర్తితోపాటు వాహనసేవల దర్శనం చేయించినట్లు చెప్పారు.

11 నుంచి హైదరాబాద్‌లో శ్రీవారి వైభవోత్సవాలు

హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు శ్రీవేంకటేశ్వర వైభవోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 10న ఈ ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని చెప్పారు. అనకాపల్లి, అరకు, రంపచోడవరం తదితర ప్రాంతాల్లో ఈ నెలలో శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్‌లో ప్రకాశం జిల్లా ఒంగోలులో, జనవరిలో ఢిల్లీలో శ్రీవేంకటేశ్వర వైభవోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. అహ్మదాబాద్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి గుజరాత్ ప్రభుత్వం ఐదెకరాల స్థలం ఇచ్చిందని, త్వరలో భూమిపూజ చేస్తామని చెప్పారు.

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు

- దుర్గమ్మ దర్శనం చేసుకున్న 12 లక్షల మందికి పైగా భక్తులు
- పండుగ నాడు శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- దుర్గగుడికి రూ.6.34 కోట్ల ఆదాయం



శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో కొలువుదీరిన దుర్గమ్మకు హారతి ఇస్తున్న అర్చకుడు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా బుధవారం దుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. బుధవారం మధ్యాహ్నం పూర్ణాహుతితో దసరా ఉత్సవాలు ముగిశాయి. అయితే సాయంత్రం ఆకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. వర్షంలో ఉత్సవమూర్తులను బయటకు తీసుకెళ్లకూడదని ఇంద్రకీలాద్రి స్థానాచార్యులు చెప్పడంతో తెప్పోత్సవాన్ని రద్దు చేశారు. ఈ ఏడాది 12 లక్షల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. టికెట్లు, ఆర్జితసేవలు, లడ్డూ ప్రసాదాల ద్వారా దేవాలయానికి రూ.6.34 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీల్లోని కానుకలను లెక్కించాల్సి ఉంది. దసరా ఉత్సవాలు ముగిసినా ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ కొనసాగుతోంది.

సామాన్య భక్తులకు పెద్దపీట..

సామాన్య భక్తులకు సులువుగా, చక్కగా దర్శనం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. అనధికార దర్శనాలకు అధికారులు అడ్డుకట్ట వేశారు. మూలానక్షత్రం రోజు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చినా ఇబ్బందిలేకుండా క్యూలైనులో వెళ్లి అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు.

బాబు దర్శనం.. భక్తుల అసహనం..

విజయదశమి రోజు బుధవారం మధ్యాహ్నం ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీసమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వచ్చే సమయానికి క్యూలైన్లలో దాదాపు లక్ష మందికిపైగా భక్తులు వేచి ఉన్నారు. చంద్రబాబు రాకతో క్యూలైన్లలో భక్తులను దర్శనానికి ఆపారు. దీంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. కొందరు భక్తులు చంద్రబాబు డౌన్, డౌన్.. అంటూ నినదించారు. భక్తుల ఇబ్బందులు చూసి చంద్రబాబు, టీడీపీ నేతలు త్వరగా దర్శనం చేసుకొని ఆలయం నుంచి వెనుదిరుగుతారని అంతా భావించారు. కానీ వారు గంటకుపైగా కొండపైనే ఉన్నారు. దుర్గమ్మ సన్నిధిలోనే మీడియాను పిలిచి చంద్రబాబు రాజకీయ ఉపన్యాసం ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.


శ్రీశైలంలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. విజయదశమి సందర్భంగా బుధవారం భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నందివాహన సేవలో ఆదిదంపతులు విహరించారు. విజయదశమి రోజు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలతోపాటు శమీ పూజ నిర్వహించారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. అమ్మవారి యాగశాలలో, స్వామివారి యాగశాలలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. పూర్ణాహుతితో శ్రీగిరిలో దసరా మహోత్సవాలు ముగిశాయి.

15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.69 కోట్లు విడుదల



అరసవల్లి: జిల్లాలో 38 మండల పరిషత్‌లకు 15 ఆర్థిక సంఘ నిధులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి గాను రెండో విడతగా రూ. 3,69,88,548 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. అలాగే సీనరేజ్ నిధుల కింద మూడో విడతగా రూ.1,34,84,369 నిధులను సీనరేజ్ తవ్వకాలు జరిగే మండలాల్లో మాత్రమే కేటాయించేలా సర్దుబాటు చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ గురువారం ఆమోదించారు. మండలాల వారీగా మొత్తం కేటాయించిన నిధులను పరిశీలిస్తే...

మండలం	నిధులు(రూ.ల్లో)
సరుబుజ్జిలి	5,16,028
ఎల్.ఎన్.పేట	5,49,038
హిరమండలం	6,17,650
పలాస	6,42,173
వంగర	6,60,993,
బూర్జ	6,87,693
భామిని	6,90,309
ఆమదాలవలస	7,24,304
పాలకొండ	7,31,142
ఇచ్ఛాపురం	8,17,615
రాజాం	8,19,596
మెళియాపుట్టి	8,39,307
సారవకోట	8,67,746
నందిగాం	9,06,758
జి.సిగడాం	9,15,537
జలుమూరు	9,46,191
సీతంపేట	9,55,726
శ్రీకాకుళం	9,88,409
పాతపట్నం	10,10,405
వీరఘట్టం	10,26,506
సంతకవిటి	10,34,415
కంచిలి	10,50,016
పోలాకి	10,51,614
లావేరు	10,97,045
సంతబొమ్మాళి	11,08,399
రేగిడి ఆమదాలవలస	11,17,404
వజ్రపుకొత్తూరు	11,50,486
పొందూరు	1,55,833
టెక్కలి	11,68,324
కోటబొమ్మాళి	11,80,807
కొత్తూరు	11,84,039
కవిటి	11,87,751
నరసన్నపేట	12,05,111
సోంపేట	12,29,353
ఎచ్చెర్ల	12,34,657
గార	12,54,915
మందస	13,16,050
రణస్థలం	13,53,203

సర్టిఫికెట్ల పరిశీలన మొదలు

- సంతోషం వ్యక్తం చేస్తున్న 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు
- తొలిరోజు 216 మందికిగాను 10 మంది గైర్హాజరు
- నేడు 217-433 నంబర్ల సర్టిఫికెట్ల పరిశీలన



పాతపట్నంకు చెందిన వంజరాపు వెంకట కవీశ్వరరావు సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ, హెచ్‌ఎంలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రుణం ఈ జన్మలో తీర్చుకోలేమని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు అంటున్నారు. ఏపీ డీఎస్సీ-1998 ద్వారా ఎంపికైన వారికి మినిమమ్ టైమ్ స్కేల్ పద్ధతి (ఎంటీఎస్) ప్రకారం ఉపాధ్యాయులుగా నియమించాలని సీఎం సంకల్పించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా జరగని పని సీఎం వైఎస్ జగన్ చేసి చూపించడంతో వారు అభ్యర్థులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. సీఎం వైఎస్ జగన్ నిర్ణయంతో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగీకార పత్రాలను తీసుకున్నారు. ఈ విధంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 433 మంది మినిమమ్ టైమ్ స్కేల్ పద్ధతి ప్రకారం ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు సమ్మతించారు. వారి మార్కులు, ర్యాంకులను బట్టి సీనియారిటీ ప్రకారం ఎంపిక జాబితాను సిద్ధం చేశారు. వారంతా వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేశారు. వీరి సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సిలింగ్, ఉద్యోగ నియామక పత్రాల అందజేత మాత్రమే మిగిలి ఉంది. తాజాగా సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

తొలిరోజు 216 మందికి 10 మంది గైర్హాజరు..

జిల్లా కేంద్రంలో గురువారం, శుక్రవారం మొత్తం 433 మంది ఉద్యోగాలకు సమ్మతించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను చేపట్టాలని విద్యాశాఖాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలిరోజు గురువారం క్రమసంఖ్య నంబర్ ఒకటి నుంచి 216 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల రెండు కేంద్రాల్లో జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ నేతృత్వంలో సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. సీనియర్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల నేతృత్వంలో సర్టిఫికెట్లను పరిశీలించగా.. తొలిరోజు 216 మంది హాజరుకావాల్సి ఉండగా వివిధ కారణాలతో 10 మంది గైర్హాజరయ్యారు. నేడు (శుక్రవారం) 217 నుంచి 433 మంది వరకు అవే పాఠశాలల కేంద్రాలుగా సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు

సంతోషంగా ఉంది



సీఎం జగన్‌కు రుణపడి ఉంటాను. ఆఖరి దశలో ఉద్యోగ అవకాశం లభించింది. చాలా సంతోషంగా ఉంది. నేను 1998 డీఎస్సీ ద్వారా ఎంపికయ్యాను. ఇప్పటి వరకు ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చా. ఆగస్టు 25, 1963 న జన్మించిన నాకు ఇంకా మూడేళ్ల సర్వీసు మాత్ర మే మిగిలి ఉంది.

– విశిష్ట కాశీచరణ్ పట్నాయక్, బాలిగాం, మందస మండలం

పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ..



ఏపీ డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమమ్ టైమ్ స్కేల్ పద్ధతి ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో 433 మంది ఎంపికయ్యారు. వీరి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను చేపడుతున్నాం. అత్యంత పారదర్శకంగా వీరి నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది.

– గార పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం

వికేంద్రీకరణపై కార్యాచరణ

- కీలక నేతల భేటీ
- రెండు రోజుల్లో జేఏసీ సమావేశం
- వివరాలు వెల్లడించిన మంత్రి అమర్‌నాథ్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): వికేంద్రీకరణకు మద్దతుగా ఒకటి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటించేందుకు జేఏసీ సమావేశం అవుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రైతుల పేరుతో రియల్టర్లు నిర్వహిస్తున్న పాదయాత్రపై చర్చించేందుకు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో స్థానిక సర్క్యూట్ హౌస్‌లో గురువారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, తదితరులు సమావేశమయ్యారు. సమావేశంలో చర్చించిన అంశాలను మంత్రి అమర్‌నాథ్ మీడియాకు వివరించారు. వికేంద్రీకరణకు మద్దతు కోరుతూ ఈ నెల తొమ్మిదో తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లాలో కూడా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే వారంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా సమావేశం నిర్వహిస్తామన్నారు. టీడీపీ ఎజెండాను వాళ్ల అజెండాగా మార్చుకుని, చంద్రబాబు భూములను కాపాడడం కోసం ఈ యాత్ర సాగిస్తున్నారని అమర్ అన్నారు. కోర్టు అనుమతితో సాగుతున్న ఈ పాదయాత్రకు ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని ఆయన తెలిపారు. అయినప్పటికీ పాదయాత్రలో వాళ్లు తొడలు కొట్టి, సవాలు విసరుతూ ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వికేంద్రీకరణ ద్వారా విశాఖను పాలనా రాజధానిగా చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన జేఏసీ ఒకటి రెండు రోజుల్లో కార్యాచరణను రూపొందిస్తుందని, దాని ప్రకారం తామంతా నడుచుకుంటామని తెలిపారు.

వికేంద్రీకరణకు మద్దతుగా పాదయాత్రలు, వార్డు స్థాయి సమావేశాలు, బైక్ ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉందని అమర్‌నాథ్ విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనులు వేగవంతం

- ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్ రెడ్డి

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్మాణం, ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ) ఎండీ మురళీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పెదవాల్తేర్‌లోని ఔషధ నిల్వల కార్యాలయంలో ఆయన ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో సీహెచ్‌సీఎస్, ఏహెచ్ఎస్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆయా పనుల నిమిత్తం రూ.225 కోట్ల నాబార్డ్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో ఒక్కో ఉమ్మడి జిల్లాకు రూ.75 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఈ పనులపై ఇంజినీరింగ్ విభాగ అధికారులతో ఆయన సమీక్షించారు. 2022 డిసెంబర్ నాటికి ప్రధానమైన పనులన్నీ పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. 2023 మార్చి నాటికి మొత్తం పనులు పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ డైరెక్టర్ సూర్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ శివకుమార్, ఈఈ నాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంజినీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతుడు గంగాధరరావు (ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని నర్సింగపల్లి పంచాయతీ పరిధి పాలసింగి గ్రామానికి చెందిన పిన్నింటి గంగాధరరావు(25) అనే యువకుడు బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...గంగాధరరావు అతనికి వరుసకు తమ్ముడైన పిన్నింటి కిరణ్ అనే యువకుడితో కలసి మెళియాపుట్టి మండలం బందపల్లి గ్రామానికి వెళ్లి అక్క డి నుంచి బుధవారం రాత్రి తన బైక్‌పై టెక్కలి వైపు వస్తుండగా.. గ్రామం సమీపంలోని నరహరిపురం బస్సు షెల్టర్ వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడి సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. గంగాధరరావు ఛాతీకి స్తంభం గట్టిగా తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న కిరణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి గంగాధరరావు మృతి చెందాడు. ఇతడు వైజాగ్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రమాదంపై సమాచారం అందుకున్న టెక్కలి ఎస్ఐ హరికృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి గురువారం శవ పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లిదండ్రులు గాగమ్మ, నారాయణరావు వ్యవసాయ కూలీలు. దసరా పండగ నాడు కుమారుడు మృతి చెందడంతో కుమిలిపోయారు.

విద్యుత్ షాక్‌కు మూగ జీవాలు బలి



మృతి చెందిన మూగ జీవాలు

బూర్జ: మండలంలోని పీఎల్ దేవ్ పేట గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో ఐదు మూగ జీవాలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మజ్జి పెంటయ్య, డోల కాంతారావు తమ పశువులను మేత కోసం గ్రామ సమీపంలో బహిరంగ ప్రదేశంలో విడిచి పెట్టారు. అక్కడ విద్యుత్ వైరు తెగి ఉండడంతో దాన్ని తాకి ఐదు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. అధికారులు పరిశీలించి పోస్టుమార్టం చేశారు.

బిలాయి వెళ్లి..



ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బిర్లంగి తోటూరుకు చెందిన సాడి కిరమ్మకు పింఛన్ డబ్బులను వలంటీర్ శివ బిలాయ్ వరకు వెళ్లి అందించాడు. అనారోగ్యం కారణంగా కిరమ్మ బిలాయ్‌లో చికిత్స పొందుతుండడంతో అంత దూరం వెళ్లి వలంటీర్ డబ్బు అందించారు.



ప్రిటోరియస్ అవుట్

టి20 ప్రపంచ కప్‌కు ముందు దక్షిణాఫ్రికా జట్టుకు గట్టి దెబ్బ తగిలింది. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ డ్వెయిన్ ప్రిటోరియస్ ఎడమ చేతి బొటనవేలు గాయంతో ప్రపంచ కప్‌నుంచి తప్పుకున్నాడు. భారత్‌తో ఇండోర్‌లో జరిగిన మూడో టి20లో గాయపడిన అతను, ఇప్పటికే వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. గాయానికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో ప్రిటోరియస్ స్వదేశం పయనమవుతున్నాడు. అతని స్థానంలో మార్కో జాన్సెన్‌ను ఎంపిక చేసినట్లు దక్షిణాఫ్రికా బోర్డు ప్రకటించింది. జాన్సెన్ సఫారీ జట్టు తరఫున ఒకే ఒక్క టి20 మ్యాచ్ ఆడాడు.

మళ్లీ బరిలోకి దిగిన టిమ్ పైన్

ఆస్ట్రేలియా మాజీ టెస్టు కెప్టెన్ టిమ్ పైన్ 18 నెలల విరామం తర్వాత మళ్లీ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో భాగంగా క్వీన్స్‌లాండ్‌తో గురువారం మొదలైన మ్యాచ్‌లో పైన్ సొంత జట్టు టాస్మేనియా తరఫున బరిలోకి దిగి తొలి ఇన్నింగ్స్‌లో 6 పరుగులు చేశాడు. 2017లో ఒక మహిళకు అసభ్యకర సందేశాలు పంపిన విషయం వెలుగులోకి రావడంతో 2021 ఏప్రిల్‌లో యాషెస్ సిరీస్‌నుంచి తప్పుకొని పైన్ ఆటనుంచి నిరవధిక విరామం తీసుకున్నాడు.



పరాజయంతో మొదలు...

- తొలి వన్డేలో పోరాడి ఓడిన భారత్
- 9 పరుగులతో దక్షిణాఫ్రికా గెలుపు
- సామ్సన్, అయ్యర్ మెరుపులు
- 9న రాంచీలో రెండో వన్డే

లక్నో: స్టార్లు లేని భారత జట్టు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను ఓటమితో మొదలుపెట్టింది. గురువారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 9 పరుగుల తేడాతో సఫారీ టీమ్ చేతిలో పరాజయం చవిచూసింది. ఆఖరి ఓవర్లో 31 పరుగులు కావాల్సివుండగా, సామ్సన్ వరుసగా 6, 4, 4 బాది ఆశలు పెంచాడు. కానీ తర్వాత 0, 4, 1 రావడంతో ఓటమి తప్పలేదు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించారు. మొదట దక్షిణాఫ్రికా 40 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెన్రిచ్ క్లాసెన్ (65 బంతుల్లో 74నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (63 బంతుల్లో 75 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 17.4 ఓవర్లలో అభేద్యంగా 139 పరుగులు జోడించారు. శార్దుల్ 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 40 ఓవర్లలో 8 వికెట్లకు 240 పరుగులు చేసి ఓడింది. సంజు సామ్సన్ (63 బంతుల్లో 86 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (37 బంతుల్లో 50; 8 ఫోర్లు) మెరిపించారు. ఇన్‌గిడి 3, రబడ 2 వికెట్లు పడగొట్టారు.

చెలరేగిన మిల్లర్, క్లాసెన్

టాస్ నెగ్గిన టీమిండియా ఫీల్డింగ్ ఎంచుకోగా... బ్యాటింగ్‌కు దిగిన సఫారీ ఓపెనర్లు డికాక్ (54 బంతుల్లో 48; 5 ఫోర్లు), జేన్‌మన్ మలాన్ (42 బంతుల్లో 22; 3 ఫోర్లు) మంచి ఆరంభాన్నే ఇచ్చారు. 12 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 49 పరుగులు చేసిన దక్షిణాఫ్రికాను శార్దుల్ ఠాకూర్ తొలి దెబ్బ తీశాడు. శ్రేయస్ అయ్యర్‌కు క్యాచ్ ఇచ్చి మలాన్ నిష్క్రమించగా, తర్వాత వచ్చిన బవుమా (8), మార్క్‌రమ్‌లను భారత బౌలర్లు క్రీజులో నిలువనీయలేదు. కెప్టెన్ బవుమాను శార్దుల్, మార్క్‌రమ్ (0) స్పిన్నర్ కుల్దీప్ బౌల్డ్ చేశారు. 71 పరుగుల వద్ద మూడో వికెట్ కూలింది. అడపాదడపా బౌండరీలు కొడుతూ నింపాదిగా ఆడుతున్న డికాక్ జట్టు స్కోరు 100 దాటాక రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. తర్వాత క్లాసెన్‌కు మిల్లర్ జతయ్యాడు. ఇద్దరు మొదట కుదురుగా ఆడారు. తర్వాత పరుగుల వేగం పెంచారు. ఆఖరి 10 ఓవర్లలో ధాటిగా ఆడారు. ఈ క్రమంలో ముందుగా మిల్లర్ 50 బంతుల్లో (4 ఫోర్లు, 1 సిక్స్), రెండు బంతుల వ్యవధిలో క్లాసెన్ 52 బంతుల్లో (4 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. దీంతో జట్టు స్కోరు 200 పరుగుల మైలురాయి దాటింది. ఇవన్నీ అవేశ్ ఖాన్ వేసిన 36వ ఓవర్లోనే జరిగాయి. ఆ ఓవర్లో 12 పరుగులు సమర్పించుకున్న అతని తదుపరి ఓవర్లో (38) మిల్లర్ 4, 6 బాదేయడంతో 16 పరుగులు వచ్చాయి. ఆఖరి 10 ఓవర్లలో ఈ జోడీ 85 పరుగులు జతచేసింది. అభేద్యమైన ఐదో వికెట్‌కు మిల్లర్, క్లాసెన్ 139 పరుగులు జోడించారు. డెత్ ఓవర్లలో మిల్లర్ క్యాచ్‌ను గైక్వాడ్, క్లాసెన్ క్యాచ్‌ను సిరాజ్ నేలపాలు చేయడం కూడా స్కోరు పెరిగేందుకు దోహదం చేసింది.



సామ్సన్

మెరిపించిన శ్రేయస్, సామ్సన్

భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత టాపార్డర్ నిరాశ పరిచింది. ఓపెనర్లు శుబ్‌మన్ గిల్ (3), శిఖర్ ధావన్ (4) సహా వన్‌డౌన్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ (42 బంతుల్లో 19; 1 ఫోర్) వికెట్లను కోల్పోయింది. ఐపీఎల్‌లో దంచేసే గైక్వాడ్, ఇషాన్ కిషన్ (37 బంతుల్లో 20; 3 ఫోర్లు) నెమ్మదిగా ఆడటంతో టి20ల మైకంలో ఉన్న భారత ప్రేక్షకుల్ని వన్డే మ్యాచ్ చాలాసేపు బోర్ కొట్టించింది. 3, 4, 5 ఓవర్ల (మెయిడిన్)లో ఒక్క పరుగు రాలేదు. 18వ ఓవర్లో టీమిండియా స్కోరు 50 పరుగులు చేరిందంటే బ్యాటింగ్ ఎంత చప్పగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. 51 పరుగులకే 4 కీలక వికెట్లను కోల్పోయిన దశలో శ్రేయస్ అయ్యర్, సంజూ సామ్సన్ కాసేపు క్రికెట్ మజాను అందించారు. షమ్సీ వేసిన 19వ ఓవర్లో అయ్యర్ 4, సామ్సన్ సిక్సర్ బాదడంతో తొలిసారిగా ఒక ఓవర్లో 15 పరుగులొచ్చాయి. ముఖ్యంగా అయ్యర్ బౌండరీలతో అదరగొట్టాడు. షమ్సీ 21వ ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లు కొట్టాడు. ఇన్‌గిడి బౌలింగ్‌కు దిగితే అతనికి తన బ్యాటింగ్ సత్తా చూపించాడు. దీంతో 22.3 ఓవర్లో భారత్ 100 చేరింది. అదే జోరుతో శ్రేయస్ 33 బంతుల్లో (8 ఫోర్లు) మెరుపు వేగంతో అర్ధసెంచరీ సాధించాడు. కానీ అదే స్కోరు వద్దే ఇన్‌గిడి అతన్ని బోల్తా కొట్టించాడు. తర్వాత శార్దుల్ ఠాకూర్ వచ్చాక సంజూ వేగం పెంచాడు. 31.1 ఓవర్లో జట్టు స్కోరు 150కి చేరింది. ఇంకా భారత్ విజయానికి 8.5 ఓవర్లలోనే 100 పరుగులు కావాలి. టి20లకు కూడా కష్టమయ్యే చేజింగ్ వన్డేల్లో అసాధ్యం! సామ్సన్, శార్దుల్ (31 బంతుల్లో 33; 5 ఫోర్లు)ధాటిగా ఆడినా కొండంత రన్‌రేట్ కరగలేదు. 49 బంతుల్లో (3 ఫోర్లు, 2 సిక్సర్లు) సంజూ అర్ధసెంచరీ సాధించాడు. శార్దుల్ అవుటయ్యాక స్వల్ప వ్యవధిలో కుల్దీప్ (0), అవేశ్ (3) వికెట్లను కోల్పోయింది. దీంతో ఓటమి ఖాయమైంది.



క్లాసెన్ మిల్లర్

స్కాన్ చేయండి
ఈ రోజు హైలైట్ కొరకు

ఈ మ్యాచ్‌తో రుతురాజ్ గైక్వాజ్, రవి బిష్ణోయ్ వన్డేల్లో అరంగేట్రం చేశారు. వీరిద్దరు భారత్‌కు వన్డేల్లో ప్రాతినిధ్యం వహించిన 245, 246వ ఆటగాళ్లుగా నిలిచారు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మలాన్ (సి) అయ్యర్ (బి) శార్దుల్ 22; డికాక్ (ఎల్బీ) (బి) బిష్ణోయ్ 48; బవుమా (బి) శార్దుల్ 8; మార్క్‌రమ్ (బి) కుల్దీప్ 0; క్లాసెన్ నాటౌట్ 74; మిల్లర్ నాటౌట్ 75; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (40 ఓవర్లలో 4 వికెట్లకు) 249.**
వికెట్ల పతనం: 1-49, 2-70, 3-71, 4-110.
బౌలింగ్: సిరాజ్ 8-0-49-0, అవేశ్ 8-0-51-0, శార్దుల్ 8-1-35-2, రవి బిష్ణోయ్ 8-0-69-1, కుల్దీప్ 8-0-39-1.

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (బి) పార్నెల్ 4; గిల్ (బి) రబడ 3; రుతురాజ్ (స్టంప్డ్) డికాక్ (బి) షమ్సీ 19; ఇషాన్ కిషన్ (సి) మలాన్ (బి) కేశవ్ 20; అయ్యర్ (సి) రబడ (బి) ఇన్‌గిడి 50; సామ్సన్ నాటౌట్ 86; శార్దుల్ (సి) కేశవ్ (బి) ఇన్‌గిడి 33; కుల్దీప్ (సి) బవుమా (బి) ఇన్‌గిడి 0; అవేశ్ (సి) బవుమా (బి) రబడ 3; బిష్ణోయ్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (40 ఓవర్లలో 8 వికెట్లకు)**
వికెట్ల పతనం: 1-8, 2-8, 3-48, 4-51, 5-118, 6-211, 7-211, 8-215.
బౌలింగ్: రబడ 8-2-36-2, పార్నెల్ 8-1-38-1, కేశవ్ 8-1-23-1, ఇన్‌గిడి 8-0-52-3, షమ్సీ 8-0-89-1.



అయ్యర్



కూతకు వేళాయె!

- నేటినుంచి ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-9
- బరిలో 12 జట్లు
- రా.గం. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: ఎనిమిది సీజన్లుగా అలరిస్తున్న కబడ్డీ మరోసారి అభిమానుల ముందుకు వచ్చింది. ప్రతిష్టాత్మక ప్రొ కబడ్డీ లీగ్ తొమ్మిదో సీజన్‌కు రంగం సిద్ధమైంది. బెంగళూరులో నేడు ఈ టోర్నీ ప్రారంభం కానుంది. బెంగళూరుతో పాటు హైదరాబాద్, పుణే నగరాల్లో అన్ని మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో టీవీలకే పరిమితమైన అభిమానులు ఈ సారి నేరుగా ఆటను ఆస్వాదించడం అవకాశం నిర్వాహకులు కల్పిస్తున్నారు. ఈ మూడు వేదికల్లోనూ ఫ్యాన్స్‌ను అనుమతించనున్నారు. మొత్తం 12 జట్లు లీగ్ బరిలోకి దిగుతున్నాయి. లీగ్‌లో భాగంగా మొత్తం 66 మ్యాచ్‌లు జరుగుతాయి. శుక్రవారం జరిగే తొలి పోరులో యు ముంబాతో డిఫెండింగ్ చాంపియన్ దబంగ్ ఢిల్లీ తలపడుతుంది. జాతీయ క్రీడల్లో కబడ్డీ ఈవెంట్ ముగిసిన వారం రోజుల్లోపే అందరూ ఆటగాళ్లు లీగ్‌కు సిద్ధమై బరిలోకి దిగుతున్నారు.

రాహుల్ రెడీ

లీగ్ వేలంలో రూ. 2.26 కోట్ల విలువ పలికిన పవన్ కుమార్ సెహ్రావత్ (తమిళ్ తలైవాస్)పై అందరి దృష్టి నిలిచి ఉంది. గత సీజన్‌లో పుణేరీ తరఫున పేలవ ప్రదర్శన కనబర్చిన స్టార్ రాహుల్ చౌదరి గాయంనుంచి కోలుకొని ఈ సారి జైపూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇప్పటి వరకు జరిగిన ఎనిమిది సీజన్లలో పట్నా పైరేట్స్ 3 సార్లు విజేతగా నిలవగా...బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబంగ్ ఢిల్లీ, జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా ఒక్కోసారి విజేతగా నిలిచాయి.

టైటాన్స్ రాత మారేనా!

ప్రొ కబడ్డీ లీగ్‌లో ఇప్పటి వరకు టైటిల్ గెలవని జట్లలో తెలుగు టైటాన్స్ ఒకటి. ఎనిమిది సీజన్లు కలిపి 148 మ్యాచ్‌లలో 52 గెలిచిన టైటాన్స్, అంతకంటే ఎక్కువ పరాజయాలు (77) నమోదు చేసింది. అయితే ఇతర జట్లకంటే ఎక్కువ 'డ్రా'లు (19) కూడా టైటాన్స్ ఖాతాలో ఉన్నాయి. వీటిని విజయాలుగా మలచుకోగలిగితే కథ వేరేగా ఉండేదేమో. టైటాన్స్ జట్టు పేలవ ప్రదర్శనతో ఏడో సీజన్‌లో 11వ, ఎనిమిదో సీజన్‌లో 12వ స్థానాల్లో నిలిచింది. అయితే ఈ సారి జట్టు కాస్త మెరుగ్గా, సమతూకంగా కనిపిస్తోంది. గత రెండు సీజన్లలో ఆకట్టుకున్న రైడర్ అభిషేక్ సింగ్‌ను తీసుకోగా, మనూ గోయత్, సిద్ధార్థ్ దేశాయ్ మళ్లీ జట్టులోకి వచ్చారు. అంకిత్ బెనివాల్, రజనీశ్, డిఫెన్స్‌లో విశాల్ భరద్వాజ్ జట్టుకు కీలకం కానున్నారు. వెంకటేశ్ గౌడ్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. నేడు తమ తొలి పోరులో బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడుతుంది.

నేటినుంచి ఐఎస్ఎల్-9



ఐఎస్ఎల్ ట్రోఫీతో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ కోచ్ మనోలో మార్క్వెజ్

కొచ్చి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీకి రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ బరిలోకి దిగుతుండగా...నేడు జరిగే తొలి మ్యాచ్‌లో కేరళ బ్లాస్టర్స్‌తో ఈస్ట్ బెంగాల్ తలపడుతుంది. ఆదివారం హైదరాబాద్ తమ తొలి పోరులో ముంబై సిటీ జట్టును ఎదుర్కొంటుంది. గత రెండు సీజన్లు కరోనా కారణంగా ఐఎస్ఎల్ మ్యాచ్‌లు గోవాకే పరిమితమయ్యాయి. అయితే ఇప్పుడు 11 టీమ్‌లకు కూడా సొంత వేదికల్లో, ప్రత్యర్థి వేదికల్లో (హోం అండ్ అవే) మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పిస్తుండటం విశేషం. అభిమానులను కూడా ఆయా స్టేడియాల్లో అనుమతిస్తున్నారు. ప్రధానంగా వారాంతాల్లోనే మ్యాచ్‌లు నిర్వహిస్తూ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఈ సీజన్ కొనసాగనుంది. లీగ్ దశలో టాప్-2లో నిలిచిన రెండు జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ప్లే ఆఫ్స్ ద్వారా మరో రెండు స్థానాలను నిర్ణయిస్తారు.



'ఆల్ ది బెస్ట్'

ఆస్ట్రేలియా బయల్దేరిన భారత జట్టు

ముంబై: భారత క్రికెట్ అభిమానుల ఆశలు మోస్తూ టి20 ప్రపంచ కప్ వేటలో టీమిండియా ఆస్ట్రేలియాకు పయనమైంది. రోహిత్ శర్మ నాయకత్వంలోని బృందం గురువారం ముంబైనుంచి బయల్దేరి వెళ్లింది. 14 మంది జట్టు సభ్యులతో పాటు మరో 16 మంది సహాయక సిబ్బంది కూడా టీమ్‌తో ఉన్నారు. వరల్డ్‌కప్‌లోని ఇతర జట్లతో పోలిస్తే భారత్ చాలా ముందుగా ఆసీస్ గడ్డపై అడుగు పెడుతోంది. మెగా టోర్నీకి ముందు అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు దూరమైన దీపక్ హుడా పూర్తిగా కోలుకొని జట్టుతో చేరాడు. మరో వైపు బుమ్రా స్థానంలో ఇంకా ఎవరినీ సెలక్టర్లు ఎంపిక చేయలేదు. దాంతో 14 మందే ఆసీస్‌కు వెళ్లారు. పెర్త్‌లో జట్టుకు వారం రోజుల పాటు కండిషనింగ్ క్యాంప్ జరుగుతుంది.

సాయిప్రణీత్‌కు స్వర్ణం

- డబుల్స్ విజేతలు సిక్కిరెడ్డి-గాయత్రి
- జాతీయ క్రీడల బ్యాడ్మింటన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో గురువారం మూడు స్వర్ణాలు చేరాయి. బ్యాడ్మింటన్‌లో రెండు పతకాలు సాధించిన జట్టుకు బాస్కెట్‌బాల్‌లో కూడా మరో బంగారు పతకం దక్కింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో తెలంగాణ షట్లర్ సాయిప్రణీత్ 21-11, 12-21, 21-16తో మిథున్ మంజునాథ్ (కర్నాటక)ను ఓడించి విజేతగా నిలిచాడు. మహిళల డబుల్స్‌లో ఫైనల్లో ఎన్. సిక్కిరెడ్డి-పుల్లెల గాయత్రి గోపీచంద్ ద్వయం పసిడి పతకాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఫైనల్లో సిక్కి-గాయత్రి 21-14, 21-11తో శిఖా గౌతమ్-అశ్విని భట్ (కర్నాటక)ను చిత్తు చేశారు. మహిళల బాస్కెట్‌బాల్ 5-5 ఈవెంట్‌లో కూడా తెలంగాణకు స్వర్ణం లభించింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో తెలంగాణ 67-62 పాయింట్ల తేడాతో తమిళనాడుపై విజయం సాధించింది. మూడు క్వార్టర్‌లు ముగిసే సరికి 5 పాయింట్లతో వెనుకబడి ఉన్న తెలంగాణ నాలుగో క్వార్టర్‌లో 10 పాయింట్ల ఆధిక్యం సాధించి విజయాన్నందుకోవడం విశేషం. తెలంగాణ స్విమ్మర్ వ్రిత్తి అగర్వాల్ ఖాతాలో మరో పతకం చేరింది. మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో రెండో స్థానంలో నిలిచిన వృత్తి రజత పతకాన్ని అందుకుంది.



సాయిప్రణీత్



వ్రిత్తి



గాయత్రి సిక్కి

మహిళల ఆసియా కప్‌లో నేడు
భారత్ X పాకిస్తాన్

మ.గ.1.00నుంచి
స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

కార్న్‌వాల్ విధ్వంసం

మైనర్ లీగ్ టి20ల్లో డబుల్ సెంచరీ



అట్లాంటా: వెస్టిండీస్ క్రికెటర్ రకీమ్ కార్న్‌వాల్ అమెరికా 'మైనర్ లీగ్ క్రికెట్'లో భీకరమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడు. అట్లాంటా ఓపెన్ టి20 టోర్నీలో కార్న్‌వాల్ 77 బంతుల్లోనే అజేయంగా 205 పరుగులు సాధించాడు. ఇందులో 17 ఫోర్లు, 22 సిక్సర్లు ఉన్నాయి. అతని ఇన్నింగ్స్‌లో 200 పరుగులు బౌండరీల ద్వారానే రావడం విశేషం. విండీస్ తరఫున 9 టెస్టులు ఆడిన కార్న్‌వాల్ ఈ టోర్నీలో అట్లాంటా ఫైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. స్క్వేర్ డ్రైవ్ పాంథర్స్ టీమ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో కార్న్‌వాల్ తన విశ్వరూపం ప్రదర్శించాడు. అయితే మైనర్ లీగ్ మ్యాచ్‌లకు టి20లుగా అధికారిక గుర్తింపు లేదు. కాబట్టి ఈ విండీస్ ఆజానుబాహుడి ప్రదర్శన టి20 రికార్డుల్లోకి ఎక్కదు! టి20ల్లో అత్యధిక స్కోరు రికార్డు ఇప్పటికీ క్రిస్ గేల్ (175 నాటౌట్ - 2013 ఐపీఎల్‌లో) పేరిటే ఉంది.

నాగాలాండ్ 24 ఆలౌట్!

చెన్నై: బీసీసీఐ మహిళల అండర్-19 టి20 ట్రోఫీలో నాగాలాండ్ జట్టు అత్యంత చెత్త ప్రదర్శన కనబర్చింది. గురువారం ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో నాగాలాండ్ 19.1 ఓవర్లలో 24 పరుగులకే కుప్పకూలింది. టీమ్‌లో ఏ ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. 7 పరుగులు చేసిన విపెని టాప్ స్కోరర్ కాగా, ఎక్స్‌ట్రాల రూపంలో అత్యధికంగా 8 పరుగులు వచ్చాయి. ఆంధ్ర బౌలర్లలో కెప్టెన్ తన్మయి 4 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, విన్నీ సుజాన్ 1 పరుగు ఇచ్చి 2 వికెట్లు తీసింది. అనంతరం ఆంధ్ర 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 25 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

యాత్రల పేరుతో ప్రజా ప్రభుత్వంపై కుట్రలు

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సత్రాజు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై యాత్రల పేరుతో రాజకీయ కుట్రలు పన్నుతున్నారని, ఇవి ఎంతో కాలం సాగవని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సత్రాజు చెప్పారు. ఒక వర్గం ప్రయోజనం కోసం అమరావతి పేరుతో రాజకీయ యాత్ర జరుగుతోందని విమర్శించారు. చంద్రబాబు కట్టని, కట్టలేని రాజధాని పేరుతో మిగిలిన ప్రాంతాల అభివృద్ధిని దెబ్బతీసేందుకు జరుగుతున్న ఈ యాత్రకు ప్రజామోదం లేదని చెప్పారు. పాదయాత్ర ఎందుకు, ఎవరి కోసం చేస్తున్నారని ప్రశ్నించారు. పాదయాత్ర చేస్తున్న వారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. విశాఖలో పరిపాలనా రాజధాని వద్దంటూ ఉత్తరాంధ్రకే పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఒక్కచోటే అభివృద్ధి చేసిన తప్పు మరోసారి జరగకూడదనే దూరదృష్టితోనే సీఎం వైఎస్ జగన్ వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారన్నారు. అన్ని ప్రాంతాలూ సమాన అభివృద్ధి చెందాలనే మహోన్నత ఆశయంతోనే మూడు రాజధానుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకొన్నారని చెప్పారు. అంతటి గొప్ప ఆశయాన్ని దెబ్బతీసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారన్నారు. రాష్ట్రంలో కుల, మత, ప్రాంత వివక్షకు తావులేకుండా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కుయుక్తులతో లబ్ధి పొందాలని చూస్తున్న చంద్రబాబు, ఆయన బ్యాచ్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు.

నేడు పోలవరంపై ఉన్నత స్థాయి భేటీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) శుక్రవారం ఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తోంది. పోలవరం ప్రాజెక్టు ముంపు, బ్యాక్ వాటర్ ప్రభావంపై అనుమానాలను నివృత్తి చేయడమే ఈ సమావేశంలో ప్రధానాంశం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఈఎన్‌సీల నేతృత్వంలో ఆ రాష్ట్రాల సాంకేతిక నిపుణుల బృందాలు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారులతో సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ ఆర్కే గుప్తా ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు. పోలవరం ప్రాజెక్టు ముంపు, బ్యాక్ వాటర్ ప్రభావంపై తమ అధ్యయనంలో వెల్లడైన అంశాలను తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నిపుణుల బృందాలకు సీడబ్ల్యూసీ వివరించనుంది. పోలవరం ప్రాజెక్టు కట్టక ముందు దాని వెనుక భాగాన గోదావరిలో ఏ స్థాయిలో వరద నీటి మట్టం ఉంటుందో.. ఆ ప్రాజెక్టు పూర్తయ్యాక కూడా అంతే ఉంటుందని తమ అధ్యయనంలో వెల్లడైన అంశాలను సాంకేతికంగా వివరించనుంది. గోదావరి ట్రిబ్యునల్ ఆమోదించిన ప్రకారమే పోలవరం ప్రాజెక్టును నిర్మించేలా తామే డిజైన్‌ను ఆమోదించామని గుర్తు చేయనుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 1978లో మూడు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో శబరి, సీలేరులకు కరకట్టల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని.. అందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని ఆ రెండు రాష్ట్రాలను మరోసారి కోరనున్నారు. వెల్లడైన అంశాలపై కేంద్ర జల్ శక్తి శాఖకు సీడబ్ల్యూసీ నివేదిక ఇవ్వనుంది. అదే నివేదికను సుప్రీం కోర్టుకు కేంద్ర జల్ శక్తి శాఖ అందజేయనుంది.

వైఎస్సార్‌సీపీ నేత వేణుబాబుపై హత్యాయత్నం

దాడిచేసి ఇనుప రాడ్డుతో కొట్టిన 8 మంది దుండగులు



పోడూరు: పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి భర్త, మార్టేరు ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి వేణుబాబుపై గురువారం హత్యాయత్నం జరిగింది. ఎనిమిదిమంది దుండగులు దాడిచేసి కొట్టడంతో తీవ్రంగా గాయపడిన వేణుబాబు భీమవరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వేణుబాబు మార్టేరు శివారులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణపనుల పర్యవేక్షణకు కారులో వెళ్లారు. కారు డ్రైవర్ నవీన్‌ను ఇంటికి వెళ్లిపోమని చెప్పి ఆయన అక్కడే ఉన్నారు. నవీన్ ఇంటికి వెళుతుండగా పోడూరు మండలం పండితవిల్లూరు శివారు కట్లమ్మతాడి సమీపంలో ఆ కారును.. ఎదురుగా వచ్చిన కారులోని గుర్తుతెలియని ఎనిమిదిమంది దుండగులు ఆపారు. డ్రైవర్ నవీన్‌తో గొడవపెట్టుకుని అతడిని కొట్టారు. దీంతో నవీన్.. వేణుబాబుకు ఫోన్‌చేసి విషయం చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకున్న వేణుబాబుపై దుండగులు దాడి చేశారు. తలపై ఇనుప రాడ్డుతో కొట్టి కారును వదిలేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన వేణుబాబును డ్రైవర్ నవీన్ మార్టేరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వేణుబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పాలకొల్లు రూరల్ సీఐ కె.శ్రీనివాస్, పోడూరు, పెనుమంట్ర ఎస్‌ఐలు వై.నాగలక్ష్మి, బి.సురేంద్రకుమార్ ఘటనాప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. దుండగులు వదిలివెళ్లిన కారులో కారంపొడి ప్యాకెట్లు, సుత్తి, మద్యం సీసా ఉన్నాయి. దాడిచేసిన వ్యక్తులు మధ్యాహ్నం నుంచి ఆ ప్రాంతంలోనే ఉండి వేణుబాబు కదలికలు గమనించినట్టు కొందరు చెబుతున్నారు. వేణుబాబును మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఫోన్‌లో పరామర్శించారు.



ద్రాక్షారామంలోని మాణిక్యాంబ సన్నిధిలో కొబ్బరికాయ కొడుతున్న మంత్రి వేణుగోపాల్



తణుకు మండలం సజ్జాపురంలోని శ్రీఏవుళ్లమ్మ తల్లి ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న మంత్రి కారుమూరి



దుర్గమ్మ సన్నిధిలో టెంకాయలు కొడుతున్న మంత్రి రోజా



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో 3 రాజధానులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

వికేంద్రీకరణే ముద్దు



అనంతలో మల్లాలమ్మ ఆలయం వద్ద టెంకాయ కొడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



విశాఖ ఆంజనేయుడి గుడి వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

▶ మొదటి పేజీ తరువాయి

పూజలు నిర్వహించారు.

విఘ్నాలు తొలగించమ్మా..

- ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై మంత్రి జోగి రమేష్ కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి కలిగే విఘ్నాలు, ఆటంకాలు పోవాలని, దుష్టశక్తులు కలిగించే విఘ్నాలు తొలగిపోవాలని దుర్గమ్మను ప్రార్థించానన్నారు. మంత్రి రోజా రాజగోపురం ఎదుట 108 కొబ్బరి కాయలు కొట్టారు. వికేంద్రీకరణ జరిగిన తర్వాత మళ్లీ వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటానన్నారు.
- వేమూరు నియోజకవర్గంలోని చుందూరులో శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి మేరుగు నాగార్జున, రేపల్లెలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పూజలు నిర్వహించారు.
- విశాఖపట్నం, అమరావతి, కర్నూలు ప్రాంతాల్లో రాజధానుల ఏర్పాటు వేగవంతంగా జరిగేలా దీవించాలంటూ విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనకాపల్లిలో నూకాంబిక దేవాలయంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- విశాఖను పరిపాలనా రాజధాని చెయ్యాలంటూ వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు కేవీ బాబా, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, ఐ.హెచ్.ఫరూఖ్ అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని తాజ్‌బాగ్ దర్గాలో చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు.
- శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి వద్ద దుర్గాదేవి ఆలయంలో, బలగలోని శ్రీ బాల త్రిపుర కాల భైరవ ఆలయంలో, గైనెటి వీధి నీలమ్మ తల్లి ఆలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి శ్రీ పాలపోలమ్మ తల్లి ఆలయంలో రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారాం 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.
- విజయనగరంలో శాసనసభ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి, సాలూరు శ్యామలాంబ ఆలయంలో ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆలయాల వద్ద పెద్ద ఎత్తున కొబ్బరికాయలు కొట్టారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తణుకు నియోజకవర్గంలో పూజలు నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహించారు. ఏలూరులో మేయర్ షేక్ నూర్జహాన్ ర్యాలీ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లి గూడెంలో బలుసులమ్మ ఆలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కొబ్బరి కాయలు కొట్టారు.
- తూర్పుగోదావరి జిల్లా చాగల్లులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్ కొబ్బరికాయలు కొట్టారు. తునిలో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ద్రాక్షారామంలోని మాణిక్యాంబ సన్నిధిలో మంత్రి వేణుగోపాలకృష్ణ కొబ్బరికాయలు కొట్టారు.
- తిరుపతిలోని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం గూళ్యం గ్రామంలోని గాదిలింగేశ్వరస్వామికి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం 101 కొబ్బరి కాయలు కొట్టారు. కర్నూలు వినాయక ఘాట్‌లో కర్నూలు, నంద్యాల ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పూజలు నిర్వహించారు. వికేంద్రీకరణకు మద్దతుగా నంద్యాల జిల్లా అయ్యలూరు మసీదులో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ప్రార్థనలు చేశారు.

వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి

అమరావతి రైతుల పేరుతో చేస్తున్నది కృత్రిమ ఉద్యమమే

- ప్రజలకు అవసరమైన, అభివృద్ధికి దోహదపడే హామీల అమలు
- 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం
- ప్రజలకు మేలు చేసేందుకు కొత్త రాజకీయ పార్టీలొస్తే మంచిదే కదా!
- ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల



సాక్షి, అమరావతి: వికేంద్రీకరణతోనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పునరుద్ఘాటించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి రైతుల పేరుతో చంద్రబాబు బినామీలైన రియల్టర్లు కృత్రిమ ఉద్యమం చేస్తున్నారన్నారు. జ్యుడీషియల్ క్యాపిటల్‌గా కర్నూలును వ్యతిరేకిస్తూ ఆ ప్రాంతానికి పాదయాత్ర చేశారని.. ఇప్పుడు కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నాన్ని వ్యతిరేకిస్తూ ఆ ప్రాంతానికి పాదయాత్ర చేస్తున్నారని... ఇదేం పద్ధతని వ్యాఖ్యానించారు. విశాఖపట్నాన్ని కార్యనిర్వాహక రాజధానిగా చేస్తామంటే ఆ ప్రాంత ప్రజలు ఎవరైనా వద్దంటారా? అని ప్రశ్నించారు. ''కానీ విచిత్రమేమంటంటే అమరావతి రైతుల ముసుగులోని రియల్టర్లు విశాఖపట్నం ప్రజలు తమ ప్రాంతంలో కార్యనిర్వాహక రాజధాని వద్దంటున్నారనే భ్రమ కల్పించే దుస్సాహసానికి ఒడిగట్టారు. నేరుగా అక్కడికే పాదయాత్ర అంటూ దుర్మార్గమైన డ్రామా చేస్తున్నారు'' అని మండిపడ్డారు. శ్రీబాగ్ ఒడంబడిక.. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో అభివృద్ధిని కేంద్రీకరించడం వల్ల జరిగిన పరిణామాలు.. ప్రపంచ వ్యాప్తంగా వికేంద్రీకరణ వల్ల చేకూరుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారాయన. ''మేం ఏ ప్రాంతానికీ వ్యతిరేకం కాదు. అన్ని ప్రాంతాలూ బాగుండాలి. అందులో అమరావతి కూడా ఉండాలన్నదే మా విధానం'' అని స్పష్టం చేశారు.

ఎన్నికల సంఘం నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం

ఎన్నికల్లో ఇచ్చే హామీల అమలుకు ఉన్న వనరులేంటో చెప్పాలని రాజకీయ పార్టీలను ఎన్నికల సంఘం అడగటం స్వాగతించదగ్గ పరిణామమన్ని సజ్జల చెప్పారు. ప్రజలకు అవసరమైన, వారి అభివృద్ధికి దోహదం చేసే హామీలనే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఇచ్చిందని.. వాటిలో 98 శాతం ఇప్పటికే అమలు చేసిందని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో వ్యవసాయ రుణాలను, డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి.. గెలిచాక అమలు చేయకుండా మోసం చేశారని చెప్పారు. ఆ రెండు హామీలు ఆచరణ సాధ్యం కావని వైఎస్ జగన్ అప్పుడే చెప్పారన్నారు. టీడీపీ ఇచ్చిన ఆ రెండు హామీల వల్లే కేవలం ఒక శాతం ఓట్ల తేడాతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేకపోయిందని చెప్పారు. ఈ దృష్ట్యా ఎన్నికల సంఘం ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం వైఎస్సార్‌సీపీకి అత్యంత అనుకూలమని చెప్పారు.

ప్రజలకు మేలు చేసే అజెండాతో వస్తే మంచిదే

'ప్రజలకు మేలు చేసే అజెండాతో కొత్త పార్టీలు వస్తే మంచిదే కదా?' అని బీఆర్‌ఎస్ ఏర్పాటుపై విలేకరులడిగిన ప్రశ్నకు సమాధానంగా సజ్జల వ్యాఖ్యానించారు. కొత్త పార్టీల వల్ల పోటీతత్వం పెరిగి తమ పనితీరును మరింత మెరుగు పర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇంతకు మించి కొత్త పార్టీలపై తాము లోతుగా ఆలోచించబోమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే తమ పార్టీకి ప్రధానమని తేల్చి చెప్పారు. పక్క రాష్ట్రాల గురించి తాము మాట్లాడబోమని.. భవిష్యత్ రాజకీయాల కోసం వాళ్లు మాపై విమర్శలు చేస్తున్నారేమోనని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ వెంటే ప్రజలు నడుస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమ్ముడి గురించి అన్న ఎలా స్పందించాలో పవన్‌పై చిరంజీవి అలా స్పందించాడని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

రైతు ముసుగులో టీడీపీ పాదయాత్ర

ఉత్తరాంధ్ర జిల్లాలకు ద్రోహం చేస్తున్న టీడీపీ : మంత్రి బొత్స



సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుని రైతు ముసుగులో టీడీపీ పాదయాత్ర చేపడుతోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కావాలో.. కొందరు దోచుకునే అవకాశం ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం కావాలో ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలను టీడీపీ ఎప్పుడూ పట్టించుకోలేదని, ఇప్పుడు అభివృద్ధి చేయడానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తుంటే.. అడుగడుగునా అడ్డుపడుతూ టీడీపీ ద్రోహం చేస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అశోక్ గజపతిరాజు.. జిల్లాలో ఒక్క పరిశ్రమగాని, ప్రభుత్వ విద్యా సంస్థనుగానీ ఏర్పాటు చేసిన చరిత్ర ఉందా.. అని ప్రశ్నించారు. జిల్లాకు ఆయన చేసింది శూన్యమన్నారు. బొబ్బిలిలో గ్రోత్ సెంటర్, శ్రీకాకుళం జిల్లా సరిహద్దులో ఫార్మా పరిశ్రమలు తీసుకొచ్చి జిల్లా అభివృద్ధికి అడుగులు వేసింది వైఎస్సార్ అని గుర్తు చేశారు. ఆయన ప్రారంభించిన తాగు, సాగునీటి ప్రాజెక్టులు 85 శాతం పూర్తిచేస్తే.. అనంతరం అధికారంలోకొచ్చిన టీడీపీ మిగిలిన 15 శాతం పూర్తి చేయలేదని విమర్శించారు. విశాఖను పరిపాలన రాజధానిగా ఏ రోజైనా ప్రకటించే అవకాశం ఉందని మంత్రి బొత్స స్పష్టం చేశారు.

బాబుకు జ్ఞానం పెరగాలని దుర్గమ్మను వేడుకున్నా

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): మూడు రాజధానులు ఏర్పాటు కావాలని.. అలాగే చంద్రబాబుకు ఆలోచన, జ్ఞానం పెరగాలని దుర్గమ్మను వేడుకున్నానని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాలు దిగ్విజయంగా పూర్తయ్యాయన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టీకే రాణా ప్రత్యేక చొరవ తీసుకున్నారని అభినందించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన ప్రతిపక్ష నేత చంద్రబాబు రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టం ఏపీకి జరగకూడదని సీఎం అడుగులు వేస్తున్నారని తెలిపారు. మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే మూడు రాజధానుల ఏర్పాటుకు నిర్ణయించారన్నారు. రాజధానిలో పేదలకు ఇళ్లు, స్థలాలు కేటాయిస్తే చంద్రబాబు కోర్టులో కేసులు వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. పదేళ్ల ఉమ్మడి రాజధానిని చంద్రబాబు ఎందుకు వదిలి వచ్చారో చెబితే బాగుంటుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ మాటా చంద్రబాబు నిలబెట్టుకోలేదన్నారు. రూ.150 కోట్లు దుర్గగుడి అభివృద్ధికి ఇచ్చానని ఆయన అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అమరావతి రాజధాని కాదని సీఎం జగన్ ఎక్కడ చెప్పారో నిరూపించాలన్నారు. రాజధాని అమరావతి కాబట్టే సీఎం జగన్ ఇల్లు ఇక్కడ కట్టుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబులా ఇంటిని హైదరాబాద్‌లో కట్టుకోలేదని కొట్టు సత్యనారాయణ చెప్పారు.

అమరావతి పాదయాత్రకు మళ్లీ నిరసన సెగ

- గోబ్యాక్ ఫేక్‌యాత్ర అంటూ నినాదాలు
- పెంటపాడు తదితర గ్రామాల్లో పాదయాత్రికులకు స్పందన నిల్



పెంటపాడులో అమరావతి యాత్రకు నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పెంటపాడు: అమరావతి రైతుల పాదయాత్రకు మరోసారి నిరసన సెగ తగిలింది. దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అది సాగే మార్గంలో బ్యానర్లు వెలిశాయి. పైగా పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం, ఉండి మండలాల పరిధిలో గురువారం కొనసాగిన యాత్రకు ప్రజల నుంచి కూడా ఎలాంటి స్పందనా లభించలేదు. దీంతో వారికి నిరాశే ఎదురైంది. మరోవైపు.. పెంటపాడు, కె.పెంటపాడు, పరిమెళ్ల గ్రామాలలో బుధవారం చేపట్టిన యాత్రకూ వైఎస్సార్‌సీపీ నేతలు బ్యానర్లు కట్టి నిరసన తెలిపారు. రైతుల ముసుగులో ఫేక్‌యాత్రలు నిర్వహిస్తున్నారంటూ విమర్శించారు. 'గోబ్యాక్ ఫేక్ యాత్ర' అంటూ, 29 గ్రామాల కోసం బాబు నకిలీ పోరాటం ఆపాలంటూ నినాదాలు చేశారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికే వికేంద్రీకరణ

కార్యక్రమానికి నాయకత్వం వహించిన పార్టీ జిల్లా కార్యదర్శి విజయానందరెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. జనామోదం, ప్రజాస్పందనలేని యాత్రలు చరిత్రలో నిర్వీర్యమవటం ఖాయమని తెలిపారు. కేవలం ఒక ప్రాంతంలోని వర్గానికి మాత్రమే అమరావతిని రాజధానిగా ఉంచాలనుకోవడం భ్రమ మాత్రమేనన్నారు. స్థానికుల నుంచి ఏమాత్రం స్పందన లేని యాత్రలు వృథాయేనని చెప్పారు. పెంటపాడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు, పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జామి కృష్ణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొలువూరి శివకిరణ్, పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు దేవాబత్తుల బాబి మాట్లాడుతూ.. అధికారంలో లేకపోయినా కేవలం అమరావతే తమ రాజధాని అనుకునే భ్రమలో టీడీపీ నాయకులు ఉన్నారన్నారు. ఒకే ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రజలు కొమ్ముకాయరన్నారు.

స్పందన లేని పాదయాత్ర

ఇక బుధవారం ఉ.9 గంటల నుంచి 12 గంటల వరకు సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్ర కేవలం మూడున్నర గంటలలోనే ముగిసింది. రైతుల పాదయాత్రకు మద్దతుగా ఈ ప్రాంతంలోని రైతులు వచ్చి దండలు వేస్తారని ఊహించిన యాత్రికులకు నిరాశే మిగిలింది.

అటవీ భూముల కబ్జాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం


అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఆరోపణల్లో వాస్తవం లేదని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న భూహక్కు–భూరక్ష సర్వే ద్వారా ప్రతి ఎకరానికీ నిర్దిష్టమైన సమాచారంతో యాజమాన్య హక్కులను గుర్తించే ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలోని అటవీప్రాంతాలకు సరిహద్దుగా ఉన్న గ్రామాల్లో అటవీభూములను కబ్జా చేసి, తప్పుడు పట్టాలు సృష్టించి భూములను తమ ఆధీనంలో ఉంచుకున్నారనే ఫిర్యాదులపై ఇప్పటికే ప్రభుత్వం దర్యాప్తు జరుపుతోందని తెలిపారు. దాదాపు పదివేల ఎకరాలకు సంబంధించి ఈ వివాదాలున్నాయని, వాటిపై అటవీ, రెవెన్యూ అధికారుల సంయుక్త సర్వే జరుగుతోందని పేర్కొన్నారు. దొంగ పట్టాలతో ఎవరైనా అటవీభూములను తమ ఆధీనంలో పెట్టుకుని వాటిలో పంటలు పండించుకుంటున్నా.. వదిలిపెట్టేది లేదని, సంయుక్త సర్వేలో పూర్తి వివరాలు వెలుగుచూస్తాయని హెచ్చరించారు.

చంద్రబాబుకు అమరావతి తప్ప మరో ధ్యాసే లేదు

వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత చంద్రబాబుకు అమరావతి తప్ప మరో ధ్యాసేలేదని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. దసరా పండగ పూట సతీమణితో కలిసి బెజవాడ కనక దుర్గమ్మ ఆలయానికి వెళ్లిన చంద్రబాబు అక్కడా అమరావతి గురించే మాట్లాడారని అన్నారు. ఎంఏ అర్థ శాస్త్రం చదివిన చంద్రబాబు అమరావతి నుంచి అమెరికా వరకు దేనిగురించైనా అనర్గళంగా విశ్లేషిస్తారని, తెలంగాణ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ గురించి మాత్రం మాట్లాడలేరని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఏపీలో ఎలాంటి రాజకీయ వైఖరి అవలంబిస్తుందోననే అలజడి ఆయనలో కనిపిస్తోందన్నారు.

వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

వికేంద్రీకరణతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని విజయసాయి రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్న ఉన్నత లక్ష్యంతో సీఎం జగన్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, పాలన కేంద్రీకరణతో ఇప్పటికే పలుమార్లు ఆంధ్రప్రదేశ్ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. సీఎం జగన్ మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని, లక్షలాది మహిళల సొంతింటి కలను నెరవేర్చే యజ్ఞానికి శ్రీకారం చుట్టారని అన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకం కింద 31 లక్షలకు పైగా ఇళ్లు నిర్మిస్తున్నారని, వీటి ద్వారా ఒక్కో మహిళకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన సంపదను అందిస్తున్నారని చెప్పారు. పాకిస్తాన్‌తో మాట్లాడబోమన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. స్టాండింగ్ కమిటీలకు చైర్మన్లుగా నియమితులైన ఎంపీలను అభినందించారు.

కాంట్రాక్టు గడువు పొడిగింపుపై ఒత్తిడి కుదరదు


- నీటి పారుదల శాఖ అధికారులకు హైకోర్టు స్పష్టీకరణ
- రీచ్ డ్రెడ్జింగ్ కంపెనీ కేసులో తీర్పు
- బ్యాంకు గ్యారెంటీలను కంపెనీకి ఇచ్చేయాలని ఆదేశం

సాక్షి, అమరావతి: ఒప్పందం ప్రకారం కాంట్రాక్టు గడువు ముగిసిన తరువాత దానిని పొడిగించుకోవాలని కాంట్రాక్టర్‌ను ఒత్తిడి చేయడానికి వీల్లేదని నీటి పారుదల శాఖ అధికారులకు హైకోర్టు తేల్చి చెప్పింది. ఒప్పందంలోని నిబంధనలను నెరవేర్చడంలో అధికారులు విఫలమైనప్పుడు కాంట్రాక్టు కంపెనీ బ్యాంకు గ్యారెంటీలను వెనక్కి ఇచ్చేయాలని, వాటిని నగదుగా మార్చుకోవడానికి, అట్టిపెట్టుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కృష్ణా నదిలో తవ్విన ఇసుక నిల్వకు నిబంధనల ప్రకారం రీచ్ డ్రెడ్జింగ్ లిమిటెడ్‌కు భూమిని కేటాయించకపోవడాన్ని తప్పుపట్టింది. కాంట్రాక్టు గడువు పొడిగించుకోవాలని ఆ కంపెనీపై నీటి పారుదలశాఖ అధికారులు ఒత్తిడి తేవడాన్ని ఆక్షేపించింది. తవ్విన ఇసుకకు రావాల్సిన బకాయిల వసూలుకు అందుబాటులో ఉన్న మార్గాలను చూసుకోవాలని రీచ్ డ్రెడ్జింగ్ లిమిటెడ్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఇటీవల తీర్పు వెలువరించారు.

కృష్ణా నది ప్రకాశం బ్యారేజీ వద్ద ఇసుక తవ్వకాలకు రీచ్ డ్రెడ్జింగ్ లిమిటెడ్ ఏడు రీచ్‌లను పొందింది. మూడు రీచ్‌లకే నీటి పారుదల శాఖ – రీచ్ డ్రెడ్జింగ్ మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం ఇసుక నిల్వకు 40 ఎకరాలకు బదులు 20 ఎకరాలనే అధికారులు కేటాయించారు. కంపెనీ ఇసుకను ఇందులో నిల్వ చేసింది. ఈ తర్వాత స్థలం చాలక పోవడంతో ఆ విషయాన్ని అధికారుల దృష్టికి కంపెనీ తెచ్చింది. ఇసుక తవ్వినందుకు రూ.3.11 కోట్లకు బిల్లులు కూడా సమర్పించింది. ఈ బిల్లులను చెల్లించేందుకు అధికారులు నిరాకరించారు. దీంతో కంపెనీ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. కంపెనీ తరఫు న్యాయవాది వీఆర్ఎన్ ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ.. ఒప్పందంలో పేర్కొన్న మేరకు ఇసుక తవ్వనందున కాంట్రాక్టు గడువు పొడిగించుకోవాలని, లేనిపక్షంలో బ్యాంకు గ్యారెంటీలు నగదుగా మార్చుకుంటామంటూ అధికారులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇసుక నిల్వకు తగినంత భూమి కేటాయించలేదన్నారు. నిల్వకు స్థలం లేనందున ఇసుకను తవ్వే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇసుక తవ్వకంపై కంపెనీ చెబుతున్న లెక్కలకు, అధికారుల లెక్కలకు తేడా ఉందన్నారు. దీనిపై పూర్తిస్థాయి పరిశీలన జరిపి వాస్తవాలను తేల్చాల్సి ఉందని, అందుకే బిల్లులు చెల్లించలేదని చెప్పారు.

నిజాన్ని రాయండి

- జర్నలిజాన్ని దిగజార్చవద్దు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం: నిజాలను నిర్భయంగా రాయడమే జర్నలిస్టుల కర్తవ్యమని, సంస్థల మెప్పుకోసమో, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకో అబద్ధాలను సృష్టించి జర్నలిజాన్ని దిగజార్చుకోవద్దని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి సూచించారు. చిత్తూరు జిల్లా పుత్తూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను మంగళవారం ఉగ్రాణపల్లిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ఈనాడు పత్రికలో ప్రచురితమైన అవాస్తవ కథనంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆనందం వ్యక్తం చేస్తుంటే.. అకస్మాత్తుగా వేరే పంచాయతీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తప్పతాగి ఎస్ఐ సాక్షిగా మంత్రి అని కూడా చూడకుండా తనను కులం పేరుతో దూషించాడని చెప్పారు. అతడిపై కేసు పెట్టాలని అక్కడే ఉన్న ఎస్ఐ, అధికారులు సూచించినా తాను వారించినట్లు తెలిపారు. అయితే ఉదయం నుంచి కనీసం కార్యక్రమానికే హాజరుకాని ఈనాడు విలేకరి తాను రెడ్లను తిట్టానని రాశారని చెప్పారు. కులాల మధ్య చిచ్చు పెట్టడం జర్నలిస్టుగా తగదన్నారు. రెడ్లు, ఎస్సీలు లేకుండా తనకు మనుగడ లేదని ఎప్పుడూ అంటుంటానని, అలాగే నియోజకవర్గంలో అన్ని సామాజికవర్గాలు ఆదరించడం వల్లే అత్యధిక మెజారిటీతో గెలుపొందానని చెప్పారు. తాను జగనన్న మనిషినన్నారు. కుల, మతతత్వాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయనని, అదే తాను సీఎం జగనన్న వద్ద నేర్చుకున్న విద్య అని పేర్కొన్నారు. నీతికి, నిజాయితీకి కట్టుబడి ఉంటూ పేదరికాన్ని చవిచూసిన వ్యక్తినన్నారు. తన మంచితనంపై పత్రికారూపంలో బురద చల్లేందుకు చూడకండని హెచ్చరించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
157	58
58,222	17,332

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,127	▽	22
డోజోన్స్	30,072	▽	202
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,997	▽	55
డాక్స్	12,471	▽	46
షాంఘై (సెప్టెంబర్ 30 ముగింపు)	3,024	▽	17
నికాయ్	27,311	△	191

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

తెలుగు రాష్ట్రాల్లో 179 కొత్త శాఖలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రణాళికలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే 6–9 నెలల్లో కొత్తగా 179 శాఖలు ఏర్పాటు చేయనుంది. వీటిలో 90 తెలంగాణలో, 89 ఆంధ్రప్రదేశ్‌లో ఉండనున్నాయి. ఇందుకోసం 5,000 మంది సిబ్బందిని బ్యాంక్ తీసుకోనుంది. వ్యాపారవర్గాల కోసం రూపొందించిన స్మార్ట్ హబ్ వ్యాపార్ యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్ (దక్షిణాది) తరుణ్ చౌదరి గురువారం ఈ విషయాలు తెలిపారు.



ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 588 శాఖలు ఉన్నట్లు చెప్పారు. పండుగ సీజన్‌లో 10,000 రకాల పైచిలుకు ఆఫర్లు కస్టమర్లకు అందిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, స్మార్ట్‌హబ్ యాప్‌తో చెల్లింపులు, బ్యాంకింగ్ సర్వీసులు పొందడం వ్యాపార వర్గాలకు సులభతరం అవుతుందన్నారు. గతేడాది జూలైలో ప్రయోగాత్మకంగా యాప్‌ను ప్రవేశపెట్టామని, ఈ నెలాఖరు నాటికి యూజర్ల సంఖ్య 10 లక్షలకు చేరుకోనుందని చౌదరి తెలిపారు.

బ్రిటానియా గూటికి కెనాఫ్రిక్

51 శాతం వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: బేకరీ ప్రొడక్టుల దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ తాజాగా కెన్యా కంపెనీ కెనాఫ్రిక్ బిస్కట్స్‌ను హస్తగతం చేసుకుంది. పూర్తి అనుబంధ సంస్థ బీపీడీసీఎల్ ద్వారా 51 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు బ్రిటానియా పేర్కొంది. ఇందుకు నగదు రూపేణా 13.87 కెన్యన్ షిల్లింగ్స్(రూ. 9.2 కోట్లు) చెల్లించినట్లు వెల్లడించింది. తద్వారా ఆఫ్రికా మార్కెట్లలోనూ అమ్మకాలను విస్తరించే వీలు ఏర్పడినట్లు తెలియజేసింది. కెన్యాసహా ఆఫ్రికా మార్కెట్లలో బిస్కట్ల తయారీ, విక్రయాలు చేపట్టే లక్ష్యంతో కెనాఫ్రిక్‌ను సొంతం చేసుకున్నట్లు వివరించింది. ఈ నెల 3కల్లా లావాదేవీని పూర్తిచేసినట్లు తెలియజేసింది. వెరసి కెనాఫ్రిక్ బిస్కట్స్ అనుబంధ సంస్థగా మారినట్లు తెలియజేసింది. మిగిలిన 49% వాటా కెనాఫ్రిక్ గ్రూప్ కలిగి ఉన్నట్లు వెల్లడించింది.

అపోలో హాస్పిటల్స్ చేతికి ఆయుర్‌వేద్

60 శాతం వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: ఆయుర్వేద ఆసుపత్రుల చైన్ ఆయుర్‌వేద్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేసినట్లు హెల్త్‌కేర్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ తాజాగా పేర్కొంది. రూ. 26.4 కోట్లు వెచ్చించి 60 శాతం వాటాను సొంతం చేసుకున్నట్లు వెల్లడించింది. తాజా పెట్టుబడులను కంపెనీ ప్రస్తుత ఆయుర్వేద కేంద్రాలను ఆధునీకరించడం, కొత్తవి ఏర్పాటు చేయడం, ఎంటర్‌ప్రైజ్ ప్లాట్‌ఫామ్స్‌ను బలోపేతం చేయడం తదితరాలకు వినియోగించనున్నట్లు వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2022–23)లో రూ. 15 కోట్ల టర్నోవర్ సాధించగలదన్న అంచనాలను రానున్న మూడేళ్లలో రూ. 100 కోట్లకు పెంచే లక్ష్యంతో ఉన్నట్లు తెలియజేసింది.

చమురు ఉత్పత్తికి ఒపెక్ కోత

- అంతర్జాతీయంగా పెరిగిన ధరలు
- పెట్రోల్, డీజిల్ రేట్ల సవరణ ఇప్పట్లో లేనట్టే!



న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ విక్రయాలపై లాభాలు కళ్లచూద్దామన్న ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్) ఆశలు ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. పెట్రోల్ ఉత్పత్తుల ధరలు దేశంలో ఆరు నెలలుగా ఒకే స్థాయిలో ఉండిపోయాయి. కేంద్ర ప్రభుత్వ పరోక్ష ఆదేశాలతో ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలు రోజువారీ రేట్ల సవరణను నిలిపివేశాయి. చమురు ఉత్పత్తికి కోత పెట్టాలని చమురు ఉత్పత్తి దేశాల సమాఖ్య (ఒపెక్) తాజాగా తీసుకున్న నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మళ్లీ పెరిగాయి. దీంతో రేట్ల సవరణ కూడా ఇప్పట్లో చేపట్టే అవకాశాల్లేవని తెలుస్తోంది. చమురు ధరలు ఇటీవలి గరిష్టాల నుంచి కొంత తగ్గుముఖం పట్టాయి. దీంతో చమురును ఉత్పత్తి చేస్తున్న దేశాల కూటమి ఒపెక్ రోజువారీగా 2 మిలియన్ బ్యారెళ్ల మేర తగ్గించుకోవాలని బుధవారం నిర్ణయం తీసుకుంది. ఇటీవల ధరలు తగ్గడంతో ఊపిరి పీల్చుకుంటున్న మన ఆర్థిక వ్యవస్థకు ఒపెక్ తాజా నిర్ణయం ప్రతికూలం కానుంది. మన దేశ ముడి చమురు అవసరాల్లో 85 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధరలను సవరించకపోవడం వల్ల చమురు మార్కెటింగ్ కంపెనీలు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఇటీవల ధరలు తగ్గడంతో డీజిల్ మినహా పెట్రోల్, గ్యాస్‌పై అవి ఎదుర్కొంటున్న నష్టాలు సున్నా స్థాయికి చేరాయి. లీటర్ డీజిల్‌పై నష్టం రూ.5కు తగ్గింది. కానీ, తాజా పరిణామంతో తిరిగి ఆయిల్ కంపెనీలకు నష్టాలు పెరిగిపోనున్నాయి. మరోవైపు రూపాయి మారకం విలువ క్షీణించడం కూడా చమురుపై నష్టాలను పెంచనుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

నష్టాల బాట..

ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయాలన్న కేంద్ర సర్కారు లక్ష్యానికి అనుగుణంగా పెట్రోలియం ఉత్పత్తుల విక్రయ ధరలను సవరించకపోవడంతో ఆయిల్ కంపెనీల నష్టాలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా జూన్ త్రైమాసికంలో మూడు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఉమ్మడిగా రూ.18,480 కోట్ల నష్టాలను నమోదు చేశాయి. భారత్ దిగుమతి చేసుకునే బ్యారెల్ ముడి చమురు ధర సెప్టెంబర్ 27 నాటికి 84.75 డాలర్లకు తగ్గగా, అక్టోబర్ 5 నాటికి తిరిగి 92.17 డాలర్లకు పెరిగిపోయింది. చమురు ధరల క్షీణత ఇలానే కొనసాగితే, ఏప్రిల్ నుంచి ఎదుర్కొన్న నష్టాల భారం నుంచి గట్టెక్కొచ్చన్న చమురు కంపెనీల ఆశలు తాజా పరిణామంతో చెదిరిపోయాయి. 2021 నవంబర్ 4 నుంచి ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ పెట్రోల్, డీజిల్ ధరల సవరణను నిలిపివేయడం గమనార్హం. మార్చి 22 తర్వాత తిరిగి ఇవి రేట్లను సవరించాయి. ఫలితంగా లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.10 మేర పెరిగింది. తిరిగి ఏప్రిల్ 7 నుంచి రేట్ల సవరణ నిలిచిపోయింది. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ లీటర్ ధర రూ.96.72, డీజిల్ ధర రూ.89.62 చొప్పున ఉంది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	51,838
బంగారం (99.5 స్వచ్ఛత)	51,630
వెండి (కిలో)	60,670

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-10-2022	
విశాఖ	430–00
చిత్తూరు	423–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	430–00
విజయవాడ	430–00
రిటైల్ ధర (డజను)	66.00
6-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	401–00
వరంగల్	403–00
రిటైల్ ధర	4.60

రెండో రోజూ మార్కెట్లు ప్లస్

- సెన్సెక్స్ 157 పాయింట్లు అప్
- 58,222 వద్ద ముగిసిన ఇండెక్స్
- 58 పాయింట్లు బలపడిన నిఫ్టీ



ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. ఇన్వెస్టర్లు ప్రారంభంలోనే కొనుగోళ్లకు ఎగబడటంతో సెన్సెక్స్ 513 పాయింట్లు ఎగసి 58,579కు చేరింది. చివరికి 157 పాయింట్ల లాభంతో 58,222 వద్ద ముగిసింది. తొలుత 17,428ను దాటిన నిఫ్టీ సైతం 58 పాయింట్లు జమ చేసుకుని 17,332 వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్లు అటూఇటుగా ఉన్నప్పటికీ విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్ల యూటర్న్ తీసుకోవడంతో సెంటిమెంటు బలపడినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఈ ఉత్సాహం రెండో రోజూ కొనసాగడంతో మార్కెట్లు రోజంతా లాభాల్లోనే కదిలినట్లు విశ్లేషించారు.

మెటల్స్ జోరు..: ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్, మీడియా, రియల్టీ, ఐటీ 3.2–1.6 శాతం మధ్య ఎగశాయి. ఎఫ్ఎంసీజీ, ఫార్మా 0.4 శాతం డీలాపడ్డాయి. బ్లూచిప్స్‌లో జేఎస్‌డబ్ల్యూ, సీఐఎల్, హిందాల్కో, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, ఐసీఐసీఐ, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫీ, యాక్సిస్, 5–1.5 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఇండస్‌ఇండ్, దివీస్, ఎస్‌బీఐ లైఫ్, బజాజ్ ఫైనాన్స్, బ్రిటానియా 2.6–1 శాతం మధ్య క్షీణించాయి.

స్టాక్ హైలైట్స్

- రూ. 1,000 కోట్ల అదనపు అత్యవసర రుణ సహాయం అందనున్న వార్తలతో చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ షేరు 8 శాతం జంప్‌చేసి రూ. 42 వద్ద ముగిసింది.
- కొన్ని షరతులకులోబడి సోనీ పిక్చర్స్‌తో విలీనానికి సీసీఐ అనుమతించడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ 4.6% ఎగసి రూ. 281 వద్ద ముగిసింది.
- ఉత్తర అమెరికా నుంచి క్లాస్8 ట్రక్కుల ఆర్డర్లు పెరగడంతో భారత్ ఫోర్జ్ షేరు 8 శాతం దూసుకెళ్లి రూ. 763 వద్ద ముగిసింది.

రూ'పాయే' @ 82.17

రూపాయి రికార్డుల పతనం ఆగట్లేదు. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం మొదటిసారి భారీగా 55 పైసలు నష్టపోయి 82 దిగువన 82.17 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ పటిష్టత, క్రూడ్ ధరలు స్థిరంగా ఉండడం దీనికి కారణం. రూపాయి మంగళవారం ట్రేడింగ్‌లో 20 పైసలు లాభపడి 81.62 వద్ద ముగిసింది. దసరా సందర్భంగా బుధవారం మార్కెట్‌కు సెలవు. గురువారం కొంత సానుకూలంగా 81.52 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81.51ని చూసినా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది.



సెప్టెంబర్‌లో సేవలపై ద్రవ్యోల్బణ భారం

- 54.3కు ఎస్అండ్‌పీ గ్లోబల్
- పీఎంఐ బిజినెస్ ఇండెక్స్
- ఆరు నెలల కనిష్టం



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం సెప్టెంబర్‌లో ఆరు నెలల కనిష్ట స్థాయిని చూసింది. మార్చి నుంచి ఎన్నడూ లేనంత స్థాయిలో కొత్త బిజినెస్ ఆర్డర్లు తగ్గాయి. ఆగస్టులో 57.2 వద్ద ఉన్న ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్, సెప్టెంబర్‌లో 54.3కు పడిపోయింది. ద్రవ్యోల్బణం ఒత్తిడులు, పోటీ పూర్వక పరిస్థితులు దీనికి కారణం. అయితే సూచీ 50లోపునకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. ఆపైన సూచీ ఉంటే, దానిని వృద్ధి ధోరణిగా పరిగణిస్తారు. ఈ లెక్కన గడచిన 14 నెలలుగా సేవల రంగం పురోగతి బాటన నడిచినట్లయ్యింది. ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం వాటా దాదాపు 60 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే.

సేవలు–తయారీ కలిపినా కిందకే..

మరోవైపు సేవలు, తయారీ రంగాలు కలిపిన ఎస్అండ్‌పీ కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా మార్చి నెల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఆగస్టులో 58.2 వద్ద ఉన్న సూచీ, సెప్టెంబర్‌లో 55.1కు పడిపోయింది. ప్రైవేటు రంగం అమ్మకాలు ఆరు నెలల కనిష్టానికి తగ్గాయి. ఒక్క తయారీ రంగాన్ని చూసినా, సెప్టెంబర్‌లో స్పీడ్ తగ్గింది. తయారీ రంగం స్పీడ్ సెప్టెంబర్‌లో 55.1కి తగ్గినట్లు మేనేజర్స్ ఇండెక్స్ పేర్కొంది. ఆగస్టులో సూచీ 56.2 వద్ద ఉంది. అయితే తయారీ రంగం వృద్ధి బాటన ఉండడం (50 పైన) వరుసగా ఇది 15వ నెల. దాదాపు 400 సంస్థల పర్చేజింగ్ మేనేజర్స్ నుంచి పొందిన సమాచారం ఆధారంగా ఎస్అండ్‌పీ గ్లోబల్ సూచీ రూపొందిస్తుంది.

సినిమా




● ప్రమోద్, రాజేష్ నాయర్, భూషణ్ కుమార్, ప్రభాస్, ఓం రౌత్, 'దిల్' రాజు, విక్కీ

త్రీడీలో నన్ను నేను చూసుకుని థ్రిల్లయ్యాను

– ప్రభాస్

''ఫస్ట్ టైమ్ 'ఆదిపురుష్' టీజర్‌ను 3డీలో చూసినప్పుడు నేను చిన్నపిల్లాడిని అయిపోయాను. 3డీ ఫార్మాట్‌లో నేను కనిపించడం నాకు గొప్ప అనుభూతినిచ్చింది.. థ్రిల్ అయ్యాను'' అని హీరో ప్రభాస్ అన్నారు. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆదిపురుష్'. రామాయణ ఇతిహాసం ఇతివృత్తం ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో రాముడి పాత్రలో ప్రభాస్, సీతగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో 'ఆదిపురుష్' 3డీ టీజర్‌ను ప్రదర్శించారు. ప్రభాస్ మాట్లాడుతూ – ''ఇండియాలో ఇప్పటివరకు వాడని టెక్నాలజీతో 'ఆదిపురుష్' తీశాం. బిగ్ స్క్రీన్ కోసం తీశాం'' అని అన్నారు. అతిథిగా పాల్గొన్న నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ – ''ఆదిపురుష్' టీజర్ ఎలా ఉందని నన్ను కొంతమంది అడిగారు. బాగుందని చెప్పాను. కానీ నా సిబ్బందిలో కొందరు 'ఆదిపురుష్' టీజర్ అలా ఇలా అని అనుకుంటున్నారని చెప్పారు. నేను ఒకటే చెబుతాను.. 'బాహుబలి పార్ట్ 1' అప్పుడు ఆ సినిమాను ట్రోల్ చేశారు. కానీ అదే రోజు నేను ప్రభాస్‌కు ఫోన్ చేసి 'సూపర్ హిట్' అన్నాను. 'లేదు.. భయ్యా..' అంటూ ఏదో మాట్లాడబోయాడు ప్రభాస్. లేదు.. సూపర్‌హిట్ నువ్వు హ్యాపీగా ఉండు అన్నాను. బిగ్ స్క్రీన్ ఫిలింస్ టీజర్లను సెల్‌ఫోన్స్‌లో అంచనా వేయలేం. వీఎఫ్‌ఎక్స్ సినిమాలను థియేటర్స్‌లోనే చూడాలి. అప్పుడే ఆ సినిమా ఏంటో అర్థం అవుతుంది. 'ఆదిపురుష్' కూడా అలాంటి సినిమాయే. టీజర్‌ని నేను ఫోన్‌లో చూసిన తర్వాత మళ్లీ పెద్ద స్క్రీన్‌పై చూశాను. ఇప్పుడు 3డీలో చూశాను. టీజర్ చూసి విజిల్స్ వేశాను. అలాగే రావణ పాత్రధారి పక్షి మీద ఎందుకు వస్తాడు? రాముడు ఇలా ఉంటాడా? అని చర్చలు జరుగుతున్నాయి. రామాయణం ఇతివృత్తాన్ని ఈ తరం ఆడియన్స్‌కు చెప్పేలా చేశారు. 'ఆదిపురుష్' మ్యూజికల్ ఫిల్మ్ అవుతుంది'' అన్నారు. ''ఆదిపురుష్'ను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు ఓం రౌత్.


టచ్ చేస్తే దీపావళే...



● విష్ణు

మంచు విష్ణు హీరోగా ఈషాన్ సూర్య దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జిన్నా'. డా. మోహన్‌బాబు ఆశీస్సులతో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై ఈ సినిమా రూపొందింది. సన్నీ లియోన్, పాయల్ రాజ్‌పుత్ కథానాయికలు. దీపావళికి ఈ సినిమాను తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. దసరాకి 'జిన్నా' ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నాకు డబ్బు ముఖ్యమే.. కానీ నా అనుకున్నవాళ్లు డబ్బు కన్నా ఎక్కువ ముఖ్యం' అంటూ మంచు విష్ణు చెప్పే డైలాగ్స్‌తో పాటు 'జిన్నా అంటే పొయ్యి మీద కరిగే వెన్న కాదురా.. లోడ్ చేసిన గన్ను.. టచ్ చేస్తే దీపావళే...' వంటి సంభాషణలతో ట్రైలర్ సాగుతుంది. ఈ చిత్రానికి మూలకథ: జి. నాగేశ్వర రెడ్డి, సంగీతం: అనూప్ రూబెన్స్, స్క్రీన్‌ప్లే, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కోన వెంకట్.

ఆస్కార్ బరిలో ఆర్ఆర్ఆర్



● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఆస్కార్ అవార్డుల నామినేషన్ రేస్‌లో 'ఆర్ఆర్ఆర్' నిలవనుంది. వచ్చే ఏడాది మార్చిలో 95వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనున్న సంగతి తెలిసిందే. 'ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని 'జనరల్' కేటగిరీకి దరఖాస్తు చేసినట్లుగా ఈ చిత్ర యూనిట్ గురువారం ప్రకటించింది. ''ఆర్ఆర్ఆర్' అద్భుత విజయానికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. కొంత కాలంగా 'ఆర్ఆర్ఆర్'పై, మాపై ఎంతగానో ప్రేమాభిమానాలు చూపిస్తున్నందుకు సంతోషిస్తున్నాం. ఇప్పుడు ఆస్కార్ పోటీలో నిలిచేందుకు జనరల్ కేటగిరీలో మేము దరఖాస్తు చేయడం జరిగింది'' అని 'ఆర్ఆర్ఆర్' టీమ్ సోషల్ మీడియాలో ఓ నోట్‌ను విడుదల చేసింది. ఎఫ్‌వైసీ (ఫర్ యువర్ కన్సిడరేషన్)గా ఆస్కార్ బరిలో 'ఆర్ఆర్ఆర్'ను నిలిపింది చిత్రబృందం. మొత్తం 14 విభాగాల్లో ఆస్కార్ బరిలో నామినేషన్ దక్కించుకునేందుకు 'ఆర్ఆర్ఆర్' పోటీపడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.

ఆయనతో తొలి హిట్ సాధించా!

– ఎస్ఎస్ తమన్



''గాడ్ ఫాదర్' ప్రీమియర్ తర్వాత చిరంజీవిగారు ప్రేమగా హత్తుకున్నారు.. సినిమా రిలీజ్ తర్వాత ఆయన ప్రశంసించడం మర్చిపోలేను. దర్శకుడు శంకర్‌గారు, సంగీతదర్శకులు మణిశర్మ, కోటిగార్లు ఫోన్ చేసి కంగ్రాట్స్ చెప్పారు. చాలామంది మెగా ఫ్యాన్స్ ఫోన్ చేసి, భావోద్వేగంగా మాట్లాడటం హ్యాపీ'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. చిరంజీవి హీరోగా మోహన్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాడ్ ఫాదర్'. సల్మాన్ ఖాన్, నయనతార, సత్యదేవ్ కీలక పాత్రలు చేశారు. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలైంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ – ''నేను తొలిసారి పని చేసిన హీరోలందరి సినిమాలు హిట్టయ్యాయి. ఇప్పుడు చిరంజీవిగారితో చేసిన తొలి సినిమా 'గాడ్ ఫాదర్' హిట్ అయి, నా సెంటిమెంట్‌ని కొనసాగించింది. నా ఆరేళ్ల వయసులో మా అమ్మగారితో కలిసి కోటిగారి రికార్డింగ్ స్టూడియోకి వెళ్లాను. 'అందం హిందోళం..' పాట రికార్డింగ్ జరుగుతోంది. ఆ పాట విని చిరంజీవిగారికి ఫ్యాన్ అయ్యాను. అప్పటి నుండి ఇంట్లో ఎప్పుడూ చిరంజీవిగారి పాటలే వాయిస్తూ ఉండేవాణ్ణి. చిరంజీవిగారు మహా వృక్షం. ఒక ఫ్యాన్‌గా నేను 'గాడ్ ఫాదర్' సినిమా చేశాను. ఆయన సినిమాకి మ్యూజిక్ చేయడం తేలికైన విషయం కాదు. పైగా మ్యూజిక్‌కి స్కోప్ లేని సినిమాలో మ్యూజికల్‌గా హై తీసుకు రావడం చాలెంజ్. లండన్‌లోని అబేయ్ రోడ్ స్టూడియోలో రికార్డ్ చేసిన తొలి భారతీయ చిత్రం 'గాడ్ ఫాదర్'. మనం ఓ కమర్షియల్ సినిమా చేద్దామని చిరంజీవి గారిని అడిగితే, చేద్దామన్నారు'' అన్నారు.

జోడీ సెట్



● రామ్ ● శ్రీలీల

రామ్ హీరోగా బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు శ్రీ లీలను ఎంపిక చేశారు. దసరా సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం ప్రారంభమైంది. తొలి షెడ్యూల్‌లోనే ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్.

జిలేబి షురూ



● శ్రీ కమల్, శివానీ రాజశేఖర్, త్రివిక్రమ్

'స్వయంవరం, నువ్వే కావాలి, నువ్వు నాకు నచ్చావ్, మన్మథుడు, మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాల దర్శకుడు కె. విజయ్ భాస్కర్ దర్శకత్వంలో 'జిలేబి' సినిమా షురూ అయింది. శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ కథానాయిక. వెంకట శ్రీనివాస్ బొగ్గరం సమర్పణలో ఎస్ఆర్కే బ్యానర్‌పై గుంటూరు రామకృష్ణ నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి హీరో రాజశేఖర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ బి. గోపాల్ దర్శకత్వం వహించారు. నిర్మాత 'స్రవంతి' రవి కిషోర్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. కె. విజయ్ భాస్కర్ మాట్లాడుతూ– ''చాలా విరామం తర్వాత నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'జిలేబి''అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: సతీష్ ముత్యాల.

సస్పెన్స్.. థ్రిల్



● రితికా, చైతన్య, పూరి ఆకాష్

చైతన్య పసుపులేటి, రితికా చక్రవర్తి జంటగా చిన్న వెంకటేష్ దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభమైంది. తెలుగు, తమిళ భాషల్లో వి. శ్రీనివాస రావ్ నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి సీన్‌కి ప్రొడ్యూసర్ రావ్ బోయపాటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో ఆకాష్ పూరి క్లాప్ ఇచ్చారు. చిన్న వెంకటేష్ మాట్లాడుతూ– ''సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రమిది. లవ్, ఫ్యామిలీ.. ఇలా అన్ని అంశాలు ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమాతో మా బ్యానర్‌కు మంచి పేరు వస్తుంది'' అన్నారు వి. శ్రీనివాస రావ్. ఈ చిత్రానికి సమర్పణ (తమిళ్): సాయికార్తీక్ గౌడ్, జాడి, కెమెరా: సుధాకర్ అక్కినపల్లి, సంగీతం: స్వరూప్ – హర్ష.

శ్రీ సత్యసాయి అవతారం



● పృథ్వీ, అర్చన, తనికెళ్ల భరణి

శ్రీ పుట్టపర్తి సత్యసాయిబాబా జీవితం ఆధారంగా 'శ్రీ సత్యసాయి అవతారం' సినిమా తెరకెక్కుతోంది. ప్రముఖ దర్శకుడు సాయిప్రకాష్ రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. బాబూ మోహన్, పృథ్వీ, అర్చన, కోట శంకర్రావు, శివపార్వతి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాయివేదిక్ ఫిలింస్‌పై డా. దామోదర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సి.హెచ్. మదన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలి సన్నివేశానికి నిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ, కె. అచ్చిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు తనికెళ్ల భరణి క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. సాయిప్రకాష్ మాట్లాడుతూ– ''దర్శకుడిగా నాకిది వందో సినిమా. మానవ సేవే మాధవ సేవ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఇందులో భారతీయ చిత్ర పరిశ్రమలోని నాలుగు వందల మంది నటిస్తున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జె.జి. కృష్ణ, కో ప్రొడ్యూసర్: గోపీనాథ్‌రెడ్డి.

ఒక ప్రేమ జంట



● రణధీర్, 'దిల్' రాజు


రణధీర్, నందిని జంటగా వినయ్ బాబు దర్శకత్వంలో బీసు చందర్ గౌడ్ నిర్మించిన చిత్రం 'సీతారామపురంలో ఒక ప్రేమ జంట. ఈ చిత్రం ట్రైలర్‌ను నిర్మాత 'దిల్ రాజు' ఆవిష్కరించి, మాట్లాడుతూ – ''ట్రైలర్ చూస్తుంటే దర్శకుడి ప్రతిభ అర్థమైంది. సినిమా ఘన విజయం సాధించాలి'' అన్నారు. ''నిజాయితీగా ప్రేమించుకున్న ప్రతి యువతీ యువకుడు చూడాల్సిన చిత్రం ఇది'' అన్నారు వినయ్ బాబు. ''ప్రతి ఒక్కరూ చూడాల్సిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. త్వరలో సినిమాను రిలీజ్ చేస్తాం'' అన్నారు బీసు చందర్ గౌడ్.

రారాజు వస్తున్నాడు



● యష్

'కేజీఎఫ్' ఫేమ్ యష్ 'రారాజు'గా రానున్నారు. మహేష్ రావు దర్శకత్వంలో యష్, రాధికా పండిట్ జంటగా నటించిన చిత్రం 'సంతు స్ట్రెయిట్ ఫార్వర్డ్'. కన్నడలో హిట్టయిన ఈ చిత్రాన్ని వీఎస్ సుబ్బారావు ఈ నెల 14న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. వీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ– ''యష్, ఆయన సతీమణి రాధిక నటించిన ఈ చిత్రం కన్నడలో పెద్ద సక్సెస్ అయ్యింది. తెలుగు ట్రైలర్‌కు, లిరికల్ సాంగ్స్‌కు మంచి స్పందన వచ్చింది. తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



చాక్‌పీస్ హంసవాహనం

కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలం అగినపర్రు గ్రామానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి వీరంకి వీరవంశీ సుద్దముక్కలు(చాక్‌పీస్)తో హంసవాహనం తయారు చేసి అబ్బురపరిచాడు. దసరాను పురస్కరించుకుని 1500 సుద్దముక్కలతో అడుగు ఎత్తు, రెండడుగుల పొడవు, అర అడుగు వెడల్పుతో రూపొందించిన ఈ వాహనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాడు. దీని తయారీకి 20 రోజులు పట్టిందని తెలిపాడు. - పమిడిముక్కల



అంబారీతో వెళ్తున్న గజరాజు

నేత్రపర్వంగా అంబారీ ఉత్సవం

మైసూరు ప్యాలెస్ ఆవరణలో బుధవారం సాయంత్రం చాముండేశ్వరి అమ్మవారి విగ్రహంతో కూడిన బంగారు అంబారీని ఎత్తుకుని ప్రధాన గజరాజు అభిమన్యు, ఇతర గజరాజులు ఐదు కిలోమీటర్ల దూరం జంబూ సవారీ యాత్ర సాగించాయి. దారి పొడవునా వేలాది మంది ఈ వేడుకను వీక్షించి నయనానంద భరితులయ్యారు. - మైసూరు

రూ.1.25 కోట్లతో మహాలక్ష్మీదేవి అలంకారం

అన్నమయ్య జిల్లా మదనపల్లె వాసవీ భవన్ వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిని దేవీనవరాత్రులలో భాగంగా రూ.1.25 కోట్ల కరెన్సీతో మహాలక్ష్మీదేవిగా బుధవారం అలంకరించారు. రూ.100 నుంచి రూ.500 వరకు నోట్లను మందిరం ముస్తాబుకు వినియోగించారు. - మదనపల్లె సిటీ



సీమ పరిశ్రమలకు పుష్కలంగా నీరు

ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక పార్కుల్లో రూ.759 కోట్లతో శాశ్వత నీటి వసతి

- ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ.428 కోట్లతో ప్రాజెక్టు
- శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఒక టీఎంసీ తరలింపు
- రూ.288 కోట్ల పనులకు నేడు శ్రీకారం
- వైఎస్సార్ జిల్లా కొప్పర్తి పారిశ్రామిక పార్కుకు బ్రహ్మంసాగర్ నుంచి నీరు
- రూ. 331 కోట్లతో 0.6 టీఎంసీల తరలింపు ప్రాజెక్టు

సాక్షి, అమరావతి: రాయలసీమ ప్రాంతంలో కొత్తగా అభివృద్ధి చేస్తున్న హైదరాబాద్ – బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కు, విశాఖ – చెన్నై కారిడార్‌లోని కొప్పర్తి పారిశ్రామిక పార్కుల్లో పరిశ్రమలకు నీరందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చే ఈ రెండు పారిశ్రామిక పార్కులకు రూ.759 కోట్లతో శాశ్వత నీటి వసతిని కల్పిస్తోంది. ఓర్వకల్లు పార్కుకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఒక టీఎంసీ నీటిని తరలించే ప్రాజెక్టుకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. రూ.428 కోట్ల ఖర్చయ్యే ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.288 కోట్ల విలువైన పనులకు రాష్ట్ర ఆర్థిక మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. ఓర్వకల్లు మండలంలో 11 గ్రామాల పరిధిలో 10,257 ఎకరాల్లో మల్టీ ప్రోడక్ట్ పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఇప్పటికే జైరాజ్ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 413.19 ఎకరాలు ఇచ్చామని, సిగచీ , ఆర్‌పీఎస్ ప్రాజెక్ట్స్, డెవలపర్స్ ప్రై. లిమిటెడ్, ప్రిమో పాలి ప్యాక్ పరిశ్రమలకు కూడా భూములు కేటాయించినట్లు తెలిపారు. వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో 6,739.73 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్, 801 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్ ఈఎంసీలకు రూ.331 కోట్లతో బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు ఏపీఐఐసీ ప్రణాళికను సిద్ధం చేసింది. మైదుకూరు నుంచి రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ పైప్‌లైన్ ద్వారా 0.6 టీఎంసీల నీటిని ఇక్కడికి తరలిస్తారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించనున్నట్లు ఏపీఐఐసీ తెలిపింది.

పారిశ్రామిక సీమగా రాయలసీమ : పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమను పారిశ్రామిక సీమగా అభివృద్ధి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిట్) నిధులతో మల్టీ ప్రోడక్ట్ పార్కుగా కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక పార్క్‌లను అభివృద్ధి చేస్తోంది. ఈ రెండు పారిశ్రామికవాడల్లో వేలాదిమందికి ఉపాధి లభిస్తుంది. ముఖ్యంగా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా 62,000 మందికి, పరోక్షంగా 77,000 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక్కడ రూ. 37,300 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తాయి. కొప్పర్తి పార్కులో దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. ఇక్కడ ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.75 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది.

'ఒంగోలు జాతి'కి పునరుజ్జీవం

- లాం ఫాంలో ఐవీఎఫ్–ఈటీటీ ప్రయోగాలు
- ఒక్కో ఆవు నుంచి ఏటా 150–200 పిండాల ఉత్పత్తి
- ఏటా 50 నుంచి 60 వరకు దూడల పునరుత్పత్తి
- 5–10 ఏళ్లలో ఒంగోలు జాతి పశువుల్ని రెట్టింపు చేయడమే లక్ష్యం



సాక్షి, అమరావతి: అంతరించిపోతున్న ఒంగోలు జాతి పశువుల పరిరక్షణకు ప్రభుత్వం నడుం బిగించింది. దేశంలోనే తొలిసారిగా కృత్రిమ గర్భధారణ (ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్–ఐవీఎఫ్), పిండమార్పిడి ప్రక్రియ (ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ–ఈటీటీ) ద్వారా ఈ జాతి పునరుత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. మేలుజాతి ఆవుల అభివృద్ధి పథకం కింద 2019లో రూ.4 కోట్లతో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్–ఈటీటీ ప్రయోగశాల ఫలితాలను రైతులకు మరింత చేరువ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఒంగోలు జాతి పశువుల పుట్టినిల్లు.. పెన్నా, కృష్ణానదుల మధ్య ప్రాంతం. ఒక ఈత కాలంలో 2,500 లీటర్ల పాల దిగుబడినిచ్చే ఈ జాతి పశువులు పూర్వం ప్రతి రైతు వద్ద నాలుగు నుంచి ఎనిమిది వరకు ఉండేవి. ప్రస్తుతం అంతరించిపోతున్న జాబితాలో చేరిన వీటిపై శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన గుంటూరు లాం ఫాంలోని పశుపరిశోధన కేంద్రం ప్రత్యేకంగా పరిశోధనలు చేస్తూ ఒంగోలు జాతి ప్రత్యుత్పత్తి, జీవసాంకేతికతలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా నిలిచింది. మూడేళ్ల కిందట ఏర్పాటైన ఈ అధునాతన పిండోత్పత్తి జీవసాంకేతిక ప్రయోగశాల ద్వారా ఒంగోలు జాతి పిండాలను ఉత్పత్తి చేయడం, వాటిని ఘనీభవింపజేసి నిల్వచేస్తున్నారు. తరువాత ఈ పిండాలను ఆవుల అద్దెగర్భాల్లో ప్రవేశపెట్టి దూడల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 787 పిండాలను తయారు చేసి భద్రపరిచారు. ప్రయోగశాలలోనే 70 ఒంగోలు దూడలుండగా వివిధ జిల్లాల్లో రైతులకు చెందిన ఆవుల అద్దెగర్భం ద్వారా 14 దూడలు జన్మించాయి.

ఫలదీకరణ ఎలా చేస్తారంటే?

ఐవీఎఫ్ ప్రక్రియ ద్వారా మేలుజాతి ఒంగోలు ఆవుల అండాశయం నుంచి సేకరించిన మాతృ జీవకణాలను 18 నుంచి 24 గంటలపాటు ఇంక్యుబేటర్‌లో భద్రపరుస్తారు. వాటిని ఒంగోలు ఆబోతు నుంచి సేకరించిన వీర్యకణాలతో సంపర్కింపచేసి ఫలదీకరణం తర్వాత ఏడురోజులు ఇంక్యుబేటర్‌లో పొదిగించి పిండాలను ఉత్పత్తి చేస్తారు. వీటిని నాటు ఆవుల అద్దెగర్భంలోకి పంపించి గర్భం దాల్చేలా చేస్తారు. వాటి జన్యు లక్షణాలు పుట్టే దూడలకు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. సామాజిక పరిభాషలో చెప్పాలంటే.. ఈ ప్రక్రియను 'టెస్ట్ ట్యూబ్ బేబీ టెక్నాలజీ' అంటారు. క్రమబద్ధీకరించిన ఆబోతు వీర్యాన్ని వాడడం ద్వారా పుట్టే దూడల్లో 90 శాతం వరకు ఆడ (పెయ్యి)దూడలు పొందే అవకాశం ఉంటుందని నిరూపితమైంది.

రైతులకు ఉచితంగా పంపిణీ

ఈ విధానంపై ఇప్పటికే పశుసంవర్ధకశాఖలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న 25 మంది పశువైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా రైతుల ఇంటివద్దే వారి ఆవుల్లో పిండమార్పిడి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్క పిండం తయారీకి రూ.10 వేల వరకు ఖర్చవుతుండగా, దేశవాళీ ఆవుల పరిరక్షణకు ప్రత్యేకంగా కృషిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించింది. అతిత్వరలోనే ఈ టెక్నాలజీని పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఐదు నుంచి పదేళ్లలో ఒంగోలుతో పాటు గిర్, పుంగనూరు జాతి ఆవుల సంతతిని కూడా గణనీయంగా పెంచేందుకు ఐవీఎఫ్ టెక్నాలజీ ఎంతో దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాల విజయవంతం కావడంతో ఇదే తరహాలో దేశవ్యాప్తంగా దేశీవాళీ ఆవుల పునరుత్పత్తి కోసం 30 ల్యాబ్స్ ఏర్పాటు దిశగా కేంద్రం అడుగులేస్తోంది.

రైతుల చెంతకు నూతన సాంకేతికత

లాం పరిశోధన కేంద్రం ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్నాయి. ఒంగోలు జాతి అభివృద్ధి కోసం ఈ కేంద్రం పాటుపడుతోంది. ఇప్పటివరకు 4,915 ఒంగోలు దూడలను ఉత్పత్తి చేశాం. 3,426 ఎద్దులు, దూడలు, ఆవులను పంపిణీ చేశాం. 10.56 లక్షల వీర్య డోసులను సేకరించగా, 9.67 లక్షల డోసులను రైతులు, ప్రభుత్వసంస్థలు, ఎన్జీవోలకు అందించాం. ఏపీ, తెలంగాణతో పాటు మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా సరఫరా చేస్తున్నాం. ఐవీఎఫ్ ద్వారా 787 పిండాలను ఉత్పత్తి చేశాం. ఐవీఎఫ్, ఈటీటీ సాంకేతికను అభివృద్ధి చేయడమే కాదు విజయవంతంగా అమలు చేస్తున్నాం. వందేళ్ల వేడుకల సందర్భంగా ఈ ఆధునాతన ప్రక్రియను రైతులకు చేరువ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఎం.ముత్తారావు, ఇన్‌చార్జి, పశుపరిశోధన కేంద్రం, లాం, గుంటూరు

ఆర్టీసీకి జై కొట్టిన ప్రయాణికులు

- రెగ్యులర్ చార్జీలతోనే రెట్టింపు ఆదాయం
- దసరాకు 4,500 ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- బస్సెక్కిన 1.84 లక్షల మంది ప్రయాణికులు
- 80 శాతం ఆక్యుపెన్సీ రేటుతో రూ.4.42కోట్ల ఆదాయం
- గతేడాది కంటే అధిక ఆదాయం

సాక్షి, అమరావతి: దసరా సీజన్‌లో కూడా రెగ్యులర్ చార్జీలే అమలు చేసిన ఆర్టీసీకి ప్రయాణికులు జై కొట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 4,500 సర్వీసుల్లో ఏకంగా 1.84 లక్షల మంది ప్రయాణాలు సాగించారు. 80 శాతం ఆక్యుపెన్సీ రేటుతో రూ.4.42 కోట్ల ఆదాయం సమకూర్చారు. కొత్త రికార్డు సృష్టించారు. వివరాల్లోకి వెళితే... దశాబ్దకాలంగా ఆర్టీసీ దసరా సీజన్‌లో అధిక చార్జీలు వసూలు చేస్తూ వచ్చింది. రెగ్యులర్ టికెట్ల కంటే 50శాతం పెంచడం పరిపాటిగా మారింది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి ఇది దోహద పడుతుందని భావించేవారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఉద్యోగుల జీతాల వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. రెండేళ్లుగా కరోనా ప్రభావంతో సర్వీసులే తక్కువగా నడిపారు. తొలిసారిగా ఈ ఏడాది దసరా సీజన్‌లో అధిక చార్జీలు వసూలు చేయకూడదని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 25 నుంచి దసరా వరకు 2,206 ప్రత్యేక సర్వీసులు నడిపింది. రెగ్యులర్ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడపడంతో ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల కంటే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికే ప్రాధాన్యమిచ్చారు. గతేడాది 150 శాతం చార్జీలు వసూలు చేసినా సరే రూ.2.10కోట్ల రాబడే వచ్చింది. ఆర్టీసీపై ప్రయాణికుల్లో పెరుగుతున్న ఆదరణకు ఈ దసరా సీజన్ ప్రతీకగా నిలిచింది. ఇదే స్ఫూర్తితో 10వ తేదీ వరకు 2,400 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది.

అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచానికే భారత్ ఆదర్శం

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- పుట్టపర్తిలో ఘనంగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



సత్యసాయి మహాసమాధి వద్ద గవర్నర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో గురువారం నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. 'వరల్డ్ స్పేస్ వీక్–2022' వీడియోను ఆవిష్కరించారు. గవర్నర్ మాట్లాడుతూ.. అంతరిక్ష పరిశోధనల ద్వారా సామాన్యులకు మరింత ప్రయోజనం కలగాలని ఆకాంక్షించారు. విపత్తు నిర్వహణ, వాతావరణం అంచనా, మత్స్యకారులకు సముద్ర నావిగేషన్, టౌన్ ప్లానింగ్, కమ్యూనికేషన్ తదితర రంగాల్లో ఇస్రో విశేష ప్రగతిని సాధించిందని కొనియాడారు. చంద్రయాన్, గగన్‌యాన్‌లతో ఇస్రో సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందన్నారు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు గవర్నర్ హరిచందన్.. సత్యసాయి మహాసమాధిని సందర్శించారు. కార్యక్రమంలో షార్ డైరెక్టర్ రాజరాజన్, డిప్యూటీ డైరెక్టర్ సెంథిల్, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సత్యసాయి యూనివర్సిటీ చాన్సలర్ చక్రవర్తి, కలెక్టర్ బసంత్ కుమార్, వరల్డ్ స్పేస్ వీక్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ మురళీధర్ పాల్గొన్నారు.

లాలీపాప్‌లతో వెరైటీ రికార్డు



దక్షిణాఫ్రికాకు చెందిన ఎస్ఎస్ఆర్ఐ అనే స్వచ్ఛంద సంస్థ లాలీపాప్‌లతో వెరైటీ గిన్నిస్ రికార్డు సృష్టించింది. లాలీపాప్‌లతో రికార్డు అనగానే వాటిని గుటుక్కుమనిపించడం వంటిదేదో అయ్యుంటుందిలే అని అనుకోకండి. ఎందుకంటే ఎస్ఎస్ఆర్ఐకి చెందిన 27 మంది వాలంటీర్లు డర్బన్ నగరంలోని ఓ బీచ్ ఒడ్డున లాలీపాప్‌లను ఒకదాని పక్కన ఒక లాలీపాప్‌ను పేర్చడం ద్వారా పాత రికార్డును బద్దలుకొట్టారు. ఇందులో విశేషం ఏముందంటారా? లాలీపాప్‌లతో ఒక కిలోమీటర్‌కుపైగా పొడవైన గీతను తయారు చేసినందుకే గిన్నిస్ నిర్వాహకులు అధికారికంగా దీన్ని రికార్డుగా గుర్తించారు. ఇందుకోసం ఎన్ని లాలీపాప్‌లు ఉపయోగించారో తెలుసా? ఏకంగా 11,602 లాలీపాప్‌లు! చూసేందుకు సాదాసీదాగా అనిపించినా దీన్ని సాధించేందుకు పెద్ద కసరత్తే జరిగింది. లాలీపాప్‌ల కొనలన్నీ ఒకదాన్ని ఒకటి తాకుతూ ఉంటేనే దీన్ని రికార్డుగా గుర్తిస్తామని గిన్నిస్ నిర్వాహకులు షరతు విధించారట. అలాగే ఒకసారి మొదలుపెట్టాక మళ్లీ వెనకాల పేర్చిన లాలీపాప్‌లను జరపడం వంటివి చేయరాదని తేల్చిచెప్పారట. అయినప్పటికీ వాలంటీర్లు కేవలం 90 నిమిషాల వ్యవధిలోనే దీన్ని చేసి చూపించారు. తద్వారా గతంలో 9,999 లాలీపాప్‌లతో తయారు చేసిన పొడవాటి గీత రికార్డును తిరగరాశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.